అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


భారత్‌పై అమెరికా అదనపు సుంకాల తొలగింపు!

ఫిబ్రవరిలో మిన్నెసోటాలో వేలాదిమంది ప్రదర్శనలు

ఇరాన్‌కు ట్రంప్ కవ్వింపు.. గల్ఫ్‌లోకి అమెరికా యుద్ధనౌకల గుంపు 02


సంపుటి 09, సంచిక: 57 | ఆదివారం | 25-01-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# విచారణకు సిద్ధం

## నైనీబ్లాక్ టెండర్‌పైనే కాకుండా 2014 నుంచి జరిగిన అన్ని టెండర్లపైనా విచారణ చేస్తాం



- త్వరలో అన్ని వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయ్ ● సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి ● వ్యక్తిగత ప్రయోజనాల కోసం బురద చల్లొద్దు ● సింగరేణి ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో రాబందులకు అప్పగించబోం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి ● మీడియాలో వస్తున్న వార్తలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్**

కేవలం నైనీ బ్లాక్ టెండర్‌పైనే కాకుండా 2014 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని టెండర్లపై కూడా విచారణ చేపట్టడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉన్నారని, రాష్ట్రానికి సిఎం రాగానే తాను స్వయంగా ఆయనతో మాట్లాడి విచారణకు ఆదేశించేలా చూస్తానని, అప్పుడు వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి, దీనిపై వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం బురదజల్లడం రాష్ట్రానికి నష్టం చేస్తుందని ఆయన హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినది ఆస్తులు దోచుకోవడానికి కాదని, ప్రజల ఆస్తులను కాపాడటానికే వచ్చానని, సింగరేణి కార్మికుల చెమటతో ఏర్పడిన ఈ ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో రాబందులకు అప్పగించబోనని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ తరువాయి 2లో

### కాంట్రాక్టు కంపెనీ, కాంట్రాక్టర్లు బిఆర్‌ఎస్ నేతలే

సింగరేణి సంస్థ టెండర్లను రాష్ట్ర ముఖ్యమంత్రి బావమరిదికి కట్టబెడుతున్నట్లు ఒక కట్టు కథను ప్రచారం చేస్తున్నారని, వారు పేర్కొన్నట్లుగా సృజన్ రెడ్డి కంపెనీ శోధా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి దీప్తి రెడ్డి అని, ఆమె మాజీ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కందాల ఉపేందర్ రెడ్డి కుమార్తె, ఆమె భర్త, ఆయన అల్లుడే సృజన్ రెడ్డి అని డిప్యూటీ సిఎం వివరించారు. సింగరేణి వ్యాప్తంగా పలు కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న ఐదు ప్రముఖ కాంట్రాక్టర్లు కూడా బిఆర్‌ఎస్ నేతలకు బంధువులు లేదా సన్నిహితులు అని భట్టివిక్రమార్క వెల్లడించారు. హరీశ్‌రావుకు కానీ ఇంకా ఎవరికైనా కానీ అనుమానాలు ఉన్నట్లయితే తనను కోరినట్లయితే వివరించేవారమన్నారు.



## ఓట్ చోరీ కుట్రలో ‘ఇసి’ కీలక భాగస్వామి

### గుజరాత్‌లో జరుగుతున్న ‘సర్’ వ్యూహాత్మక ఓటు చోరీ’ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** గుజరాత్‌లో ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్ ) జరుగుతోన్నదని, దీనిని ‘ప్రణాళికాబద్ధమైన’, ‘వ్యవస్థీకృతమైన’, ‘వ్యూహాత్మకమైన ఓటు చోరీ’గా భావిస్తున్నామని శనివారం కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఓటు చోరీ కుట్రలో కీలక భాగస్వామిగా మారిందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ‘ఒక వ్యక్తి, ఒక ఓటు’ అనే రాజ్యాంగ హక్కును నాశనం చేసే ఆయుధంగా రూపాంతరం చెందిందని, ఎవరు అధికారంలో ఉండాలో ప్రజలు కాదు, బిజెపి నిర్ణయించడం శోచనీయమన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎక్కడ ఉన్నా అక్కడ ఓటు చోరీ జరుగుతోందని ఆయన ఆరోపించారు.. ‘ఎస్‌ఐఆర్ పేరుతో గుజరాత్‌లో జరుగుతున్నది ఏవిధమైన పరిపాలనా ప్రక్రియ కాదని, బాగా ప్రణాళికాబద్ధంగా, వ్యవస్థీకృతంగా, వ్యూహాత్మకంగా ఓటు చోరీ’ అని రాహుల్ గాంధీ తన హిందీ ‘ఎక్స్’ పోస్ట్‌లో పోస్టింగ్ పెట్టారు. అత్యంత దిగ్భ్రాంతికరమైన, ప్రమాదకరమైన తరువాయి 12లో



# ఎగసిపడిన మంటలు




## నాంపల్లిలోని ఫర్నీచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

- అగ్నికీలల్లో చిక్కుకున్న తొమ్మిదిమంది?
- ఏడుగంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన 10 ఫైరింజన్లు
- దట్టమైన పొగలు వ్యాపించడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ● ఘటనాస్థలిని సందర్శించిన హైదరాబాద్ సిపి సజ్జనార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, మేయర్ విజయలక్ష్మి ● ప్రమాదంపై మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి, పూర్తిస్థాయి నివేదికకు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్**

హైదరాబాద్ నాంపల్లిలోని జి ప్లస్ ఫోర్ అంతస్థుల భవనంలో ఉన్న ‘బచాస్ ఫర్నీచర్ క్యాసిల్లో’ దుకాణంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9 మంది గల్లంతయ్యారు. 10 ఫైరింజన్లు ఏడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినా దట్టమైన పొగలు వ్యాపించడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఘటనా స్థలానికి హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎంపి హన్మంత్‌రావు, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్, ఫైర్ డిజి విక్రమ్‌సింగ్ మాన్‌తో పాటు పలువురు చేరుకుని సహాయ తరువాయి 2లో



## టిహబ్‌ను స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలి

### సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్**

టిహబ్ ను స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను టీహబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు. టిహబ్‌ను ప్రత్యేక స్టార్టప్‌ల కేంద్రంగానే ఉంచాలని చెప్పారు. ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా స్టార్టప్‌లకు కేంద్రంగా ఏర్పాటు చేసిన టి హబ్‌లో ఇతర ఆఫీసులు ఉండరాదని, అలాంటి ఆలోచనలుంటే విరమించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



## బెంగాల్‌లో ‘సర్’ తొందరపాటు చర్య

### నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ తీవ్ర అసంతృప్తి

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ‘సర్’ ప్రక్రియపై నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ అనవసరమైనదని, తొందరపాటుతో నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి ముప్పు కలిగించవచ్చని హెచ్చరించారు. బోస్టన్ నుండి పిటిఐతో మాట్లాడిన ఆర్థికవేత్త, ఓటర్ల జాబితా సవరణలు ప్రజాస్వామ్య విలువ, ఓటింగ్ హక్కులను బలోపేతం చేయగల తరువాయి 12లో

## తప్పు చేయకుంటే భయపడుతున్నారెందుకు?

హరీశ్‌రావు, కెటిఆర్‌ను ప్రశ్నించిన మంత్రి జూపల్లి



03

## యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమిద్దాం

ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్‌కుమార్ సిన్హా పిలుపు

## గవర్నర్ పదవికి ఆర్.ఎన్.రవి అవమానం

రాజ్యాంగ పదవిలో ఉండి అసెంబ్లీలో ప్రసంగించకపోవడం ఏమిటి? : సిఎం స్టాలిన్ 05

# ఎవరినీ వదలం



- అందరి బాగోతాలు బయటపెడతాం
- ధరణిలో లోపాలను అడ్డుపెట్టుకొని భూములు కాజేత
- రిజిస్ట్రేషన్ సొమ్ము దారిమళ్లించిన వారిని హెచ్చరించిన మంత్రి పొంగులేటి ● సిద్దిపేట, సిరిసిల్లలో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి ● త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విచారణ ● 4848 లావాదేవీల్లో లోటుపాట్లు గుర్తించినట్లు ధరణి అక్రమాలపై ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్**

ధరణి పోర్టల్‌లోని లోపాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ భూములను కాజేసిన వారిని, రిజిస్ట్రేషన్‌ల సొమ్మును దారి మళ్లించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో ధరణి అక్రమాలపై ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విచారణలో బయటపడిన అంశాలు, అక్రమాల్లో ఎవరి పాత్ర ఎంత, వెనుక ఎవరైనా ఉన్నారా, రెవెన్యూ అధికారుల ప్రమేయం ఉందా వంటి అంశాలపై కమిటీ సభ్యుల నుంచి సమాచారం సేకరించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 52 లక్షల లావాదేవీలు జరిగాయని, వాటిలో 35 లక్షలను పరిశీలించగా, ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు గుర్తించినట్లు కమిటీ మంత్రికి వివరించింది. విచారణ అనంతరం 1,109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయం చెల్లించలేదని వెల్లడించింది. ప్రాథమిక నివేదికను పరిశీలించి తరువాయి 2లో

# పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భద్రత కరువు

- అర్ధరాత్రి ఇళ్లపై దాడిచేసి హక్కుల కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తున్నారు
- ఈ చర్య ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు
- సివిల్ లిబర్టీ కమిటీ ఆందోళన ● అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భద్రత లేకుండా పోతోందని, అర్ధరాత్రి ఇళ్లపై పడి హక్కుల కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారిందని సివిల్ లిబర్టీస్ కమిటీ (సిఎల్‌సి) తెలంగాణ తీవ్రంగా ఖండించింది. హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎల్‌సి సీనియర్ నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు, సహాయ కార్యదర్శులు ఎం. కుమారస్వామి, రమేష్ చందర్, సభ్యులు జెల్ల లింగయ్య, సావిత్రి, ఎండి. సుఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జక్కా బాలయ్య (55) ను శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని ఆయన నివాసం నుంచి మఫ్టీలో వచ్చిన పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా పౌరహక్కుల ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న బాలయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా తరువాయి 2లో

## ఉక్రేన్–రష్యా ఒప్పందంపై

# సర్వత్రా సానుకూలత

**అబుదాబి :** నాలుగేళ్ళుగా జరుగుతున్న పూర్తిస్థాయి యుద్ధం ముగించేందుకు రష్యా–ఉక్రేన్ ప్రతినిధులమధ్య మొట్టమొదటిసారి ప్రత్యక్షంగా జరుగుతున్న చర్చలు శనివారం రెండోరోజు కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నగరం అబుదాబిలో కొనసాగాయి. సర్వత్రా నాయకులు సానుకూల ప్రకటనలు చేస్తున్నప్పటికీ భూభాగ సమస్య (ముఖ్యంగా దాన్‌బాస్) ఇంకా అపరిష్కృతంగానే ఉంది. ఈ సానుకూల వాతావరణం మధ్య రెండు దేశాలూ పరస్పరం దాడులు చేసుకున్నాయి. అరబ్ ఎమిరేట్స్ విదేశీమంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటన చేస్తూ, ఈ సంక్షోభానికి ఒక రాజకీయ పరిష్కారాన్ని గుర్తించడం, చర్చలను ప్రోత్సహించడంలో భాగంగా సంభాషణలు మొదలయ్యాయని తెలిపింది. చర్చల్లో కీలక విషయాలపై పురోగతి సాధించామని,భూభాగం సమస్య ఇంకా అపరిష్కృతంగానే ఉందని క్రెమ్లిన్ ప్రతినిధి దీమ్రీ పెస్కోవ్ తరువాయి 12లో

### రెండోరోజూ కొనసాగిన తొలి త్రైపాక్షిక చర్చలు



## అమెరికాలో 16 రాష్ట్రాలకు మంచు తుఫాను ముప్పు

### ఎమర్జెన్సీ తెర కింద 20 కోట్లమంది

**వాషింగ్టన్:** అమెరికాలో సగానికి సగం రాష్ట్రాలకు మంచు తుఫాను ప్రమాదం ముంచుకువచ్చింది. దాదాపు 16కు పైగా రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు గణనీయస్థాయిలో పడిపోయాయి. అనేకచోట్ల మైనస్ 41 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు క్షీణించాయి. ఇప్పటికే వేలాది విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మంచు తుఫాను పరిస్థితి అత్యంత ప్రమాదకరమైనదని, ప్రాణాలకు నష్టం కలుగుతుందని ప్రభుత్వం హెచ్చరించింది. టన్నులకొద్దీ మంచు వర్షం రూపంలో, బాస్కెట్‌బాల్ కంటే పెద్ద సైజుల్లో గట్టి ముద్దల రూపంలో మీద పడుతున్నాయి. గురువారం నుండి రాబోయే బుధవారం అంటే జనవరి 28వ తేదీ వరకూ ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రావొద్దని, నీరు, ఆహారం, దుప్పట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో తరువాయి 12లో



## సబ్జెరో మిన్నెసోటాలో వేలాదిమంది ప్రదర్శనలు



**మిన్నెపొలిస్:** అమెరికా మిన్నెసోటాలో ఐసిఇ వలస అధికారులు కారులో వెళుతున్న ఒక మహిళను కాల్చి చంపిన ఘటన తర్వాత రాజుకున్న నిరసన ప్రదర్శనలు గడచిన ఆరు వారాలుగా ఇంకా కొనసాగుతున్నాయి. సబ్జెరో మిన్నెసోటాలో శనివారం వేలాదిమంది ప్రజలు ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. మిన్నెసోటా నుండి ట్రంప్ మోహరించిన ఫెడరల్ బలగాలను తక్షణం తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శనివారం ఉదయం నుండి వందలమంది వ్యాపారులు తమ దుకాణాలు మూసివేశారు. మిన్నెసోటాలో ట్రంప్ ఆదేశం మేరకు ''ఆపరేషన్ సర్జ్'' పేరుతో వేలాదిమంది ఫెడరల్ భద్రతా సిబ్బందిని మోహరించారు. వారిని వెనక్కు మళ్లించాలని డిమాండ్ చేస్తుండగా అధికారులు మాత్రం వివిధ దేశాల నుండి అక్రమంగా వలస వచ్చిన నేరస్థులు మిన్నెసోటా వీధుల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నారని విమర్శించారు. మిన్నెసోటా గవర్నర్ కూడా ప్రజల డిమాండ్‌కు మద్దతు ఇస్తుండగా, ఆయన వైఖరి కారణంగా తమ కర్తవ్యాలను సరిగ్గా నిర్వర్తించలేకపోతున్నామని ఫెడరల్ భద్రతా సిబ్బంది ఆరోపిస్తున్నారు. నిర్వాహకులు స్కూలు, కార్యాలయాలను మూయించి అమెరికా ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ)కు వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మిన్నెసోటాలో ట్రంప్ ఆదేశాల మేరకు ఐసిఇ అధికారులు వలస ప్రజల ఏరివేత కార్యక్రమం ప్రారంభించారు. రెనీ గుడ్ (37) అనే మహిళను ఈ నెలారంభంలో ఐసిఇ అధికారులు కాల్చి చంపడంతో హింసాత్మక అల్లర్లు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో ట్రంప్ చాలా నిర్దయగా వ్యవహరిస్తున్నారని డెమొక్రటిక్‌పార్టీ ఎంపి థానేదార్ విమర్శించారు. అమెను కాల్చి చంపిన తర్వాత ఐసిఇ అధికారుల విధానాలపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి.

## ఇరాన్‌కు ట్రంప్ కవ్వింపు

# గల్ఫ్‌లోకి అమెరికా యుద్ధనౌకల గుంపు

**టెహ్రాన్ :** ఇరాన్‌పై కయ్యానికి కాలు దువ్వుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పంపించిన విమానవాహక యుద్ధ నౌకలు గల్ఫ్‌కు చేరుకున్నాయి. దీంతో ఇరాన్ సైన్యం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యుద్ధానికి సన్నద్ధమైంది. దాడి చేస్తే ఇరాన్‌పై పూర్తిస్థాయి యుద్ధంగా పరిగణిస్తామని, తీవ్రస్థాయిలో స్పందించి గుణపాఠం చెబుతామని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ తాజా ప్రకటనలో అమెరికాకు హెచ్చరిక చేసింది. అత్యంత ఘోరమైన యుద్ధ పరిస్థితులను కూడా ప్రతిఘటించేందుకు దేశం అప్రమత్తమైందని తెలిపింది. యుద్ధ నిపుణులు, విశ్లేషకుల సమాచారం ప్రకారం, ఇరాన్ వద్ద తగినన్ని క్షిపణులు, గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. సహేతుకమైన యుద్ధసామర్థ్యం ఉందని గత ఏడాది జూన్‌లో ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్‌లోకి చొచ్చుకుపోయిన అనేక ఇరాన్ క్షిపణులు నిరూపించాయి. ఈ దాడుల్లో అనేక మంది ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. ఇరాన్ వద్ద స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థలు ఉన్నాయి.ఇరాన్‌లో పరిణామాలను వైట్‌హౌస్ చాలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నది. ఫైటర్ జెట్స్, గైడెడ్ మిస్సైల్ వ్యవస్థలు, క్షిపణులతో కూడిన యుద్ధ విధ్వంసక ఆయుధవాహక నౌక గల్ఫ్ దిశగా వెళుతోందని గురువారం ట్రంప్ ప్రకటించారు. అంతకుముందు జనవరి 15వ దీన పెంటగాన్



కూడా యుద్ధ వాహక నౌకను పంపిస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్‌లో అల్లర్లు చెలరేగిన సమయంలో అరెస్టు చేసిన ఇద్దరికి శనివారం ఉరిశిక్ష అమలు చేయాల్సి ఉండగా, యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితుల మధ్య ఈ ఉరిశిక్షను ఇరాన్ ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. పూర్తిస్థాయిలో యుద్ధానికి ఇరాన్ దేశం తన సైన్యాన్ని అప్రమత్తం చేసిందని ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో ప్రతి రంగం, ప్రతి విభాగం, ప్రాంతం అప్రమత్తంగా ఉందని పేరు చెప్పడానికి నిరాకరించిన అధికారి ఒకరు టెహ్రాన్‌లో రాయిటర్స్ వార్తాసంస్థకు తెలియజేశారు. ఏ రూపంలో దాడులు జరిగినా పూర్తిస్థాయిలో ప్రతిఘటించేందుకు దేశం అప్రమత్తంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇజ్రాయెల్ గత ఏడాది క్షిపణి దాడులు చేసినప్పటికీ తమ వ్యవస్థలకు పెద్దగా నష్టం వాటిల్లలేదని ఆయన తెలిపారు. అమెరికా,ఇజ్రాయెల్ వరుస దాడుల తర్వాత ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను మరింత బలంగా తీర్చిదిద్దుకునే పనిలో నిమగ్నమైంది. ఇందుకోసం కీలక భాగాలను చైనా నుండి తెచ్చుకుంటున్నది. హెచ్‌క్యూ–9బి దీర్ఘశ్రేణి గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థలను దేశానికి కవచంగా తెచ్చుకునేందుకు చైనాతో ఇరాన్ ప్రస్తుతం మంతనాలు చేస్తోందని 'టెలిగ్రాఫ్' పత్రిక పేర్కొంది. మరోవైపు అమెరికా జాతీయ రక్షణవ్యూహ పత్రంలోని వివరాలను టాస్ పత్రిక చర్చిస్తూ, ఒకవేళ ఇరాన్ గనుక అణ్వాయుధాలను సేకరించే ప్రయత్నం చేస్తే ఆ ఆటలు సాగనివ్వబోమని ప్రకటించిన విషయాన్ని ప్రముఖంగా ప్రచురించింది. ఇరాన్‌కు హెచ్చరికలు చేసినప్పటికీ ఆ దేశం లక్ష్యపెట్టడంలేదని పత్రం పేర్కొంది. ఇరాన్‌లో ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినప్పటికీ అక్కడి అంతర్గత పరిస్థితులు వెలుగుచూస్తూనే ఉన్నాయి. 1979లో ఇస్లామిక్ రివల్యూషన్ తర్వాత ఇటీవల వచ్చిన అతి తీవ్రమైన హింసాత్మక ఉద్యమాన్ని ఖమేనీ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది. ఈ హింసాత్మక ప్రజా ఉద్యమంలో దాదాపు 5000 మంది మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వమే స్వయంగా ప్రకటించింది. ఇరాన్‌వ్యాప్తంగా అనేక నగరాలు, పట్టణాలు, గ్రామాలలో ప్రధాన మౌలిక సదుపాయాలు, మసీదులు, ప్రభుత్వ కార్యాలయాలు మంటల్లో దగ్ధమయ్యాయి. దాదాపు 125 మిలియన్ డాలర్ల మేరకు దేశంలో నష్టం జరిగిందని అధికారులు అంచనావేసినట్లు అధికార పత్రిక 'ఇర్నా'ను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ నివేదికలు తెలిపాయి. దాదాపు 20 నగరాలలో పెను విధ్వంసం జరిగింది. గత ఏడాది డిసెంబరు 28 నుండి దాదాపు 18 రోజులపాటు ఇరాన్‌ను హింసాత్మక ప్రదర్శనలు కుదిపేశాయి. దీంతో ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేశారు. నిరసన ప్రదర్శకులను అణచివేస్తే అమెరికా నేరుగా జోక్యం చేసుకుంటుందని, ప్రదర్శకులకు సహకారం అందజేస్తామని ప్రకటించారు. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పుకు సమయం ఆసన్నమైందని, ఖమేనీ తప్పుకోవాలని ట్రంప్ బాహాటంగా ప్రకటనలు చేశారు. ఇరాన్‌లో కూడా ఖమేనీ వ్యతిరేక ప్రదర్శనలు పెరిగాయి. ఆ తర్వాత తీవ్రంగా ఈ ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేసింది. ప్రవాసంలో ఉన్న ఇరాన్ యువరాజుగా ప్రకటించుకున్న రెజీ పహ్లవి ప్రదర్శకులకు ఇచ్చిన పిలుపుతో ఆ దేశంలో హింస మరింతగా పెరిగింది. దాదాపు 400 నగరాలు, పట్టణాల్లో హింస రేగింది

# భారత్‌పై అమెరికా అదనపు సుంకాల తొలగింపు!

## స్కాట్ బెస్సెంట్ సంకేతాలు

**వాషింగ్టన్ :** భారత్‌పై అమెరికా విధించిన 25 శాతం అదనపు సుంకాలు తగ్గించుకునే అవకాశం ఉందని ఆ దేశ ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ సూచనాప్రాయంగా చెప్పారు. రష్యా నుండి దిగుమతి చేసుకునే చమురును భారత్ గణనీయంగా తగ్గించుకుందని ఆయన అన్నారు. గత ఏడాది ఏడాది నవంబరులో ట్రంప్ కూడా ఇలాంటి ప్రకటనే చేశారు. ఒకేసారి రష్యానుండి చమురు దిగుమతులను భారత్ తగ్గించుకోలేదని, మెల్లమెల్లగా తగ్గించుకుంటుందని అన్నారు. అమెరికా వాణిజ్యమంత్రి హోవర్డ్ లుత్విక్ ఇటీవల చేసిన ప్రకటనకు భిన్నంగా, భారత్–అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కూడా బహుశా పురోగతి సాధిస్తాయని స్కాట్ బెస్సెంట్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో చెప్పారు.
భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమ అధ్యక్షుడు ట్రంప్‌కు ఫోన్ కాల్ చేయకపోవడంవల్లనే రెండు దేశాలమధ్యా వాణిజ్య ఒప్పందం కుదరకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా హోవర్డ్ లుత్విక్ గతంలో చెప్పారు. ఐతే భారతదేశం ఆయన ప్రకటనను తిరస్కరించింది. రెండు దేశాలమధ్యా వాణిజ్య చర్చలు పురోగతి సాధించే దిశగా వెళుతున్నాయని భారత్‌లో అమెరికా దౌత్యవేత్తగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సెర్గీ గోర్ చెప్పడంతో మళ్లీ భారత్ ఆశలు చిగురించాయి. ఈ పరిస్థితులమధ్య 25 శాతం అదనపు సుంకా రద్దు చేస్తామని స్కాట్ బెస్సెట్ సంకేతాలు ఇచ్చారు. భారత్ నుండి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై ఈ అదనపు సుంకాలు తగ్గిస్తే ఇక మన టారిఫ్‌లు 25 శాతానికి చేరుకుంటాయి. దేశీయ ఎగుమతిదారులకు ఊరట కలుగుతుంది. గడచిన ఆగస్టునెలలో ట్రంప్ అనేక దేశాలపై సుంకాల భారాలు వేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు నిధుల సరఫరా లేకుండా చేసేందుకు భారత్‌పై అమెరికా తీవ్రమైన ఒత్తిడి చేసింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా 25 శాతం సుంకాలు విధించడంతో భారత్–అమెరికా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఐతే స్కాట్ బెస్సెంట్ తాజా ప్రకటన చేస్తూ, రష్యా నుండి భారతదేశం చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గించడం తాము సాధించిన విజయమని ప్రకటించారు. త్వరలో భారత్‌పై సుంకాలు తగ్గించే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇటీవల జరుగుతున్న అంతర్జాతీయ పరిణామాలలో కూడా భారత్ జోక్యం చేసుకోకుండా మౌనం పాటిస్తూ వచ్చింది. పశ్చిమ ఆసియాలో శాంతి పేరుతో ట్రంప్ ఏర్పాటు చేసిన ''బోర్డ్ ఆఫ్ పీస్''లో చేరకుండా, సమాధానం చెప్పకుండా చైనా,రష్యా,ఫ్రాన్స్,కెనడాల సరసన చేరడం కూడా స్కాట్ బెస్సెంట్ ప్రకటన వెనుక కారణంగా భావిస్తున్నారు. రష్యా చమురు దిగుమతి పేరుతో భారత్‌పై అదనపు సుంకాలు వసూలు విధించడంవల్ల భారత్‌పై 50 శాతం సుంకాల భారం పడింది.

## ఇండోనేషియాలో కొండ చరియలు పడి

# 8 మంది సజీవ సమాధి: 82 మంది గల్లంతు

**జకర్తా:** ఇండోనేసియాలో కొండచరియలు విరిగి పడటంతో ఏడుగురు భూస్థాపితమయ్యారు. మరో 82 మంది జాడ తెలియకుండా పోయారు. బాండుంగ్ ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. వారికోసం సహాయ బృందాలు తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు చేస్తున్నాయి. పశ్చిమ జావా రాష్ట్రంలో విపరీతమైన వర్షాలు, భారీ వరదల కారణంగా కొండచరియలు, మట్టిపెళ్లలు విరిగి గ్రామాలమీద పడుతున్నాయని సహాయ బృందాలు తెలియజేశాయి. గాయపడినవారికోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని ఇండోనేషియా నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం తెలియజేసింది. పశ్చిమజావాలో ఒక వారం రోజులపాటు ప్రకృతి వైపరీత్యాలుంటాయని వాతావరణ అధికారులు ముందుగానే ప్రకటించారు. ఇండోనేషియా ఉత్తర సుమత్రా, పశ్చిమ సుమత్రా, ఏసెక్ రాష్ట్రాలలో గతనెలలో సంభవించిన ప్రకృతి ఉపద్రవాలు, వర్షాలు, వరదల కారణంగా 1.070 మంది మరణించారు. ఈ పరిస్థితుల నుండి కోలుకోకముందే పశ్చిమ జావాలో ఈ విలయం సంభవించింది.

**న్యూజిలాండ్‌లో ఆరుగురు సజీవమరణం**

న్యూజిలాండ్‌లో గురువారం కొండచరియకలు విరిగిపడి ఆరుగురు భూస్థాపితమైన ఘటనలో సహాయ బృందాలు గాలింపు చర్యలను నిలిపివేశాయి.



మృతదేహాలను స్వాధీనం చేసుకున్న దశలో ఈ గాలింపు నిలిపివేశారు. వారిని బంధువులకు అప్పగించి ఇళ్లకు తరలించేందుకు సాధ్యం కాదని, అయితే మృతులను గుర్తించే ప్రయత్నం జరుగుతోందని అధికారులు చెప్పారు. మరణించినవారిలో 15 ఏళ్ల వయసుగల టీనేజర్లు ఉన్నారు. మట్టిపెళ్లలమధ్యలో శుక్రవారం రాత్రి మానవ శిథిలాలు ముక్కలు ముక్కలుగా కనిపించడంతో సిబ్బంది వాటిని వెలికితీసి గాలింపు నిలిపివేశారు.

## ఎగసిపడిన మంటలు (మొదటి పేజీ తరువాయి)



చర్యల్లో నిమగ్నమయ్యారు.గల్లంతైన వారిలో వాచ్‌మెన్ కుటుంబ సభ్యులైన అఖిల్ (7), ప్రణీత్ (11)తో పాటు ఆటో డ్రైవర్ హబీబ్ (30), మరో వర్కర్ ఇంతియాజ్ (28), వాచ్‌మెన్ బేబి (45)లతో పాటు మరో నలుగురు ఉన్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వరకు కూడా సహాయ చర్యలు కొనసాగుతునే ఉన్నాయి. జి ప్లస్ నాలుగు అంతస్థుల భవనంలో బాచా ఫర్నిచర్ షాప్ ఉంది. ఇక్కడ రెండు అంతస్తులు సెల్లార్‌లు ఉండగా మూడు అంతస్థుల్లో ఫర్నిచర్ షాప్ నిర్వహిస్తున్నారు. మొదటి సెల్లార్‌లో మొదట మంటలు వ్యాపించి పై సెల్లార్‌తో పాటు పై అంస్థలకు మంటలు పాకాయి. సెల్లార్ మొత్తం ఫర్నిచర్‌తో నిండి ఉండటంతో రక్షణ చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. భవనం మొత్తం నాలుగు అంతస్తుల వరకు మంటలు వ్యాపించగా, దట్టమైన పొగ కారణంగా సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. ప్రస్తుతం ఎనిమిది అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి. ప్రత్యేక రెస్క్యూ బృందం ఐదో అంతస్తు నుంచి భవనంలోకి ప్రవేశించి ఎవాక్యుయేషన్, రెస్క్యూ చర్యలు చేపట్టింది. ఈ అగ్నిప్రమాదంతో అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉద్రిక్తత నెలకొంది. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఎలాంటి ప్రాణ నష్టం లేదని అధికారులు తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారుల వివరాల ప్రకారం మధ్యాహ్నం 1:42 గంటలకు ప్రమాద సమాచారం అందడంతో వెంటనే 10 ఫైర్ టెండర్లను సంఘటనా స్థలానికి పంపించారు. భవనం చుట్టుపక్కల ప్రాంతమంతా పొగ కమ్ముకోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాథమిక విచారణలో, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఫర్నిచర్ షాపులోనే మంటలు చెలరేగినట్లు గుర్తించారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అవి వేగంగా పైఅంతస్తులకు వ్యాపించాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దీనిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని అధి కారులు తెలిపారు.అగ్నిప్రమాదంతో నాంపల్లి, కోఠి, ఆబిడ్స్, బేగంబజార్, మోజంజాహిమార్కెట్, విజయ్‌నగర్ కాలనీ, ఏక్‌మినార్ మజీద్ తదితర ప్రాంతాలలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పాటు ఎగ్జిబిషన్‌కు ఎవరు రావద్దని విసి సజ్జనార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి.. :** నాంపల్లి స్టేషన్ రోడ్ ఫర్నిచర్ మాల్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంటలు వ్యాపించకుండా పక్క భవనాలు ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ తో మాట్లాడి ఘటనా స్థలానికి వెళ్లాలని ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బాధితులను వెంటనే ఆదుకోవాలని అధికారులకు సూచించారు.

**ఫైర్ డిజి విక్రమ్ సింగ్ మాన్... :** కింద రెండు సెల్లార్లు ఉన్నాయి, జి ప్లస్ ఫోర్ అంతస్తుల భవనం మొదటి సెల్లార్‌లో ఫర్నిచర్‌కు సంబంధించిన మెటీరియల్స్ అంతా డంప్ చేయడం వల్ల సహాయక చర్యలకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఇందులో పని చేసే కార్మికులు కూడా రెండవ సెల్లార్‌లో ఉన్నారు. హైదరాబాద్‌లో సెల్లార్లకు పర్మిషన్ లేదు. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణమని తెలుస్తుంది.

### అత్యంత విషాదకరం : సిపిఐ

నాంపల్లి అగ్ని ప్రమాద సంఘటన అత్యంత విషాదకరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ అన్నారు. నాంపల్లిలోని బచ్చా ఫర్నిచర్ కాంప్లెక్స్ అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని శనివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్‌తో కలిసి ఈటి నరసింహా సందర్శించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో అనేక వ్యాపార కాంప్లెక్స్ లలో ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేకపోవటం సెల్లార్ లాంటి ప్రాంతాలను కూడా కమర్షియల్ గా వాడుకోవటం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నయన్నారు.నగరంలో కమర్షియల్ భవన సముదాయాల తనిఖీలకు సంబంధించి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన టాస్క్ ఫోర్సు కమిటీలు ఏర్పాటు చేసి వి ఎక్కడకక్కడ ఫైర్ సేఫ్టీ లేని కాంప్లెక్స్ లను , గడువు ముగిసిన బిల్డింగులను కూల్చివేయాలని విజ్ఞప్తి చేశారు.

# పోలీసుల అదుపులో పౌరహక్కుల సంఘం నాయకులు





**ప్రజాపక్షం/అచ్చంపేట :** మావోయిస్టులను పూర్తిస్థాయిలో అంతమొందించాలని జల్లెడపడుతున్న కేంద్ర బలగాలు ఛత్తీస్‌ఘడ్ అడవులలో జల్లెడపడుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో కొందరు కేంద్ర కమిటి అగ్రనేతలు వివిధప్రాంతాలలో తలదాచుకుంటున్నారనే ప్రచారంతో ఎస్‌టిఎఫ్ పోలీసులు శుక్రవారం రాత్రి అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూర్, వంకేశ్వరం, రాయవరం గ్రామాలలో ముగ్గురు పౌరహక్కుల సంఘం కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరు కొందరు అగ్రనేతలకు ఆశ్రయం ఇచ్చారని ఇంటలిజెన్స్‌వర్గాలకు అందిన సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్నవారిలో రాష్ట్ర పౌరహక్కుల సంఘం కార్యదర్శి జక్కా బాలయ్యను మన్ననూరు గ్రామంలో ఇంట్లో ఉండగా సివిల్‌డ్రెస్‌లో వచ్చి తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అదేవిధంగా పదర మండలం వంకేశ్వరం గ్రామానికిచెందిన ప్రజాఫ్రంట్ రాష్ట్రనాయకుడు అంబయ్యను అచ్చంపేట పట్టణంలో ఉండగా రాత్రి ఇంట్లోకి వెళ్లి తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లింగాల మండలం రాయవరం గ్రామానికిచెందిన యాదయ్య అనేవ్యక్తి అచ్చంపేట పట్టణంలో ఉండగా రాత్రి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీరితోపాటు ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులనుకూడా అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్‌టిఎఫ్ వర్గాలు ఈఐదుగురు వ్యక్తుల సహకారంతో మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ అగ్రనాయకుడు షెల్టర్ పొందుతున్నాడనే అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫోన్‌చేయగా సమాచారం దాటవేశారు.

**కుటుంబసభ్యుల ఆందోళన..**

ఒక్కసారిగా అచ్చంపేట నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి సివిల్ డ్రెస్‌లో ఉన్న ఎస్‌టిఎఫ్ యంత్రాంగం ఏకకాలంలో దాడులుచేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలీసులు సమాచారం ఇవ్వకపోవడం వలన భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు విచారణ జరిపినకాని తమకు సమాచారం ఇవ్వాలని లేనిచో తామూ ఆత్మహత్య చేసుకుంటామని కుటుంబీకులు తెలుపుతున్నారు.

## భద్రత కరువు (మొదటి పేజీ తరువాయి)

కూడా సేవలందించారని వెల్లడించారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తలుపు తట్టి, మిత్రుడి పేరుతో మోసం చేసి, లోపలికి ప్రవేశించిన సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు ఎలాంటి వివరాలు చెప్పకుండా బాలయ్యను బలవంతంగా తీసుకెళ్లారన్నారు. ఈ అరెస్టుతో తమకు ఎలాంటి సంబంధం లేదని అమ్రాబాద్ పోలీసులు ప్రకటించడం అనుమానాలకు తావిస్తోందని, బాలయ్య ప్రాణాలకు ముప్పు ఉండవచ్చన్న ఆందోళన ఆయన కుటుంబసభ్యుల్లో నెలకొందని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ ఇదే తరహాలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉపాధ్యక్షుడు ఎడ్ల అంబయ్య (48) ను కూడా అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అంబయ్య విషయంలో కూడా పోలీసుల వివరాలు ఆయన భార్యకు తెలియజేయలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణ రావు మాట్లాడుతూ లింగాల మండలం క్యాంపు రాయవరం గ్రామానికి చెందిన మాదం శెట్టి యాదయ్య (50) ను 23న రాత్రి 10.30 గంటలకు అరెస్టు చేశారని, ఆయనతో పాటు మరో ఇద్దరిని కూడా తీసుకెళ్లారని, అయితే వారి వివరాలు ఇప్పటికీ తెలియలేదన్నారు. అరెస్టు చేసిన వారిపై ఇప్పటివరకు ఎలాంటి కేసులు కూడా నమోదు కాలేదని స్పష్టం చేశారు. చట్టబద్ధంగా నోటీసులు జారీ చేస్తే హక్కుల కార్యకర్తలు స్వయంగా పోలీస్ స్టేషన్లకు హాజరయ్యేవారని, కానీ పోలీసులు దురుసుగా వ్యవహరిస్తూ జులుం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పౌర హక్కులను కాపాడతామని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిన ప్రభుత్వ హామీలు గాలిమాటలుగా మారాయని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన హక్కుల నేతలను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని, అర్ధరాత్రి పౌరులపై దాడులు చేసి చట్టపరమైన నిబంధనలు పాటించని పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిఎల్‌సి స్పష్టం చేసింది.

## ఎవరినీ వదలం

(మొదటి పేజీ తరువాయి)

మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని మంత్రి కమిటీకి సూచించారు. అక్రమాల వెనుక ఉన్న ప్రతి ఒక్కరి పాత్రను వెలుగులోకి తీసుకువస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి అన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలోని పెద్దలు కుట్రపూరితంగా ప్రభుత్వ భూములను కాజేశారని ఆరోపించారు. ఈ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించగా, అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందన్నారు. నివేదిక ఆధారంగా రాష్ట్రంలో మిగిలిన 31 జిల్లాల్లోనూ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**అక్రమాలపై తొమ్మిది జిల్లాల్లోని 48 మందిపై క్రిమినల్ కేసులు..**

ఈ అక్రమాలపై ఇప్పటికే తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆనాటి ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా ధరణి పోర్టల్ను తీసుకువచ్చిందని, దాని లోపాలను ఉపయోగించుకుని కొందరు అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి వెంటనే ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతిపక్ష నేతలు ధరణి అవినీతి వెయ్యి కోట్లు, పది వేల కోట్లు అంటూ ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. నోటికొచ్చినట్టు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**సర్వేయర్లకు లైసెన్సులు.. :** ఖమ్మం జిల్లాలో శిక్షణ పొందిన సర్వేయర్లకు ఆదివారం లైసెన్సులు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మందికి లైసెన్సులు జారీ కాగా, రెండో విడతలో మరో రెండు వేల మందికి ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో లైసెన్సులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ లైసెన్‌లు సర్వేయర్‌లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు డిఐజి ఎం.సుభాషిణి, సిఎంపిఆర్‌ఓ మకరంద్, ఎసిబి ఎస్‌పి సింధుశర్మ, సైబర్ క్రైమ్ డిఎస్‌పి ఎ. సంపత్, ఎన్‌ఐసి ప్రతినిధి శ్రీనివాస్, హోంశాఖ సలహాదారు పి.శరత్ కుమార్ పాల్గొన్నారు.

**అధికారంలో ఉన్నట్లే ప్రవర్తిస్తున్న ప్రతిపక్షం.. ;** అనంతరం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మంత్రి శ్రీనివాస రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కెటిఆర్ మాట్లాడుతున్న భాష సరిగా లేదని, మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలను తాను వ్యక్తిగతంగా రిఫరెండంగా భావిస్తున్నానన్నారు. గతంలో జిల్లాల ఏర్పాటులో శాస్త్రీయత లేకపోవడంతోనే సమస్యలు తలెత్తాయని, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రజామోదంతో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీ బట్టకాల్చి మీద వేయడమే పనిగా పెట్టుకుందని, తమ రెండేళ్ల పాలనలో ఏ తప్పు జరిగిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఇంకా అధికారంలో ఉన్నట్లే ప్రతిపక్షం ప్రవర్తిస్తోందని, అధికారంలోకి వస్తామనే పగటి కలలు కంటోందని విమర్శించారు.

## విచారణకు సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 42 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 30 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మీడియాలో తనపైన, సింగరేణిపై వస్తున్న వార్తలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వార్తలు తనను ఆవేదనకు గురిచేశాయన్నారు.సింగరేణిపై గద్దలను, పెద్దలను వాలనివ్వను, తాను మండుటెండలో పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర నిర్వహించి సింగరేణి గనులను సందర్శించానని, సింగరేణి కార్మికుల రక్తం, స్వేదంతో బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని, ఇటువంటి బొగ్గు సంపదపై ఎటువంటి రాబందులు, గద్దలు, పెద్దలను వాలకుండా చూడడమే తన కర్తవ్యమని డిప్యూటీ సిఎం చెప్పారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచుకోవాల్సిన అవసరం అత్యంత కీలకమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత పదేళ్లలో కొత్త బొగ్గు గనుల అభివృద్ధిలో తగిన ప్రయత్నాలు జరగకపోవడం వల్ల భవిష్యత్తులో ఉత్పత్తి, ఆదాయం తగ్గి వేలాది కుటుంబాల ఉపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని ఆయన హెచ్చరించారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణిపై తప్పుడు ప్రచారాలు చేయవద్దని డిప్యూటీ సిఎం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, సింగరేణి మేనేజ్‌మెంట్, కార్మికులు పూర్తి అంకితభావంతో సంస్థ భవిష్యత్తును కాపాడుతారని స్పష్టం చేశారు. గత 40 ఏళ్లుగా ఉన్నత విలువలతో తాను పనిచేస్తున్నానని, తన వ్యక్తిత్వ హననానికి మీడియాలో వార్తలు వస్తున్నాయని, అందుకే వాస్తవాలు వివరించానన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని తిరిగి ప్రజలకు వివరించాలని, లేనట్లయితే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని ఉన్నత విలువలతో పనిచేస్తున్నానని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనుకుంటే చూస్తూ ఊరుకోనని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క హెచ్చరించారు.

**సైట్ విజిట్ నిబంధన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టింది కాదు**

సింగరేణిలో టెండర్లు, వాటికి సంబంధించిన టెండర్లు కానీ వాటికి సంబంధించిన ఫైళ్లు గానీ తన వద్దకు గానీ రాష్ట్ర ప్రభుత్వం వద్దకు రావని, అన్ని నిర్ణయాలు సంస్థలో అమలులో ఉన్న విధివిధానాలు, నిబంధనల ప్రకారమే స్వతంత్రంగా తీసుకుంటారని, రాజకీయ జోక్యానికి ఎక్కడా అవకాశం లేదని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ నైనీ బొగ్గు బ్లాకు కాంట్రాక్ట్ విషయంలో కాంట్రాక్టర్లు ముందుగా సైట్ విజిట్ చేయాలని, ఆ మేరకు గని అధికారుల నుంచి సైట్ విజిట్ సర్టిఫికెట్ పొందితేనే కాంట్రాక్టులో బిడ్డింగ్ చేయడానికి అర్హత కల్పిస్తూ తాను కొత్త నిబంధన పెట్టినట్లు వార్తలు వచ్చాయని, ఈ నిబంధన దేశంలో మరెక్కడా లేదని, కేవలం కొందరు భట్టి విక్రమార్కకు చెందిన వారికి కాంట్రాక్టు అప్పగించడానికే ఇలా చేశారని కట్టు కథనాలను అల్లి వార్త ప్రచురించారని విమర్శించారు. సైట్ విజిట్ చేయటం అనేది కేవలం సింగరేణిలో మాత్రమే ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టింది అంత కంటే కాదని రుజువులతో వివరించారు. 2018, 2021, 2023లో కోలిండియా అనుబంధ సంస్థ అయిన సిఎంపిడిఐఎల్ రూపొందించిన సింగరేణి టెండర్ డాక్యుమెంట్‌లో, ఇతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్‌ఎండిసి, ఐఐటీ, ఐఐఎం, ఫైనాన్స్ విభాగం, డిఫెన్స్ విభాగం, గుజరాత్ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర చాలా కంపెనీల్లో చాలా ఏళ్లుగా ఉన్నట్లు ఆ కంపెనీలకు సంబంధించిన టెండర్ లేఖలను మీడియా సమావేశంలో చూపించారు. కోల్ ఇండియాకు అనుబంధ సంస్థ అయిన సిఎండిపిఐఎల్ వారు సింగరేణి సంస్థకు సూచించిన టెండర్ నిబంధనలలో సైట్ విజిట్ జరపడం తప్పనిసరి అని పేర్కొన్నదని, సిఎంపిడిఐఎల్ నిబంధన మేరకే సింగరేణి సంస్థ 2018 నుంచి ఈ నిబంధనను పాటిస్తూ వస్తుందన్నారు. ఈ నిబంధన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా పొందుపరిచారనేది పూర్తి అవాస్తవమని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న నిబంధన అని, తాము కొత్తగా రూపొందించిందికాదని స్పష్టం చేశారు.
డీజిల్ సరఫరాను కాంట్రాక్టర్లకు అప్పగించింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే సింగరేణిలో డీజిల్ సరఫరాను కాంట్రాక్టర్లకే అప్పగించడం ద్వారా మరో కుంభకోణానికి తెరలేపారన్న హరీశ్ రావు ఆరోపణలను డిప్యూటీ సిఎం ఖండించారు. డీజిల్ సరఫరా విధానంలో మార్పులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగలేదని, 2022లోనే అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. జిఎస్‌టి విధాన మార్పులు, డీజిల్ దొంగతనాలు నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా కాంట్రాక్టుల్లోనూ ఈ పద్ధతే అమలులో ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు.

# తప్పు చేయకుంటే భయపడుతున్నారెందుకు?

### హరీష్‌రావు, కెటిఆర్‌ను ప్రశ్నించిన మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారంలో ఉండగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కెటిఆర్, హరీశ్ రావు ఇప్పుడు తగదునమ్మా అంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. ప్రజాభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమను రాజకీయ కక్షతో వేధిస్తున్నదని కెటిఆర్, హరీశ్ రావు మాట్లాడుతున్నారని మీపై నిజంగానే కక్ష సాధింపే చేయాల్సి వస్తే మరో సెక్షన్ కింద నోటీసులు ఇచ్చి అరెస్టు చేసేవారు కదా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మిమ్మల్ని కేవలం 160 సెక్షన్ కింద సాక్షులుగా మాత్రమే నోటీసులు ఇచ్చారని నిందితులుగా పిలవలేదన్నారు. నిజంగానే ఫోన్ ట్యాపింగ్‌లో మీరు ఎలాంటి తప్పు చేయకుంటే ఎందుకు భయపడుతున్నారన్నారని నిలదీశారు. అధికారంలో ఉండగా చేయాల్సిందంతా చేసి ఇప్పుడు దిగజారి మాట్లాడితే చెల్లుబాటు కాదన్నారు. బీఆర్ఎస్ నేతల తీరు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటా అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు.

**చట్టానికి ఎవరూ అతీతులు కాదు..**

నేను ఎంతో మంది ముఖ్యమంత్రులతో పని చేశానని వారి హయాంలో వినబడని ఫోన్ ట్యాపింగ్ అంశం బిఆర్ఎస్ హయాంలోనే ఎందుకు తెరపైకి వచ్చిందని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. గతంలో తమ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆకునూరి మురళి, బూర నర్సయ్య గౌడ్ వంటి వారు మాట్లాడారని చివరకు మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సైతం తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించించారన్నరు. గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరగకపోతే ప్రభాకర్ రావు అందుబాటులో లేకుండా విదేశాల్లో ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు అంతా చట్టప్రకారం జరుగుతోందన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతోందని చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరు పాత్రధారులు? ఎవరు సూత్రధారులు అన్నది తెలుసుకోవడం కోసమే విచారణ జరుగుతోందన్నారు. మీరు ఎన్ని అవినీతి, అప్రజాస్వామిక చర్యలు చేసి న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లుగా ఉండాలా? ప్రభుత్వం విచారణ జరిపించవద్దా అని నిలదీశారు.

## ప్రవీణ్‌కుమార్‌కు సజ్జనార్ నోటీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సిట్ అధికారి, సిపి సజ్జనార్ నోటీసులు పంపించారు. 'నాపై ఏడు కేసులు ఉన్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలి. రెండురోజుల్లో ఆధారాలు ఇవ్వకపోతే క్రిమినల్ చర్యలు తప్పవు' అని సజ్జనార్ హెచ్చరించారు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఒక పోలీస్ అధికారిగా ఫోన్ ట్యాపింగ్ విషయం తనకు తెలుసని, అత్యంత గోప్యంగా ఉంచాల్సిన ఈ అంశాన్ని రేవంత్ రెడ్డి బజారున పడేశారన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులను వేధించేందుకు అక్రమ సిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. సజ్జనార్ సిట్ అధికారిగా ఉన్నారని, ఆయనపై ఏడు కేసులు ఉన్నాయని, ఆయన సిట్ చీఫ్‌గా ఉండడం ఏందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును విచారించే నైతిక హక్కు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, డిజిపి శివధర్‌రెడ్డి ఇద్దరికీ లేదని ప్రవీణ్ కుమార్ అన్నారు. దీంతో తాజాగా స్పం దించిన సజ్జనార్ తనపై ఉన్న ఏడు కేసుల వివరాలు ఇవ్వాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు నోటీసులు ఇచ్చారు.

# యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమిద్దాం

### ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలకు సంసిద్ధం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం శనివారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జిల్లా రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రోషన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోషన్ కుమార్ సిన్హా మాట్లాడుతూ నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలతో దేశం 100 ఏళ్ల వెనక్కి తీసుకొనేలా పరిస్థితి నెలకొందన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పనిచేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వం తెరలేపిన నీచ కుటిల రాజకీయాలను దేశ యువత, పౌరులు తిప్పికొట్టాలని కోరారు. దేశ పౌరులకు అందించాల్సిన సంక్షేమ ఫలాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రధాన మోదీ కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తుండడంతో ఆ సంస్థలన్ని దేశ అభివృద్ధి కన్నా వారి స్వలాభ ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారే తప్ప, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఉచిత విద్య.... ఆర్టికల్ 39, 41 ప్రకారం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఆర్టికల్ 47 ప్రకారం ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటం వంటి హక్కులను అమలు చేయాల్సి ఉండగా, పాలకులు నిర్లక్ష్యంగా ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ, రాజ్యాంగ సూత్రాలకు తూట్లు పొడుస్తున్నారని వారు ధ్వజమెత్తారు. మోదీ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని బలవంతంగా దేశంలో మత ఉన్మాదం అనే కాషాయ విష బీజాలను విద్యార్థులు, యువత మెదలల్లో చొప్పించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఇది సమాజానికి హానికరమన్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ టి.సత్యప్రసాద్, కొండల్ చేపూరి, బిజ్జ శ్రీనివాసులు, పేరబోయిన మహేందర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలక్రిష్ణ, సల్మాన్ బేగ్, ఎండీ.కుతుబ్, పి.శివకుమార్, రాజ్‌కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, శ్రీకాంత్, ఆంజనేయులు, కళ్యాణ్, శేఖర్, వెంకటేష్, భగత్ సింగ్, మధుకర్, మహేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిని దోచుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకదానికొకటి సహకరించుకుంటూ రాష్ట్రాన్ని, సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సింగరేణి సంస్థను గత కెసిఆర్ ప్రభుత్వం తన కుటుంబ స్వార్థం కోసం వాడుకుందని ఆరోపించారు. 2014 నుండి సింగరేణిలో జరిగిన గనుల కేటాయింపులు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో రికార్డులు తారుమారయ్యే ప్రమాదం ఉందన్నారు. 'ఫోన్ ట్యాపింగ్ చేసిన దొంగలను సాక్షులుగా పిలవడం ఏంటి?, కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులకు కాంగ్రెస్ క్లీన్‌చిట్ ఇవ్వాలని చూస్తోందా?' అని బండి సంజయ్ ప్రశ్నించారు.

# ఎంజినరేగాను నాశనం చేయాలని చూస్తోంది

### 'ఎంజినరేగా బచావో సంగ్రామ్ యాత్ర'లో వి.హనుమంతరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మోదీ ప్రభుత్వం ఎంజినరేగా ఆత్మను నాశనం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు అన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఉపాధిని డిమాండ్ చేసే చట్టబద్ధ హక్కును, కేంద్రం నియంత్రించే ఉపకారంగా మార్చుతోందని, ఇది ప్రజాస్వామ్యంలో అంగీకరించలేమని స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరేగా)ను నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలపై నిరసనగా, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) మూడు రోజుల పాటు సాగే 'ఎంజినరేగా బచావో సంగ్రామ్ యాత్ర'ను శనివారం ప్రారంభించింది. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా ఈ యాత్రను చార్మినార్ నుంచి పురానాపుల్ వరకు, యాకుత్‌పురాలోని సింగరేణి కాలనీ నుంచి సంతోష్‌నగర్ ఎక్స్‌రోడ్స్ వరకు పాదయాత్ర నిర్వహించారు. హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా నేతృత్వంలో సాగుతున్న ఈ యాత్రలో ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావుతో పాటు కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జీలు రాజేష్ కుమార్ పులిపాటి (బహదూర్‌పురా), బి.నాగేశ్ (చంద్రాయణగుట్ట), మొహమ్మద్ ముజీబుల్లా షరీఫ్ (చార్మినార్), షేక్ అక్బర్ (మలక్‌పేట్), కె.రవి రాజ్ (యాకుత్‌పురా) పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ ర్యాలీ నగరంలోని చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చంద్రాయణగుట్ట, మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగి, జనవరి 26న ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ కొత్త విధానంలో వేతన భద్రత లేకపోవడంతో, కనీస వేతనాలపై ఆధారపడే కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ద్వారా వికేంద్రీకృతంగా అమలైనదే ఎంజినరేగా బలమని తెలిపారు. కానీ, ఆ అధికారాలు తీసేసి కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ఈ నిరసనలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, మాజీ పిసిసి కార్యదర్శి భీమ్ అర్జున్ రెడ్డి, కె. రవిరాజ్, మామిడి కృష్ణ కుమార్, అల్లం భాస్కర్, మల్లికార్జున్, అబ్దుల్ ఖదీర్, యూసుఫ్ దానిష్, మహమ్మద్ అబ్దుల్ ఘనీ, మొహమ్మద్ ముస్తఫా, సయ్యద్ దిలావర్ హుస్సేన్, అరుణ్ ఠాకూర్, శంకర్ నాయక్, శ్రీనివాస్ వాల్మీకి, రంగ శ్రీకాంత్ గౌడ్, అలేవాలు, ఇందివేలు, శేషు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐద్వా ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలను పురస్కరించుకుని శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కొంగు నడుంకు కట్టి, కొడవల్లు చేతబట్టి వెట్టి, స్త్రీ విముక్తి సాగించిన ఉద్యమాలు మొదల్కొని నేడు స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాల ఘట్టాలతో కూడిన చిత్ర మాలికలతో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్‌ను ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రారంభించారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ హాల్‌ను ఐద్వా కోశాధికారి ఎస్.పుణ్యవతి, సాయుధ పోరాటాల చిత్రమాలిక హాల్‌ను సుధా సింధూరస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై కొనసాగుతున్న వివక్ష, దాడులు, చట్టబద్ధంగా వారికి రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన, సుప్రీంకోర్టు నిర్దేశించిన సమాన పనికి సమాన వేతనం, వితంతు పెన్షన్లు, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై మహాసభలో చర్చించి తీర్మాణాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు టీచర్, రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సహాయ కార్యదర్శులు కె.ఎన్.ఆశాలత, బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు, దళితులు, మైనార్టీలు, పేదలలో అభద్రత భావం పెరిగింది : పి.కె.శ్రీమతి**

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, దళితులు, మైనార్టీలు, పేద వర్గాల్లో అభద్రతాభావం పెరిగిందని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి అన్నారు. హైదరాబాద్ 14వ ఐద్వా జాతీయ మహాసభలు జరుగుతున్న ఆర్‌టిసి కల్యాణమండపంలో మీడియా సెంటర్‌ను శ్రీమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు, కూలీలు, కార్మికులు, పేదలు, మహిళల సమస్యల పరిష్కారం కోసం ఐద్వా బలమైన ఉద్యమాలు చేసిందనీ, భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని అన్నారు. తెలంగాణ గడ్డపై బలమైన ప్రజా ఉద్యమాలు జరిగాయనీ, ఐద్వా వ్యవస్థాపక నాయకురాలు మల్లు స్వరాజ్యం ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులుగా సుదీర్ఘకాలం సేవలందించారని గుర్తు చేశారు. సమానత్వం, మహిళా సాధికారితకు మీడియా సహకరించాలని, ఐద్వా కార్యక్రమాలకు మీడియా మద్దతివ్వాలని శ్రీమతి కోరారు. ఐద్వా మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తొలిసారిగా జరుగుతున్న ఐద్వా అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లూ లక్ష్మి పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

### అవినీతికి తావివ్వొద్దు
### హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి. గౌతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత విస్తృతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో పథకం పురోగతిని స్థానిక ప్రజాప్రతినిధులకు వివరించాలని, ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడంలో ఎమ్మెల్యేల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పురోగతిని బట్టి మార్చి నాటికి లక్ష ఇండ్లను పూర్తి చేయగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసిన ఆయన, ఇదే ఉత్సాహంతో మంజూరైన అన్ని ఇండ్లను పూర్తి చేయాలని సూచించారు. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వులపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అదే సమయంలో ప్రజలకు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని, ఎక్కడైనా పనులు మందగిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షలతోనే సరైన ప్రణాళికతో ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు ఇంజనీరింగ్ విభాగం మార్గనిర్దేశం చేయాలని, పిడిలు, డిఈలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా అవినీతి ఆరోపణలు వచ్చినట్లయితే ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి, అలాట్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి సెప్టెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్.ఈశ్వరయ్య, చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, విజిలెన్స్ ఆఫీసర్ పి.బలరాం, జనరల్ మేనేజర్లు బి.మమత, ఎం.శ్రీదేవి, సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.విజయకుమార్ పాల్గొన్నారు.

# జలవిహార్ ఘనంగా అరైవ్ అలైవ్

### పాల్గొన్న సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్, జాయింట్ సిపి జోయెల్ డేవిస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టి, వాహనదారులలో రహదారి భద్రతపై చైతన్యం నింపే లక్ష్యంతో ఖైరతాబాద్, సికింద్రాబాద్ ట్రాఫిక్ జోన్ల సంయుక్త ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని శనివారం జలవిహార్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్, విశిష్ట అతిథిగా సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్, గౌరవ అతిథిగా ట్రాఫిక్1 డిసిపి అవినాష్ కుమార్ పాల్గొన్నారు. రహదారి వినియోగదారుల భద్రతను కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన 300 బైక్‌ల భారీ ర్యాలీని అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి ఆందె రాములు, ఎసిపి ఎస్.మోహన్ కుమార్, ఎ.శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోయెల్ డేవిస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్లను ధరించాలని, వెనుక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అవినాష్ కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు. లైసెన్స్‌తో పాటు నైపుణ్యం ఉన్నప్పుడే వాహనం నడపాలని సూచించారు. నిఖిల్ సిద్ధార్థ్ మాట్లాడుతూ రహదారి భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని, ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాలను తగ్గించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్, సికింద్రాబాద్ ట్రాఫిక్ జోన్ల సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు, సిఆర్‌టి బైక్ రైడర్స్ అసోసియేషన్ సభ్యులతోపాటు భారీసంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## పునరావాసంతో ప్రశాంత జీవనం

### 8 మంది మావోయిస్టుల లొంగుబాటు : సిపి అంబర్ కిషోర్ ఝా

**ప్రజాపక్షం/గోదావరిఖని :** లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు తెలంగాణ ప్రభుత్వం అందించే పునరావాస పథకం కింద లభించే ఫలితాలను అందజేస్తామని రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా అన్నారు. శనివారం సిపి ఎదుట నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ సభ్యులు లొంగిపోయారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్న సహాయ, సహకారాలు, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణ గురించి తెలుసుకొని తాము కూడ కుటుంబసభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడిపేందుకు నిర్ణయించుకొని సిపి ఎదుట లొంగిపోయినట్లు వారు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం, చెగ్యాం గ్రామానికి చెందిన ధర్మాజీ శ్రీకాంత్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంపూర్ గ్రామానికి చెందిన పొడియం కాములు, ముడియం జోగ, కుంజం లక్కె, మోదం భీమ, కుంజం ఉంగా, ముడికం సుక్రం, ముడియం మంగు ఉన్నారు. వీరందరూ ప్రధానంగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించినట్లు సిపి తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల మావోయిస్టులు కూడ వారి గ్రామాలకు తిరిగి రావాలని కోరుతున్నట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి(అడ్మిన్) శ్రీనివాస్, ఏసీపీ(ఏఆర్) ప్రతాప్, ఇన్స్‌పెక్టర్లు రాజేంద్రప్రసాద్, భీమేష్, ఆర్ఐ శేఖర్, ఆర్ఎస్ఐ వెంకటే, శివలు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/మొగుళ్లపల్లి :** రైతులను రాజులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మొగుళ్లపల్లి మండలం పాత ఇస్సిపేట గ్రామంలో 13 కోట్ల 50 లక్షల వ్యయంతో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మార్కెట్ గోదాం నిర్మాణానికి మంత్రి నాగేశ్వరరావు, ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కలెక్టర్ రాహుల్ శర్మ, రాష్ట్ర వేర్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాలు పామాయిల్ సాగుకు అనుకూలమైన భూములు ఉన్నాయన్నారు. రైతులు జిల్లాలో ఆశించిన స్థాయిలో పామాయిల్ సాగు జరగడం లేదని అన్నారు. పామాయిల్ పంటకు మద్దతు ధర లభిస్తుందని ఇప్పటికే టన్నుకు 20 వేలు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

**మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ**

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళ స్వయం సహాయక సంఘాలకు స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాల చెక్కులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంపిణీ చేశారు. పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మార్కెట్ గోదాం ల నిర్మాణం రైతులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటలకు సరైన మార్కెట్ ధరలు లభించని పక్షంలో పంట నిల్వ చేసుకునే సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ ప్రాంతంలో రైతులు వరి, మిర్చి, పత్తి అధికంగా సాగు చేస్తుంటారని తెలిపారు. చిట్యాల, జడల్‌పేటలో అదనపు గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బుద్ధారం ప్రాంతంలో కూడా 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతులకు మార్కెట్ గోదాం నిర్మాణం వల్ల పంట నిల్వ, విక్రయ సౌకర్యాలు మెరుగవుతాయని, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వేర్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్, డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, డిఏఓ బాబురావు, ఉద్యానవన అధికారి సునీల్, ఎంఆర్ఓ సునీత, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, మొగుళ్ళపల్లి పిఏసిఎస్ చైర్మన్ నర్సింగరావు, పాత ఈశ్వర్ ఇసి పేట సర్పంచ్ గట్టయ్య, ఇసిపేట ముకుంద రెడ్డి లతోపాటు అధికారులు, సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పిఐయు డివిజన్, నల్లగొండ.**
షార్ట్ టెండర్ ప్రకటన
Lr.No. D3/Tenders/07/2025-26/DPRENLG తేది: 23.01.2026
నల్లగొండ జిల్లా, పిఐయు నల్లగొండ డివిజన్‌లోని నల్లగొండ పట్టణంలో రూ.36.00 లక్షల మొత్తం అంచనా వ్యయంతో కూడిన (7) పనుల కోసం క్రింద సంతకం చేసిన వారు టెండర్లను ఆహ్వానిస్తున్నారు. **దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 29.01.2026, **టెండర్ షెడ్యూల్స్ జారీ చేసే తేదీ:** 30.01.2026, **టెండర్ స్వీకరణ మరియు తెరచు తేదీ:** 31.01.2026. మరిన్ని వివరాల కోసం సంప్రదించండి: జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, పిఐయు నల్లగొండ కార్యాలయం, (జెడ్.పి.పి. కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, నల్లగొండ పట్టణం.
సంతకం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, పి.ఐ.యు., :: నల్లగొండ.
DIPR R.O. No. : 14498-PP/CL/ADVT/1/2025-26, Date: 24-01-2026

**పురపాలక సంఘ కార్యాలయము- దుబ్బాక, జిల్లా :: సిద్దిపేట**
టెండర్ ప్రకటన
No. E1/18/NAG/2026 తేది: 24.01.2026
దుబ్బాక పురపాలక సంఘం నకు, 1). Supply and Delivery of Motors, Electrical & Water supply Equipment and spare parts in various wards in Dubbak Municipality under 15th FC (Tied Grant) కొరకు రూ: 10.00 లక్షలు, మరియు 2). Supply and Delivery of Motor spare parts and Maintenance of existing motors in various words in Dubbak Municipality under General Fund కొరకు రూ 4.00 లక్షలు, మంజూరీ కాబడినవి. ఇట్టి పనులు చేపట్టుటకు మొత్తం (02 Works) రూ: 14.00 లక్షలు మంజూరీ కాబడినవి. ఇట్టి పనులు నిర్వహించుటకు పనులను చేపట్టుటకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ఆహ్వానించనైనది.

| | | |
|---|---|---|
| 1. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: | 24.01.2026 11.00 A.M. |
| 2. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ చివరి తేది: | 28.01.2026 4.00 P.M. |
| 3. | బిడ్ వ్యాలిడిటి పీరియడ్ | 90 Days |
| 4. | వివరములకు సంప్రదించు ఫోన్ నెం. | 9390988378, 9391495430, |

పైన తెలిపిన పనులకు టెండర్ ద్వారా ఆహ్వానించనైనది. తదుపరి వివరాలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.eprocurment.telangana.gov.in సంప్రదించగలరు.
సం/- కమీషనర్, పురపాలక సంఘం, దుబ్బాక.
DIPR R.O. No. : 14332-PP/CL/ADVT/1/2025-26, Date: 24-01-2026

GHMC **గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ-II, సర్కిల్-44, మెట్టుగూడ, సికింద్రాబాద్ జోన్.
కొటేషన్స్ పొందడానికి ప్రకటన
Sealed Quotation Notice No.01/EE-II/Cir-44/SBZ/GHMC/2025-26 తేది: 23.01.2026
క్ర.సం.1, క్రింద పేర్కొన్న వస్తువుల కోసం ప్రొఫెషనల్ / అధీకృత డీలర్లు / ఏజెన్సీలు మొదలైన వారి నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనది: ఇన్‌చార్జ్ ఇంజనీర్ నిర్దేశించిన విధంగా SWD క్యాచ్‌పిట్ల డీసిల్టింగ్ కోసం హైడ్రాలిక్ సిల్ట్ గ్రాబర్‌ను నియమించుకోవడానికి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం:** 24.01.2026న మ.12.00గం.ల నుండి 28.01.2026న మ.12.00గం.ల వరకు, **సీల్ వేసిన కొటేషన్లు దాఖలు చేయవలసిన కార్యాలయం:** ఇ.ఇ., సర్కిల్-44, మెట్టుగూడ, జిహెచ్ఎంసి. 28.01.2026న మ.12.00గం.లకు లేదా అంతకుముందు. సెల్ నెం. 9704405076. **సంప్రదించవలసిన అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-44, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-44, మెట్టుగూడ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి (సిటీ సివిల్ కోర్టు ఎదురుగా, వెస్ట్ మారేడ్‌పల్లి, 500026) నందు పొందవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-44, మెట్టుగూడ, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14370-PP/CL/ADVT/1/2025-26, Date: 24-01-2026

GHMC **గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సర్కిల్-17, జల్‌పల్లి.**
టెండర్ ప్రకటన
NIT No.02/EEC-17/JLPY/GHMC/2025-26 తేది: 24.01.2026
**పని పేరు:** 6 పనుల కొరకు జిహెచ్ఎంసి, జల్‌పల్లి సర్కిల్-17, వార్డు నెం. 63, 64 & 65లోని పైపు డ్రెయిన్లు, బాక్స్ డ్రెయిన్లు మరియు బహిరంగ కాలువలలో ఏటా పూడికతీత పనులు చేపట్టడం...................., జిహెచ్ఎంసి, జల్‌పల్లి సర్కిల్-17, వార్డు నెం. 63, 64 & 65లో సిసి మరియు బిటి పనుల ఏర్పాటు, **అంచనా మొత్తం:** రూ.127.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 05.02.2026న మ.03.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్‌పల్లి డివిజన్ నెం.17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జల్‌పల్లి, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14403-PP/CL/ADVT/1/2025-26, Date: 24-01-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: కల్వకుర్తి**
నాగర్‌కర్నూల్ జిల్లా.
'ఇ'- ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
Tender Notice No. E1/GF/Drain/2025-26/001 తేది: 24.01.2026
కల్వకుర్తి మున్సిపాలిటీలో సాధారణ నిధి కింద (1) పని కోసం 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

| క్ర.సం. | అంచనా విలువ | రూ. 2.50 లక్షలు |
|---|---|---|
| 1. | పని పేరు: | కల్వకుర్తి మున్సిపాలిటీలోని విద్యానగర్‌లో, జిల్లెల రాములు ఇంటి వద్ద సాధారణ నిధి 2025-26 కింద వర్షపు నీటి సిసి డ్రెయిన్ నిర్మాణం. |
| | బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం | 27.01.2026 ఉదయం 10:00 గంటలకు |
| | బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం | 29.01.2026 సాయంత్రం 04:30 గంటలకు |

మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన www.eprocurement.gov.inలో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించే అధికారి: కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. సెల్ నెం. 9110540243, 7331109838.
సం/- కమిషనర్ కల్వకుర్తి మున్సిపాలిటీ
DIPR R.O. No. : 14476-PP/CL/ADVT/1/2025-26, Date: 24-01-2026

# నగర పారిశుద్ధ్యంపై 'హైపవర్ కమిటీ'

## జిహెచ్ఎంసి కమిషనర్ కీలక నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శనివారం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన నగరం నుంచి శివారు ప్రాంతాల వరకు చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియలో ఉన్న లోపాలను సరిదిద్దడమే లక్ష్యంగా ఈ కమిటీ పనిచేయనుంది. ఈ కమిటీలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో పాటు పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఈపిటిఆర్ఐ) ప్రతినిధులు, పారిశుద్ధ్య నిర్వహణలో భాగస్వామిగా ఉన్న రాంకీ సంస్థ ఉన్నతాధికారులను సభ్యులుగా చేర్చారు. నగర ప్రజలు పారిశుద్ధ్యం విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి, మెరుగైన సేవలందించడమే ఈ కమిటీ ప్రధాన ఉద్దేశమని కమిషనర్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కమిటీలో ప్రధాన సభ్యులు..

సృజన గుమ్మల (అదనపు కమిషనర్ కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లు )
టి. వినయ కృష్ణారెడ్డి (అదనపు కమిషనర్ మల్కాజిగిరి, ఎల్.బి. నగర్, ఉప్పల్ జోన్‌లు)
అనురాగ్ జయంతి (అదనపు కమిషనర్ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ )
అపూర్వ్ చౌహాన్ (కూకట్‌పల్లి జోనల్ కమిషనర్)
సి.ఎన్. రఘుప్రసాద్ (అదనపు కమిషనర్, ఆరోగ్యం పారిశుద్ధ్య విభాగం)
కె. సత్యనారాయణ (అదనపు కమిషనర్ న్యాయ విభాగం)
పి. వెంకటేశ్వర రెడ్డి (ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్)
సహదేవ్ రత్నాకర్ (చీఫ్ ఇంజనీర్ నిర్వహణ)

కమిటీ పర్యవేక్షించాల్సిన ప్రధాన అంశాలు

- కమిటీ సభ్యులు తక్షణమే రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేయాలని కమిషనర్ ఆదేశించారు.
- ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా చెత్త సేకరిస్తున్నారా? లేదా? అనే అంశం.
- నివాసాల నుంచి ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు వ్యర్థాల తరలింపు ప్రక్రియ.
- రోడ్లను ఊడ్చే కార్మికుల పనితీరు, వారిపై ఇంజనీర్ల పర్యవేక్షణ బాధ్యతలు.
- ప్రజల నుంచి వసూలు చేసే చెత్త సేకరణ రుసుమును క్రమబద్ధీకరించడం.
- రోడ్లపై పేరుకుపోతున్న చెత్త కుప్పలను తొలగించి, ఆ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం.

### ఎఫ్‌టిపిసి ఇండియా మోషన్ పిక్చర్ స్టిల్

# ఫొటోగ్రఫీ చైర్మన్‌గా ఆర్‌వి అప్పారావు

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ఎఫ్‌టిపిసి ఇండియా తెలుగు రాష్ట్రాల మోషన్ పిక్చర్ స్టిల్ ఫొటోగ్రఫీ చైర్మన్‌గా ఆర్‌వి అప్పారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వేదికగా ఎఫ్‌టిపిసి జాతీయ అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి పాకలపాటి విజయ్‌వర్మ ఆయనకు నియామకపత్రం అందజేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ నటుడు, తెలుగు ప్రొడ్యూసర్ కౌన్సిల్ జనరల్ సెక్రటరి కె.అశోక్ కుమార్ మాట్లాడుతూ, ఎఫ్‌టిపిసి ఇండియా బలోపేతం కావడం ఆనందంగా ఉన్నదన్నారు. చైతన్య జంగా, పాకలపాటి విజయ్‌వర్మ మీడియాతో మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్ధాలుగా ఫొటో జర్నలిజంలో విశేష అనుభవం గడించిన ఆర్‌వి అప్పారావు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో బాలీవుడ్ నటి తన్య మంజుందర్, ప్రముఖ దర్శకుడు వి.సముద్ర, బిగ్బాస్ సాని, ప్రముఖ నటుడు అన్నంగి రాజశేఖర్, మధుకర్, ఈశ్వర్, సినీ నటి కవిత,హేమా గుప్తా, కిరణ్ బెజాడి తదితరులు పాల్గొన్నారు.



### పోలీస్ అకాడమీలో

# జాతీయ పతాక హై మాస్ట్ ఆవిష్కరణ

## 'పిప్పింగ్ సెరొమనీ'లో ప్రతిభావంతులైన అధికారులకు పురస్కారాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ అకాడమీలో శనివారం ఘనంగా జాతీయ పతాక హై మాస్ట్‌ను ఆవిష్కరించారు. అకాడమీ ప్రాంగణంలోని చారిత్రక డా. హ్యాంకిన్స్ మ్యూజియం టెర్రస్పై ఏర్పాటు చేసిన హై మాస్ట్ వద్ద ఉదయం 9.30 గంటలకు అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్‌కు పోలీస్ బృందం 'గార్డ్ ఆఫ్ ఆనర్' సమర్పించింది. అనంతరం జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ జాతీయ పతాక హై మాస్ట్ అకాడమీలో ఒక మౌలిక వసతి అభివృద్ధి మాత్రమే కాకుండా, దేశం పట్ల, భారత రాజ్యాంగం పట్ల, ప్రజాసేవ పట్ల తెలంగాణ పోలీస్ శాఖకు ఉన్న అచంచల నిబద్ధతకు శాశ్వత ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అకాడమీ ప్రాంగణంలో ఎగురుతున్న త్రివర్ణ పతాకం ప్రతి అధికారి, శిక్షణార్థి, సిబ్బందిలో నైతికత, క్రమశిక్షణ, ధైర్యం, త్యాగభావం, స్వార్థరహిత సేవ వంటి విలువలను నిరంతరం ప్రేరేపిస్తుందని తెలిపారు. అకాడమీ అత్యున్నత స్థలంలో స్థాపించిన ఈ పతాకం, ఉన్నత ఆశయాలు, వృత్తిపరమైన ప్రమాణాలు, ఉత్తమ సేవాభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులను సత్కరించే 'పిప్పింగ్ సెరొమనీ' నిర్వహించారు. అతి ఉత్తమ సేవ పతకం 2025ను డి. చంద్రశేఖర్ రావు (సబ్ ఇన్‌స్పెక్టర్ ఐటీ, కమ్యూనికేషన్స్), ఎస్. నాగయ్య (హెడ్ కానిస్టేబుల్ 445)లకు ప్రదానం చేశారు. అలాగే ఉత్తమ సేవ పతకం 2025ను జి. ప్రకాష్ (రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ టెక్నికల్)కు అందజేశారు. అవార్డు గ్రహీతల సేవలు పోలీస్ శిక్షణార్థులకు ఆదర్శప్రాయమని, ప్రజల పట్ల సానుభూతితో కూడిన పోలీసింగ్‌కు ఇవి ఉత్తమ ఉదాహరణలని డైరెక్టర్ ప్రశంసించారు. ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ మరో కీలక మైలురాయిని సాధించింది. అకాడమీ నాణ్యత, ఉత్తమత సాధనకు నిదర్శనంగా పలు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లు లభించాయని తెలిపారు. తెలంగాణ చాప్టర్ మేనేజర్ శివయ్య ఈ సర్టిఫికెట్లను డైరెక్టర్ అభిలాష్ బిస్త్‌కు అందజేశారు. వీటిలో పోలీసు, అభియోగ విభాగాలు, క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్నందుకు 5 స్టార్ క్వాలిటీ రేటింగ్ ఐ ఎస్ ఒ సర్టిఫికేట్ ప్రధానం చేశారు. ఈ గుర్తింపులు అకాడమీలో ప్రక్రియల పారదర్శకత, ఫలితాల పట్ల బాధ్యత, పరిపాలనలో నైతికతకు నిదర్శనమని డైరెక్టర్ తెలిపారు. ఈ విజయాలకు కృషి చేసిన అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, శిక్షణార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, డి. మురళీధర్, ఎన్. వెంకటేశ్వర్లు, కె.ఆర్.కే. ప్రసాద్, మధుకర్ స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్లు, వైద్యాధికారులు, డిఎస్‌పిలు, అకాడమీ అధికారులు, సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వారందరికీ డిఎస్‌పి ఆదూరి శ్రీనివాస రావు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయ ఒత్తిళ్లే కారణమా ?

## అర్ధరాత్రి వేళ బదిలీ ఉత్తర్వుల్లో మార్పు

## జిహెచ్ఎంసిలో చర్చనీయాంశంగా మారిన నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసిలో అధికారుల బదిలీల వ్యవహారం మరోసారి కలకలం రేపింది. పలు సర్కిళ్ల ఉపకమిషనర్లను బదిలీ చేస్తూ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శుక్రవారం సాయంత్రం జారీ చేసిన ఉత్తర్వులు, అర్ధరాత్రి కల్లా మారిపోవడం చర్చకు దారితీసింది. శుక్రవారం సాయంత్రం వెలువడిన బదిలీ జాబితాను సవరిస్తూ అర్ధరాత్రి కొత్త ఉత్తర్వులు జారీ చేయడంపై శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మధ్య ఆసక్తికర చర్చ నడిచింది. ఇద్దరు అధికారుల నియామకాల్లో చోటుచేసుకున్న ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ సిఫార్సులు ఉన్నాయని, కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిడి వల్లే కమిషనర్ నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చిందనే చర్చ జరుగుతోంది. కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే బదిలీ అయిన స్థానాలను మార్చడం లేదా పాత స్థానాల్లోనే కొనసాగించడం వంటి పరిణామాలు జిహెచ్ఎంసిలో పాలనాపరమైన గందరగోళానికి దారితీస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తాజా ఉత్తర్వుల ప్రకారం మార్పులు..**

సవరించిన ఆదేశాల మేరకు పలువురు అధికారుల పోస్టింగ్ వివరాలు ఇలా ఉన్నాయి.

సత్యనారాయణరెడ్డి : ఆదిభట్ల ఉపకమిషనర్‌గా ఉన్న ఈయనను బదిలీ చేసినప్పటికీ, తాజా ఉత్తర్వుల ప్రకారం అదే స్థానంలో కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.
ఏ. సురేశ్ : ఈయన్ను యూసఫ్‌గూడ సర్కిల్ ఉపకమిషనర్‌గా నియమించారు.
ఏ. జ్యోతిరెడ్డి : ఈమెను పటాన్‌చెరు సర్కిల్ ఉపకమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపి అర్వింద్‌లకు కెటిఆర్ లీగల్ నోటీసులు

## 5రోజుల్లో స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌లకు బిఆర్ఎకార్యనిర్వహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు లీగల్ నోటీసులు పంపించారు. నోటీసు అందిన 5 రోజుల్లోగా స్పందించకపోతే సివిల్, క్రిమినల్ చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనపై , తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు గానూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపి ధర్మపురి అరవింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వీరు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కెటిఆర్ బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇష్టానుసారంఅమాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, నిజమైన రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నరన్నారు. ఇప్పటికే కేంద్రమంత్రి బండి సంజయ్ గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసు న్యాయస్థానంలో ఉన్నప్పటికీచట్ట వ్యతిరేకంగా మరోసారి నోరు పారేసుకున్నారని తెలిపారు.

# మునిసిపల్ ఎన్నికలకు బిఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మునిసిపల్ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిఆర్ఎస్ అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేక సమన్వయకర్తలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (కెటిఆర్) నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 122 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్‌లకు సమన్వయకర్తలను ప్రకటించారు. ప్రతి మున్సిపాలిటీకి ఒక సీనియర్ నాయకుడిని ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించి, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను ఏకం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం వంటి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఆయా మున్సిపాలిటీల్లో సమన్వయకర్తలు నిరంతరం అందుబాటులో ఉంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో కీలక పాత్ర పోషించడంతో పాటు, స్థానిక నాయకత్వంతో సంప్రదింపులు జరిపి గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను గుర్తించి పార్టీ అధిష్టానానికి నివేదికలు సమర్పించనున్నారు. అలాగే పార్టీ చేపట్టే ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్ల సమన్వయం, గ్రౌండ్ రిపోర్టుల సేకరణ వంటి అంశాలను కూడా వీరు పర్యవేక్షిస్తారు. ఎన్నికల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలంగాణ భవన్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి మరియు వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నివేదించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మునిసిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు.



# ఫోన్ ట్యాపింగ్ పేరుతో రాష్ట్రంలో పెద్ద డ్రామా

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పేరుతో పెద్ద ఎత్తున రాజకీయ డ్రామా నడుస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆరోపించారు. జననాయక్ భారతరత్న కర్పూరి ఠాకూర్ 102 జయంతి సందర్భంగా శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రాంచందర్ రావు ఘనంగా నివాళులు అర్పిచంఆరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేసులో జరుగుతున్న దర్యాప్తు పూర్తిగా నాటకంగా మారిందని విమర్శించారు. పోలీసుల విచారణలో నిందితులను మర్యాదగా పిలిపించి బయటికి పంపిస్తున్నారే తప్ప, కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘన అన్నారు. కాంగ్రెస్ – బిఆర్ఎస్ పార్టీల మధ్య అంతర్గత ఒప్పందం ఉన్నందువల్లే దర్యాప్తు రెండేళ్లుగా ఆలస్యం అవుతోందని అనుమానం వ్యక్తం చేశారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే అరెస్టులు చేసి చార్జ్ షీట్లు వేయాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాల్లో చిన్న కేసుల్లోనే వేగంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తెలంగాణలో మాత్రం ఎందుకు ముందడుగు పడటం లేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్‌పై నమోదైన కేసులన్నీ ఏమయ్యాయని నిలదీశారు. అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని చెబుతూ, రాజకీయ నేతలను ఎందుకు వదిలేస్తున్నారని విమర్శించారు. దర్యాప్తులో బయటపడిన నిజాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

# షిరిడి సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** షిరిడి సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటి, బిజెపి నేత మాధవీలతపై శిర్డీ సాయి భక్తుల ఐక్య వేదిక బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు ఫిర్యాదు చేసింది. ఈ అంశంపై స్పందించిన రామచందర్ రావు, ఎవరి మనోభావాలు దెబ్బతీయడం సరికాదని స్పష్టం చేశారు. షిరిడి సాయిబాబాపై చేసిన వ్యాఖ్యలకు బిజెపి పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. అవి పార్టీ విధానాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని భక్తులకు క్షమాపణ చెప్పాలని మాధవీలతకు సూచించారు. షిరిడి సాయి భక్తుల ఐక్య వేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ మాట్లాడుతూ సాయిబాబాపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ సాయిబాబా ఆలయాల నుంచి వచ్చిన భక్తులు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా గీతాంజలి స్కూల్ 32వ వార్షికోత్సవం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** సైదాబాద్ సరస్వతినగర్‌లోని గీతాంజలి స్కూల్ 32వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శనివారం రవీంద్రభారతి వేదికగా జరిగిన ఈ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా రామకృష్ణమఠ్ అధ్యక్షులు స్వామి బోధమయానందజీ, సైకాలజిస్టు కౌన్సెలింగ్ డా.సి.వీరేందర్ హాజరై, ప్రసంగించారు. విద్యార్థులకు విద్యతోపాటు నైతికవిలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను గీతాంజలి స్కూల్ యాజమాన్యం వెలికితీసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కె.దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీలక్ష్మి ,బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# యూసఫ్‌గూడ డంపింగ్ యార్డులో ఘోర ప్రమాదం

## మిషన్‌లో చిక్కుకుని కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని యూసఫ్‌గూడ వ్యర్థాల తరలింపు కేంద్రం (డంపింగ్ యార్డు)లో శనివారం తెల్లవారుజామున ఒక ప్రమాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా చెత్తను డంపింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తూ మిషన్‌లో చిక్కుకుని మీసాల సుధాకర్ (37) అనే జిహెచ్ఎంసి కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు, తోటి కార్మికుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధాకర్ తన భార్య లక్ష్మి నర్సమ్మతో కలిసి హైటెక్ సిటీ ప్రాంతంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ ప్రతిరోజూ జూబ్లీ హిల్స్ పరిసరాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, ఆటోలో యూసఫ్‌గూడ డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. శనివారం ఉదయం 5:30 గంటల ప్రాంతంలో ఎప్పటిలాగే చెత్తను అన్‌లోడ్ చేసేందుకు వెళ్లిన సుధాకర్, భార్యను గేటు వద్ద ఉంచి లోపలికి వెళ్లారు. ర్యాంపు వద్ద చెత్తను కంటైనర్‌లోకి మళ్లించే క్రమంలో కాలు జారి మిషన్ లోపలికి పడిపోయారు. లోపల ఉన్న చెత్తతో పాటు సుధాకర్ కూడా కంటైనర్ లోకి వెళ్ళిపోయారు. సుధాకర్ ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన భార్య, తోటి కార్మికులు కంటైనర్‌లోని చెత్తను కిందకు పడేసి చూడగా సుధాకర్ మృతదేహం బయటపడింది. వెంటనే అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

**రాంకీ సంస్థ నిర్లక్ష్యమే కారణమని నిరసన :**

ఈ ప్రమాదంపై కార్మికులు, మృతుడి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ కనీస రక్షణ చర్యలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ డంపింగ్ యార్డు వద్ద ధర్నాకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మీసాల సుధాకర్ (37) స్వస్థలం అనంతపురం జిల్లా, గుత్తి మండలం, ఈశ్వరపల్లి, భార్య లక్ష్మి నర్సమ్మ, ఇద్దరు కుమార్తెలు (స్వర్ణలత10, కృష్ణతులసి5), ఒక కుమారుడు (సుమంత్ కుమార్7) ఉన్నారు. కుటుంబ పోషణ కోసం నగరానికి వచ్చి, విధి నిర్వహణలో తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# 'ఫోన్ ట్యాపింగ్'... మార్గదర్శకాలు

- సంభాషణలను ఆరు నెలల్లో డిలీట్ చేయాల్సిందే
-రివ్యూ కమిటీ ఆదేశాల మేరకే అనుమతి
-టెలిగ్రాఫ్ యాక్ట్–1885 సెక్షన్ 5(2) ఆధారంగా ఫోన్ ట్యాపింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**దేశంలో ఇటీవల ఫోన్ ట్యాపింగ్ అంశం మరోసారి రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చకు వచ్చింది. ఫోన్ కాల్స్, మెసేజులు, డిజిటల్ కమ్యూనికేషన్‌ను ప్రభుత్వ సంస్థలు పర్యవేక్షించడాన్ని ఫోన్ ట్యాపింగ్‌గా పేర్కొంటారు. అయితే ఇది ప్రభుత్వాలకు ఇష్టమొచ్చినట్లు చేయదగిన ప్రక్రియ కాదని, కఠినమైన చట్టబద్ధ నియమాలకు లోబడి మాత్రమే చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్‌కు ప్రధానంగా ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్–1885 సెక్షన్ 5(2) ఆధారం. దేశ భద్రత, ప్రజా శాంతి, నేరాల నివారణ, రాష్ట్ర భద్రత వంటి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ట్యాపింగ్‌కు అనుమతి ఉంది.డిజిటల్ కమ్యూనికేషన్ విషయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్–2000 సెక్షన్ 69 వర్తిస్తుంది.

**ఎవరు అనుమతి ఇవ్వాలి?**

ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఇవ్వగల అధికారం కేంద్ర స్థాయిలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, చీఫ్ సెక్రటరీల ఆదేశాల మేరకే ఫోన్‌టాపింగ్ చేయాలి. పోలీస్ అధికారులు, రాజకీయ నాయకులు లేదా ఇతర అధికారులు నేరుగా ట్యాపింగ్ ఆదేశాలు ఇవ్వలేరని చట్టం స్పష్టం చేస్తోంది.

**కాలపరిమితి.. పర్యవేక్షణ**

ఒకసారి ఫోన్ ట్యాపింగ్‌కు ఇచ్చే అనుమతి గరిష్ఠంగా 60 రోజులు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అవసరమైతే పునఃసమీక్షతో 180 రోజులు (6 నెలలు) వరకు పొడిగించవచ్చు. ప్రతి ట్యాపింగ్ కేసును ప్రత్యేక రివ్యూ కమిటీ పరిశీలించాల్సి ఉంటుంది. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని అవసరం ముగిసిన తర్వాత నాశనం చేయాల్సిందే. అనధికార వ్యక్తులకు లీక్ చేయడం నేరంగా పరిగణిస్తారు.ట్యాపింగ్ అవసరమా? చట్టబద్ధమా? అన్న అంశాలను కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని రివ్యూ కమిటీలు పరిశీలిస్తాయి. అనవసరమని తేలితే వెంటనే ట్యాపింగ్ నిలిపివేయాల్సి ఉంటుంది.సరైన అనుమతి లేకుండా, రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా అనవసరంగా ఎక్కువ కాలం ట్యాపింగ్ కొనసాగిస్తే అది చట్టవిరుద్ధం అవుతుంది. ఇది వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించినట్లుగా పరిగణిస్తారు.

**సుప్రీంకోర్టు స్పష్టీకరణ..**

పియుసిఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1997) కేసులో ఫోన్ ట్యాపింగ్ అనేది వ్యక్తిగత గోప్యతలో జోక్యమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.అలాగే పుట్టస్వామి తీర్పు (2017) ద్వారా ప్రైవసీని మౌలిక హక్కుగా గుర్తించింది.ఫోన్ ట్యాపింగ్ అనేది అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే వినియోగించాల్సిన సాధనమని, ప్రజాస్వామ్యంలో గోప్యత హక్కుకు భంగం కలగకుండా ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

**ఫోన్ ట్యాపింగ్‌కు ప్రతిపాదనలు...**

స్టేట్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) సిఐడి, క్రైమ్ బ్రాంచ్ అధికారులు తమ దర్యాప్తు కోసం పలానా ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేయాలనుకుంటున్నామని ఫోన్ నెంబర్ లీస్టును డిజిపికి పంపిస్తారు. అది పరిశీలించిన డిజిపి హోంశాఖ ప్రత్యేక స్పెషల్ చీఫ్ సెక్రటరీకి సిఫారసు చేస్తారు. హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువస్తారు. చీఫ్ సెక్రటరీ అనుమతి ఇవ్వడంతో ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమౌతుంది. ఫోన్ ట్యాపింగ్ కోసం ఏర్పాటు చేసే రివ్యూ కమిటీలో చీఫ్ సెక్రటరీ, లా సెక్రటరీతో పాటు మరో ప్రభుత్వ కార్యదర్శి ఉంటారు.

# పాకిస్థాన్‌లో పెళ్ళి వేడుకపై ఆత్మాహుతిదాడి

**ఇస్లామాబాద్:** ఈశాన్య పాకిస్థాన్ ఖైబర్‌పఖ్తుంఖ్వా రాష్ట్రంలో ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు భారీ ఎత్తున సైన్య పెద్ద ఆపరేషన్ చేపట్టిన తరుణంలో ఆ ప్రాంతంలో ఒక పెళ్ళి వేడుకపై ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో ఏడుగురు మరణించారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. శాంతి కమిటీ సభ్యులు ఈ పెళ్ళివేడుకలో పాల్గొన్న సమయంలో ఆత్మాహుతి బాంబు నేరుగా వేడుక జరుగుతున్న భవంతిలోకి దూసుకుపోయింది. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న ప్రాంతం వెంబడి ఉగ్రవాదులను అరికట్టేందుకు ప్రభుత్వం మద్దతుతో ఆస్థానిక పెద్దలందరితో కలిసి ఈ శాంతి కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడికక్కడే ముగ్గురు మరణించగా, మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రాంతంలో ఉన్న అఫ్ఘానిస్థాన్–పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదులతో పోరాటం చేసేందుకు భారీ కార్యక్రమాన్ని పాకిస్థాన్ సైన్యం చేపట్టి దాడులకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఘటన జరిగింది. పైగా ఈ తిరాహ్ ప్రాంతం నుండి 20 వేల కుటుంబాలను ప్రభుత్వం వేరే ప్రాంతాలకు తరలించే పనిలో ఉంది. వేలాదిమంది తాత్కాలికంగా ఈ ప్రాంతం నుండి తరలి వెళ్ళిపోతున్నారు. వారి కోసం ప్రభుత్వం తాత్కాలిక శిబిరాలు కూడా ఏర్పాటు చేసింది. పాకిస్థాన్ తాలిబన్‌గా లేదా తెహ్రీక్ –ఎ–తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి)గా గుర్తింపు పొందిన ఉగ్రవాద సంస్థను ఒకేసారి నిర్మూలించేందుకు ప్రభుత్వం ఒక పెద్ద ఆపరేషన్ చేపట్టింది. ఆఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ ప్రభుత్వం తిరిగి అధికారం చేపట్టిన తర్వాత 2021 నుండి ఈ తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్ సంస్థ చాలా బలపడి ఉగ్రవాద కార్యకలాపాలను క్రియాశీలంగా నిర్వహిస్తోంది. ఈ ఉగ్రవాదులను అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం పెంచి పోషిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా, తాలిబన్ పాలకులు ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నారు.

**అఫ్ఘానిస్థాన్‌లో మంచు, వర్షాలు**

అఫ్ఘానిస్థాన్ పంజ్‌షిర్ రాష్ట్రం దారాజిల్లాలో మంచు,భారీ వర్షాల కారణంగా గడచిన మూడు రోజుల్లో 61 మంది మరణించారు. కాబూల్‌లో ప్రకృతి వైపరీత్యాల విభాగం అధికారులు సోషల్ మీడియా ద్వారా ఈ విషయం చెప్పారు. విపరీతంగా మంచు కురవడంవల్ల ప్రధానమైన రహదారులన్నీ మూసుకుపోయాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సంబంధాలు తెగిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. బుధవారం నుండి శుక్రవారం వరకూ సెంట్రల్,నార్త్ రాష్ట్రాలలో భారీగా మంచు, వర్షాలు కురిశాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం 110 మంది మంచు తుఫానుల్లో గాయపడ్డారు. మరో 458 ఇళ్ళు పూర్తిగా, పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 360 కుటుంబాలు మంచు తుఫానువల్ల తీవ్రంగా నష్టపడ్డాయి.

# మేరా భారత్ మహాన్ ' సాంగ్ విడుదల

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** హైదరాబాద్ ముషీరాబాద్ లోని ఎంబీ హైస్కూల్లో చదివిన 1981 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు దేశభక్తిని చాటారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వినోద్ గౌతమ్ రచించిన 'మేరా భారత్ మహాన్' పాటను శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ పాటను సారఫ్ వివాన్, కిరణ్ దరపు పాడగా, జగన్నాథ్ సెండి మ్యూజిక్ అందించారు. ఈ వీడియో సాంగ్ ను యూట్యూబ్‌లోని 'ఎంకె క్రియేషన్స్ మ్యూజిక్ చానల్' లో చూసి, దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే వినోద్ కుమార్, మురళీధర్, అబ్దుల్ రహీం, అబ్రహం లారెన్స్, రఘునాథ్, కైసర్ హాలీ, చెన్నకేశవ్, జాన్సన్, కృష్ణ , శ్రీనివాస్, హెన్రీ తదితరులు పాల్గొన్నారు.




# కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బిసి ఉద్యమం

## రిటైర్డ్ డిజిపి జె. పూర్ణచంద్రరావు పిలుపు

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బీహార్ మాజీ సిఎం, భారతరత్న కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బిసిల రాజ్యాధికార సాధనకు పోరాడుదామని రిటైర్డ్ డిజిపి, ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయ కర్త జె. పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఎఐబిఎస్‌పి ఆధ్వర్యంలో బిసి ఉద్యోగుల జెఎసి చైర్మన్ దేవరకొండ సైదులు అధ్యక్షతన కర్పూర్ ఠాకూర్ 102వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఠాకూర్ చిత్రపటానికి పూర్ణచంద్రరావుతోపాటు కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హెచ్.హనుమంతరావు, ఐఏఎస్ రిటైర్డ్ టి. చిరంజీవులు, ప్రొఫెసర్ బాగయ్య, బిసి టైమ్స్ సూర్య రావు, హెచ్‌సియు ఆలిండియా ఒబిసి స్టూడెంట్స్ ప్రెసిడెంట్ కిరణ్ , బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. దేశంలో అత్యంత వెనుకబడిన కులాల రిజర్వేషన్లకు ఆద్యుడిగా బీహార్, దేశ రాజకీయాల్లో కర్పూరి ఠాకూర్ కొత్త ఒరవడి సృష్టించారని కొనియాడారు. 'మేమెంతో మాకంత మీరెంతో మీకంత' నినాదంతో ఒక నినాదంతో బిసిలు ఉద్యమిస్తే విజయం సాధిస్తామన్నారు. గ్రామాలవారీగా బిసిలను చైతన్యంచేస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. వి.హెచ్. హనుమంతరావు ఠాకూర్ దేశ రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించారన్నారు. బిసిలంతా ఐక్యమై పోరాడాలన్నారు. తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ తదితర నేతలు పాల్గొన్నారు.

# గూడ్స్ రైలు వెళ్తుండగా..పట్టాలపై పేలుడు

## పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలో ఘటన



**చండీగఢ్:** గూడ్స్ రైలు వెళ్తుండగా రైలు పట్టాలపై పేలుడు సంభవించింది. రైలు పట్టాలు ధ్వంసమయ్యాయి. రైలు ఇంజిన్ దెబ్బతిన్నది. లోకో పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ పేలుడుపై దర్యాప్తు చేస్తున్నారు. పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం రాత్రి 9.50 గంటల సమయంలో అమృత్‌సర్‌ఢిల్లీ మార్గంలోని డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లో గూడ్స్ రైలు వెళ్తున్నది. సిర్హింద్ రైల్వే స్టేషన్ లెవల్ క్రాసింగ్ దాటిన తర్వాత రైలు పట్టాలపై పేలుడు సంభవించింది. చాలా దూరం వరకు పేలుడు శబ్దం వినిపించింది. కాగా, ఈ పేలుడు వల్ల రైలు పట్టాలు ధ్వంసమయ్యాయి. గూడ్స్ రైలు ఇంజిన్ దెబ్బతిన్నది. లోకో పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లో సరుకు రవాణా రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు రిపబ్లిక్ డే ముందు రైలు పట్టాలపై పేలుడు జరుగడంతో పోలీసులు, రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పేలుడు ఘటనపై పలు బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. ధ్వంసమైన రైలు పట్టాలను సరి చేశారు. ఈ మార్గంలో గూడ్స్ రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

తెలంగాణా ప్రభుత్వము
కలెక్టర్ కార్యాలయం, హనుమకొండ
రెవెన్యూ (భూ సేకరణ ) శాఖ

కలెక్టర్ ఫైల్ నెం. జి/1341/2107/10 — తేది: 20-01-2026
ఆర్.డి.ఒ ఫైల్ నెం. జి2/653/2024 — తేది: 06-01-2026
గెజిట్ నెం. 04/HNK/2026 — తేది: 22-01-2026

ఫారం - VII

రూఢి ప్రకటన (డిక్లరేషన్)

*(చూడుము సబ్ రూల్- 1, రూల్ -25, సెక్షన్-19(1) చట్టం -30/2013)*

హనుమకొండ జిల్లా ముల్కనూరు గ్రామము భీమదేవరపల్లి మండల పరిధిలో ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన భూమి విస్తీర్ణం (ఎ. 5-34 గుం.ల) భూమి ప్రజా ప్రయోజనార్థమై అనగా MINOR - 9TE of Major 1R ON Distributory-5 on Gouravelly Right Side Main Canal of Gouravelly Canal Project from 0.000 to 1.125km కొరకు అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, హనుమకొండ గారు భావిస్తున్నారు కావున ఇట్టి ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యులు

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూమి రకం (ఖుష్కి / తరి) | భూమి వర్గం | సేకరణ చేయు విస్తీర్ణం (ఎ.గుం.) | పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా | అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా / ప్రస్తుతము మొఖ ఉన్నవారు | సేకరించవలసిన విస్తీర్ణం | ఇతర వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|
| గ్రామం: ముల్కనూర్ | | మండలం: భీమదేవరపల్లి | | | | జిల్లా: హనుమకొండ | | |
| 1 | 211 | ఖుష్కి | పట్టా | 0-07 | గన్ను రాజేంద్రప్రసాద్ S/o వెంకటయ్య<br>గొల్లపెల్లి లక్ష్మ య్య S/o లింగయ్య<br>గొల్లపెల్లి వీరబద్రయ్య S/o లింగయ్య<br>సువార్త సహవాస సామ్యల్ జిల్లెట్ s/o సువార్త సహవాస సామ్యల్ జిల్లెట్<br>మూకటి రవి S/o కొంరయ్య<br>మారపల్లి సునీత రాణి W/o జాన్<br>గొల్లపల్లి రవీందర్ S/o రాజమోగిలి<br>గిరబోయిన అరుణ W/o కొమురయ్య<br>గొల్లపల్లి భాస్కర్ S/o గొల్లపల్లి వెంకటాద్రి<br>గొల్లపల్లి సదానందం S/o గొల్లపల్లి వెంకటాద్రి<br>గిరబోయిన కొమురయ్య S/o మల్లయ్య<br>ఒడ్నల శిరీష రాణి W/o భీంరామ్ | గన్ను రాజేంద్ర ప్రసాద్ S/o వెంకటయ్య | 0-07 | |
| 2 | 247 | | ప్రభుత్వ | 0-07 | | రోడ్ | 0-07 | |
| 3 | 295 | ఖుష్కి | పట్టా | 1-26 | జక్కుల ఓదెలు S/o మల్లయ్య<br>జక్కుల ఓదెలు S/o మల్లయ్య<br>జక్కుల ఓదెలు S/o మల్లయ్య<br>జక్కుల మొండయ్య S/o మల్లయ్య<br>మొండయ్య S/o మల్లయ్య<br>జక్కుల మొండయ్య S/o మల్లయ్య<br>జక్కుల మొండయ్య S/o మల్లయ్య<br>గిరిబోయిన శోభారాణి W/o రవి<br>దొండ మొగిలి S/o ఐలయ్య<br>దొండ కుమారస్వామి S/o చిన్నరాజయ్య<br>బీనవెన సుజాత W/o సంపత్<br>దొండ కృష్ణ S/o దొండ అయిలయ్య | దొండ అయిలయ్య S/o రాజయ్య | 0-18 | 60 మామిడి చెట్లు<br>1 డ్రిప్ లైన్<br>1 పైప్ లైన్<br>2 కొబ్బరి చెట్లు |
| | | | | | | జక్కుల ఓదెలు S/o మల్లయ్య | 0-09 | |
| | | | | | | జక్కల మొండయ్య S/o మల్లయ్య | 0-08 | 1 పైప్‌లైన్ |
| | | | | | | దొండ మల్లయ్య S/o కొము రయ్య | 0-06 | 1 పైప్‌లైన్ |
| | | | | | | జక్కుల ఓదెల S/o మల్లయ్య | 0-05 | 1 టేకు చెట్టు,<br>1 ఉసిరి చెట్టు,<br>1 పైప్‌లైన్ |
| | | | | | | జక్కల మొండయ్య S/o మల్లయ్య | 0-06 | 1 పైప్‌లైన్ |
| | | | | | | జక్కుల ఓదెలు S/o మల్లయ్య | 0-08 | 1 పైప్‌లైన్ |
| | | | | | | దొండ రాజయ్య S/o కొము రయ్య | 0-06 | 1 పైప్‌లైన్ |
| 4 | 297 | ఖుష్కి | పట్టా | 0-16 | దొండ కనకతార W/o పోచయ్య<br>దొండ రవీందర్ S/oకొంరయ్య<br>దొండ రవీందర్ S/oకొంరయ్య<br>జక్కుల ఓదెలు S/o మల్లయ్య<br>జక్కుల మొండయ్య S/o మల్లయ్య<br>జక్కుల మొండయ్య S/o మల్లయ్య<br>గిరిబోయిన శోభారాణి W/o రవి<br>దొండ కుమారస్వామి చిన్నరాజయ్య<br>దొండ కుమారస్వామి S/o చిన్నరాజయ్య<br>బీనవేణి సుజాత W/o సంపత్<br>బీనవేణి సుజాత W/o సంపత్ | జక్కుల ఓదెలు S/o మల్లయ్య | 0-02 | |
| | | | | | | జక్కుల మొండ య్య S/o మల్లయ్య | 0-10 | |
| | | | | | | జక్కుల ఓదెలు S/o మల్లయ్య | 0-04 | |
| 5 | 292 | ఖుష్కి | పట్టా | 0-16 | జక్కుల రాజు S/oఅయిలయ్య<br>దొంగల కొంరయ్య S/o వెంకట్రాజ<br>దొంగల సత్యనారాయణ S/o మొగిలి<br>దొంగల వేణు S/o మొగిలి<br>జక్కుల అయిలయ్య S/oచంద్రయ్య<br>దొండ మల్లయ్య S/o వీరమల్లు<br>దొండ శ్రీనివాస్ S/o వీరమల్లు<br>దొండ రవి S/oరాజయ్య<br>జక్కుల భాగ్యలక్ష్మి W/o రాజు<br>జక్కుల భాగ్యలక్ష్మి W/o రాజు<br>గుడికందుల రాజయ్య S/o ఓదెలు<br>దొంగల రవీందర్ S/oదొంగల అయిలయ్య | దొంగల సతీష్ S/o మొగిలి | 0-09 | 1 డ్రిప్ పైప్ లైన్ |
| | | | | | | దొంగల వేణు S/o మొగిలి | 0-07 | |
| 6 | 302 | ఖుష్కి | పట్టా | 0-09 | దొండ రవీందర్ S/O కొంరయ్య<br>దొంగల సంపత్ S/o మల్లయ్య | దొంగల వేణు S/o మొగిలి | 0-01 | |
| | | | | | | దొంగల రవీందర్ S/o అయిల య్య | 0-08 | 1 నిమ్మ<br>10 టేకు<br>6 మామిడి<br>3 సపోట<br>1 వేప చెట్టు<br>1 పైప్‌లైన్ |
| 7 | 303 | ఖుష్కి | పట్టా | 0-27 | దొంగల మల్లమ్మ W/o మల్లయ్య<br>దొంగల వెంకటయ్య S/o అయిలయ్య | దొంగల రవీందర్S/o అయిలయ్య | 0-03 | 1 తాడి చెట్టు |
| | | | | | | దొంగల సంపత్ S/o మల్లయ్య | 0-14 | 3 మామిడి<br>2 వేప చెట్లు<br>1 పైప్‌లైన్ |
| | | | | | | దొంగల వెంకట య్య | 0-08 | |
| | | | | | | దొండ పోచయ్య S/o కొమురయ్య | 0-02 | |
| 8 | 306 | ఖుష్కి | పట్టా | 1-19 3/4 | దొంగల ఐలయ్య S/o అయిలయ్య<br>దొండ పోచయ్య S/o కొంరయ్య<br>దొండ రాజయ్య S/o కొంరయ్య<br>దొండ రాజయ్య S/o కొంరయ్య<br>దొండ కనకతార W/o పోచయ్య<br>దొడ కనకతార W/o పోచయ్య<br>జక్కుల రాజమౌళి<br>దొండ అనిల్ కుమార్ S/oపోచయ్య<br>దొండ అనిల్ కుమార్ S/o పోచయ్య<br>దొండ అనిల్ కుమార్ S/o పోచయ్య<br>గండు రజిత W/oసదానందం | దొండ పోచయ్య S/o కొము రయ్య | 1-19 3/4 | 66 మామిడి చెట్లు,<br>81 టేకు చెట్లు,<br>1 పైప్‌లైన్ |
| 9 | 305 | ఖుష్కి | పట్టా | 0-0 1/4 | దొంగల కిరణ్ S/o మొగిలి | దొంగల కిరణ్ S/o మొగిలి | 0-0 1/4 | 3 మామిడి<br>2 కుంకుడు చెట్లు |
| 10 | 310 | ఖుష్కి | పట్టా | 0-26 | దొండ రవీందర్ S/o కొంరయ్య<br>గండు రాజయ్య S/oఅయిలయ్య<br>గండు రాజయ్య S/oఅయిలయ్య<br>గండు రాజయ్య S/oఅయిలయ్య<br>కొదురుపాక చంద్రమౌళి S/oమల్లయ్య<br>కొదురుపాక చంద్రమౌళి S/oమల్లయ్య<br>కొదురుపాక చంద్రమౌళి S/oమల్లయ్య<br>కొదురుపాక చంద్రమౌళి S/oమల్లయ్య<br>కొదురుపాక రాజమౌళి S/o మల్లయ్య<br>కొదురుపాక రవీందర్ S/oమల్లయ్య<br>కొదురుపాక రవీందర్ S/oమల్లయ్య<br>కొదురుపాక రవీందర్ S/oమల్లయ్య<br>కొదురుపాక రవీందర్ S/oమల్లయ్య<br>దొండ సదానందం S/o వెంకటయ్య<br>దొండ రవీందర్ S/o వెంకటయ్య<br>దొంగల కిరణ్ S/o మొగిలి<br>దొంగల కిరణ్ S/oమొగిలి<br>దొంగల కిరణ్ S/oమొగిలి<br>కొదురుపాక నాగరాజు S/o రాజమొగిలి<br>కొదురుపాక నాగరాజు S/o రాజమొగిలి<br>తనుగుల లావణ్య W/o రమేష్<br>కొదురుపాక సురేష్ S/o రాజమౌళి<br>మహమ్మద్ రషీద్ S/o Md షరీఫ్.<br>మొహమ్మద్ బాబా S/o Md. షరీఫ్<br>ఇతర రోడ్లు | దొంగల కిరణ్ S/o మొగిలి | 0-03 | 1 పైప్‌లైన్<br>1 డ్రిప్‌లైన్<br>23 టేకు చెట్లు,<br>10 మామిడి చెట్లు |
| | | | | | | కొదురు పాక చంద్ర మౌళి S/o మల్లయ్య | 0-09 | 18 సపోట చెట్లు,<br>1 జామ చెట్టు,<br>15 పామ్ చెట్లు,<br>2 మామిడి చెట్లు,<br>1 పైప్‌లైన్ |
| | | | | | | గుండు రాజయ్య S/o అయి లయ్య | 0-14 | 24 మామిడి చెట్లు,<br>పైప్‌లైన్,<br>డ్రిప్ |
| మొత్తం విస్తీర్ణం | | | | ఎ.5-34 గుంటలు | | | ఎ.5-34 గుంటలు | |

చట్టం నెం.30 ఆఫ్ 2013 సెక్షన్ 15 (2) క్రింద తెలిపిన విధముగా ఆసక్తి గల వ్యక్తులను సంప్రదించి తగు విచారణ చేపట్టిన తరువాత మరియు భూసేకరణపై నిర్ణీత గడువులో వచ్చిన అభ్యంతరాలు పరిష్కరించిన పిదప ఇట్టి రూఢి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

గౌరవెల్లి కాలువ నిర్మాణం కొరకు భీమదేవరపల్లి మండల పరిధిలోని ముల్కనూరు గ్రామము నందు భూమి సేకరించబడుచున్న నిర్మాణ దశలో సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదైనా భాగం, ఇతర భాగాలలో ఉండే గనులు, ఖనిజాలను త్రవ్వు సమయంలో బొగ్గు, ఇనుము రాయి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల నుండి వచ్చే ఖనిజాల అవసరం లేదు.

పైన తెలుపబడిన భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, హనుమకొండ లేదా భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజినల్ అధికారి, హనుమకొండ వారి కార్యాలయములో ఏదైనా పని దినమున, పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

భూసేకరణ చేయు భూమిలో ఎటువంటి నివాస గృహములు లేవు, వ్యవసాయ భూమి భాగములు మాత్రమే సేకరించబడుచున్నవి. ఇట్టి ప్రాజెక్టు భూసేకరణ ద్వారా ఏ యొక్క కుటుంబము కూడా భూనిర్వాసితులు కావడం లేదు. ఏ ఒక్క వృత్తి కళాకారులు కాని, చిరు వ్యాపారులు కాని, వాణిజ్య సముదాయములు కాని, ప్రజల సామూహిక సౌకర్యములు అనగా రోడ్లు, నీటి ట్యాంకులు, పార్కులు సేకరించబడుట లేదు. అందువలన పునరావాస మరియు పునరావాస ప్యాకేజ్ ఇట్టి ప్రాజెక్టనకు వర్తించదు.

| సం/- | సం/- | సం/- |
|---|---|---|
| భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమకొండ | అదనపు కలెక్టర్ హనుమకొండ | జిల్లా కలెక్టర్ హనుమకొండ |

DIPR RO NO. 1077/LA/PP/Advt/Pub/2025-26

# గవర్నర్ పదవికి ఆర్.ఎన్. రవి అవమానం

## రాజ్యాంగ పదవిలో ఉండి అసెంబ్లీలో ప్రసంగించకపోవడం ఏమిటని సిఎం స్టాలిన్ నిలదీత
## తమిళనాడు ఎప్పుడూ చూడని సంక్షోభాన్ని చూస్తోందని ఆవేదన



**చెన్నై:** అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి ప్రసంగాన్ని చదవకుండా గవర్నర్ పదవిని అవమానించారని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఆరోపించారు. గవర్నర్ చర్యలపై విమర్శించాల్సిన అవసరం తనకు ఉందని పేర్కొంటూ గతంలో తమిళనాడు చూసిన చాలా మంది గవర్నర్లు రవి లాంటి వారు కాదని ముఖ్యమంత్రి అన్నారు. మాజీ ముఖ్యమంత్రులు సి.ఎన్. అన్నాదురై, ఎం కరుణానిధి, ఎం.జి రామచంద్రన్, జె. జయలలిత హయాంలో చూడని సంక్షోభాన్ని తాను ఎదుర్కొంటున్నానని, అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో ప్రసంగాన్ని చదవకుండా, సమావేశం ప్రారంభంలో జాతీయ గీతాన్ని ప్లే చేయాలని పట్టుబట్టడం ద్వారా గవర్నర్ (రవి) తన పదవిని అవమానిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు శనివారం స్టాలిన్ సమాధానమిచ్చారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశం మొదటి రోజున రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిన సంప్రదాయ ప్రసంగం చేయడానికి గవర్నర్ రవి నిరాకరించారని, ప్రసంగంలో తప్పులు ఉన్నాయని ఉన్నాయని పేర్కొనగా, స్పీకర్ అప్పావూ ఆ వచనం తమిళ వెర్షన్‌ను చదివి వినిపించారని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ముగింపులో ఎప్పుడు కూడా జాతీయ గీతం వినిపించబడుతుందని, ప్రారంభంలో తమిళ థాయ్ వజుతు (తమిళ మాతృ ప్రార్థన) వినిపించబడుతుందని స్టాలిన్ గుర్తు చేశారు. 'దేశభక్తిలో మనం ఎవరికంటే తక్కువ కాదు, ఎవరూ మాకు నేర్పించాల్సిన అవసరం లేదు' అని స్టాలిన్ అన్నారు. సంక్షోభం తనకు కొత్త కాదని చెప్పారు. తాను గతంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నానని, వాటిని అధిగమించానన్నారు. గత ఐదు సంవత్సరాలలో ఈ ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ ప్రజల కోసం జీవించాడని, వారి శ్రేయస్సు కోసం ప్రణాళికలను రూపొందించాడని చెప్పుకొచ్చారు. తమిళనాడు మొత్తాన్ని అభివృద్ధి చేశానని, ఇది వాస్తవమన్నారు. ప్రతిపక్ష పార్టీలు దీనిని భరించలేకపోతున్నాయని అర్థం చేసుకోగలనని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు సంక్షేమం కోసం పనిచేయాల్సిన గవర్నర్... రాష్ట్రానికి వ్యతిరేకంగా, ప్రజల కోసం పోరాడే తమకు వ్యతిరేకంగా కూడా పనిచేస్తూనే ఉన్నారని బాధ వ్యక్తం చేశారు. గవర్నర్ వాకౌట్ చేయడం వింతగా ఉందన్నారు. 'ఈ చర్య బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూనే, తాను నిర్వహిస్తున్న పదవిని అవమానించడంతో సమానం. భారత రాజ్యాంగాన్నే అపవిత్రం చేయడంతో సమానం' అని ఆయన అన్నారు. గత మూడు సంవత్సరాలుగా గవర్నర్ పదే పదే ఇదే కారణాన్ని పేర్కొంటూ, ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వం తయారు చేసి ఇచ్చిన ప్రసంగాన్ని చదవకుండానే అసెంబ్లీ నుండి వాకౌట్ చేశారని, ఈ అసెంబ్లీ దానిని ప్రజాస్వామ్యానికి సవాలుగా పరిగణించాలని సూచించారు. ఇది కోట్లాది మంది ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వమని, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలను తీర్చే ప్రభుత్వమని డిఎంకె అధ్యక్షుడు కూడా అయిన స్టాలిన్ ఉద్ఘాటించారు. తమిళనాడు అసెంబ్లీ సంప్రదాయం ప్రకారం, గవర్నర్ ప్రసంగం ప్రారంభించే ముందు 'తమిళ తాయ్ వజుతు' పాడారని, ప్రసంగం ముగింపులో జాతీయ గీతం పాడారని ముఖ్యమంత్రి వివరించారు.

## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు...
# 27న అఖిలపక్ష భేటీ




**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 28వ తేదీన ప్రారంభం కానున్నాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో ప్రసంగించడంతో సమావేశాలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బిల్లులు, ఎజెండాపై చర్చించడానికి ఈ నెల 27వ తేదీన అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ చరిత్రలో అరుదైన సందర్భం ఏర్పడింది. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న అంటే ఆదివారం ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదవ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఏర్పాటు చేసిన ఈ అఖిలపక్ష సమావేశం జనవరి 27న ఉదయం 11 గంటలకు పార్లమెంట్ హౌస్ అనుబంధంలోని ప్రధాన కమిటీ గదిలో జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. మొదటి దశ ఫిబ్రవరి 13న ముగుస్తుంది. మార్చి 9న పార్లమెంటు తిరిగి సమావేశమవుతుంది. యుపిఎ కాలం నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకువస్తున్న విక్షిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో పాలక బిజెపి కొత్త చట్టాన్ని సంస్కరణవాదంగా, పాత చట్టంలోని లొసుగులను పూడ్చడానికి అవసరమైనదిగా చెప్పేందుకు ప్రతివాద ప్రచారాన్ని నిర్వహిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రపంచ ఆర్థిక క్రమాన్ని పెంచిన సమయంలో కేంద్ర బడ్జెట్‌ను కూడా సమర్పించనున్నారు. అంతర్గత సర్క్యులర్ ప్రకారం రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ కోసం లోక్‌సభ ఫిబ్రవరి 2 నుండి 4 వరకు మూడు రోజులు తాత్కాలికంగా కేటాయించింది. జనవరి 28, ఫిబ్రవరి 1 తేదీల్లో జీరో అవర్ ఉండదు. విక్షిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లు, 2025, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ 2025; రాజ్యాంగ (నూట ఇరవై తొమ్మిదవ సవరణ) బిల్లు, 2024తో సహా తొమ్మిది బిల్లులు లోక్‌సభ ముందు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులను ప్రస్తుతం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు లేదా సెలెక్ట్ కమిటీలు పరిశీలిస్తున్నాయి.

# 76 ఏళ్ల క్రితం రాజ్యాంగంపై 264 మంది సభ్యులు సంతకం : జైరామ్



**న్యూఢిల్లీ :** డెబ్బై ఆరేళ్లే క్రితం ఇదే రోజున (జనవరి 24న) రాజ్యాంగ సభలోని 264 మంది సభ్యులు భారత రాజ్యాంగంపై అధికారికంగా తమ సంతకాలు చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదిర్శ జైరాం రమేష్ గుర్తు చేశారు. ఇది లోతైన సామాజికఆర్థిక పరివర్తనకు ఒక అధ్యాయమన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. నవంబరు 26, 1949న ఆమోదించిన రాజ్యాంగంపై జనవరి 24న 264 మంది సభ్యులు అధికారికంగా మూడు కాపీలుపై సంతకాలు చేశారన్నారు. వాటిలో రెండు ఇంగ్లీష్, హిందీలో చేతితో రాసినవి ఉన్నాయన్నారు. ఇంగ్లీషులో అందమైన కాలిగ్రఫీతో ఉన్నది ప్రేమ్ బెహారీ నారాయణ్ రైజాదా రాసిందని, హిందీలో ఉన్నది వసంత్ కె వైద్యది అని ఆయన పేర్కొన్నారు. 'ఈ చేతితో రాసిన రాజ్యాంగాల మొదటి పేజీలో జాతీయ చిహ్నం ఉంది. దీనిని దీననాథ్ భార్గవ రూపొందించారు. ఆయన నందలాల్ బోస్ పట్టుబట్టడంతో కోల్‌కతా జూను సందర్శించి కొన్ని నెలలు గడిపారు. తద్వారా చిహ్నంలోని సింహాలు నిజమైన సింహాల మాదిరిగానే ఉండేలా చూసుకున్నారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'ఇది లోతైన సామాజిక, ఆర్థిక పరివర్తనకు ఒక చార్టర్ అనే వాస్తవం కాకుండా, ఆగస్టు 1954లో ఏర్పాటు చేయబడిన లలిత కళా అకాడమీ ఈ ఇలస్ట్రేటెడ్ రాజ్యాంగాన్ని భారతదేశ బహుళస్థాయి చరిత్రను నావిగేట్ చేసే, వైవిధ్యంలో ఏకత్వం దారాలను జరుపుకునే 'ఒక సెమినల్ ఆర్ట్ ట్రీటైజ్'గా అభివర్ణించింది' అని రమేష్ అన్నారు. 'ఆ రోజే, సభ్యులు కలిసి గ్రూప్ ఫోటోగ్రాఫ్ కోసం కూర్చున్నారు. ఇది యుగాలకు ఒకటి' అని ఆయన అన్నారు.

## రోజ్‌గార్ మేళా...
# 61 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ప్రధాని




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించా రు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరె న్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రి త్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అ నేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బిఎస్‌ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సిఆర్‌పిఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# క్షమాపణ చెప్పను

## 'ఆపరేషన్ సిందూర్'పై నా అభిప్రాయం అదే: శశి థరూర్



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపి శశి థరూర్ తన సొంత పార్టీ వైఖరిపై, జాతీయ భద్రతా అంశాలపై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను పార్లమెంటులో ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ గీత దాటలేదు. కానీ 'ఆపరేషన్ సిందూర్' విషయంలో మాత్రం నా అభిప్రాయం మార్చుకోను. దానిపై నేను క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు' అని ఆయన చెప్పారు. కేరళలోని కోజికోడ్ వేదికగా జరుగుతున్న 'కేరళ లిటరేచర్ ఫెస్టివల్'లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో ఆయన స్థానం, నాయకత్వంతో విభేదాలు, పాకిస్థాన్‌పై భారత సైనిక చర్య వంటి అనేక అంశాలపై స్పందించారు. 'పహల్గాం దాడి జరిగిన వెంటనే నేను ఒక పత్రికలో వ్యాసం రాశాను. పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పాలని కోరాను. ఉగ్రవాద శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు చేయాలని సూచించాను. అదే సమయంలో పాకిస్థాన్‌తో సుదీర్ఘ యుద్ధం మంచిది కాదని చెప్పాను. ఆశ్చర్యకరంగా, భారత ప్రభుత్వం నేను చెప్పినట్లే చేసింది. అలాంటప్పుడు నేను ప్రభుత్వాన్ని ఎలా విమర్శించగలను? అందుకే ఆపరేషన్ సిందూర్‌ను అప్పుడూ సమర్థించాను, ఇప్పుడూ సమర్థిస్తున్నాను' అని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన పరిణామాలను థరూర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి ప్రభుత్వం ఒక అఖిలపక్ష బృందాన్ని విదేశాలకు పంపింది. అందులో శశి థరూర్ కూడా సభ్యుడిగా వెళ్లారు. ఇది కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి నచ్చలేదు. 'నా పార్టీకి అది ఎందుకు నచ్చలేదో మీరే అడగాలి' అని థరూర్ వ్యాఖ్యానించారు. జాతీయ భద్రత విషయంలో రాజీపడేది లేదని థరూర్ తేల్చిచెప్పారు. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మాటలను ఆయన గుర్తు చేశారు. 'దేశమే చనిపోతే, ఇక ఎవరు బతికుంటారు?' అన్న నెహ్రూ ప్రశ్నను గుర్తు చేశారు. 'భారత భద్రత ప్రమాదంలో ఉన్నప్పుడు, దేశ ప్రయోజనాలే ముఖ్యం. పార్టీల మధ్య రాజకీయ విబేధాలు ఉండొచ్చు. కానీ దేశం విషయానికి వస్తే అందరూ ఒక్కటిగా నిలబడాలి. అక్కడ పార్టీలు కాదు, భారతదేశం గెలవాలి' అని పిలుపునిచ్చారు.

**రాహుల్ గాంధీతో విభేదాలా?**

ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీలో థరూర్‌ను పక్కన పెడుతున్నారనే వార్తలు వస్తున్నాయి. కొచ్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ, శశి థరూర్‌ను సరిగా పట్టించుకోలేదనే ప్రచారం జరిగింది. వేదికపై థరూర్ ఉన్నా ఆయన పేరు ప్రస్తావించలేదని టాక్ వచ్చింది. దీనిపై ప్రశ్నించగా, 'ఆ విషయంపై నేను కామెంట్ చేయను' అని థరూర్ దాటవేశారు. అయితే కొన్ని వార్తలు నిజం కావొచ్చు, కొన్ని అబద్ధం కావొచ్చంటూ వ్యాఖ్యానించారు.

# 'సుప్రీం' ఆదేశాలు పాటించడంలో 'ఇసి' అనిశ్చితి

## బిఎల్‌ఒలు సాఫ్ట్‌వేర్‌ను సకాలంలో అందుకోకపోవడంతో ఓటర్ల జాబితా ప్రచురణలో జాప్యం




**కోల్‌కతా:** బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఒలు) అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సకాలంలో అందుకోకపోవడంతో, శనివారం నాటికి డేటా వ్యత్యాసాలు ఉన్న ఓటర్ల జాబితాను ప్రచురించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించడంలో ఎన్నికల కమిషన్ అనిశ్చితిని ఎదుర్కొంటోందని ఒక అధికారి తెలిపారు. లాజికల్ వ్యత్యాసాలు జాబితాలో ఉన్నవారి పేర్లను అన్‌మ్యాప్ చేయబడిన ఓటర్ల పేర్లను పంచాయతీ, బ్లాక్ కార్యాలయాలలో ప్రదర్శించాలని ఈనెల 19న సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. 'శుక్రవారం రాత్రి వరకు మాకు సాఫ్ట్‌వేర్ అందలేదు. చివరి క్షణంలో సాఫ్ట్‌వేర్ మాకు చేరినప్పటికీ, కొన్ని గంటల్లోపు ఇంత భారీ మొత్తంలో డేటాను డౌన్‌లోడ్ చేయడం, ప్రింట్ చేయడం, ప్రదర్శించడం చాలా కష్టం' అని పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) కార్యాలయంలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బిఎల్‌ఒలు ఇప్పటికే విచారణ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని, లాజిస్టిక్‌గా, ఇది ఒక పెద్ద సవాల్ అని ఆయన అన్నారు. ప్రచురించబోయే జాబితాలో డేటా వ్యత్యాసాలు ఉన్నవారి పేర్లతో పాటు అన్‌మ్యాప్ చేయబడిన ఓటర్లు మొత్తం 1.26 కోట్ల మంది ఉంటారని అధికారులు తెలిపారు. చివరి రోజు ఆదేశాలను పాటించడంపై ఆలస్యం అనిశ్చితిని సృష్టించిందని అధికారులు తెలిపారు. 'మా దగ్గర డేటా ఉంది, కానీ క్షేత్ర స్థాయిలో ఎన్నికల నిర్వహణ పూర్తిగా బిఎల్‌ఒలపై ఆధారపడి ఉంటుంది' అని మరొక అధికారి అన్నారు. కోర్టు గడువును తీర్చడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాకపోవచ్చు అని అన్నారు. కాగా, అన్‌మ్యాప్ చేయబడిన ఓటర్లుగా వర్గీకరించబడిన 3 లక్షలకు పైగా ఓటర్లు నోటీసులు అందజేసినప్పటికీ విచారణలకు హాజరు కాలేదని ఒక అధికారి తెలిపారు. అన్‌మ్యాప్ చేయబడిన ఓటర్లలో దాదాపు 10 శాతం మంది విచారణలకు హాజరు కాలేదు అని ఆయన అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను వేగవంతం చేయడానికి, అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయిలో 294 మంది అదనపు సీనియర్ మైక్రోఅబ్జర్వర్లను నియమించాలని ఇసి నిర్ణయించిందని ఒక అధికారి తెలిపారు. పారదర్శకత, పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారాన్ని నిర్ధారించడం దీని లక్ష్యమని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ఓటర్లలో మొత్తం 7.62 కోట్ల గణన ఫారాలను పంపిణీ చేశారు. డిసెంబర్ 16న ఇసి ఎలక్టోరల్ డ్రాఫ్ట్ రోల్స్‌ను ప్రచురించింది. అందులో మరణాలు, బదిలీలు, ఎంట్రీలలో నకిలీ కారణంగా 58 లక్షలకు పైగా పేర్లు తొలగించారు. తార్కిక వ్యత్యాసాలు లేదా చివరి సర్ జరిగినప్పుడు 2002 ఓటర్ల జాబితాతో వారి ఎంట్రీలు మ్యాప్ చేయబడనందున ముసాయిదా జాబితాలో పేర్లు ఉన్న దాదాపు 1.26 కోట్ల మంది ఓటర్లకు వెరిఫికేషన్ హియరింగ్ నోటీసులు జారీ చేయబడ్డాయి. తార్కిక వ్యత్యాసాలలో తప్పు లేదా ఒకేలా ఉండే తల్లిదండ్రుల పేర్లు, ఆరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న ఓటర్లు, తల్లిదండ్రులు లేదా తాతామామలతో నమ్మశక్యం కాని వయస్సు వ్యత్యాసాలు, 45 ఏళ్ల పైబడిన వ్యక్తులను కొత్త ఓటర్లుగా చూపడం వంటివి ఉన్నాయి అని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 7న విచారణలు ముగియనున్నాయి. తుది ఓటర్ల జాబితా ఫిబ్రవరి 14న ప్రచురించబడుతుంది. అయితే, గడువును పొడిగించవచ్చని ఇసి సూచించింది.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT AND SESSION JUDGE
AT: Jangaon
A.S. No. 17 OF 2023

Between:
**Ponaganti Das**
... Appellant
AND
**Ponaganti Uppalaiah**
**And 17 others**
...Defendants

**DEFENDANTS No. 8**
**Ponaganthi Somaiah**
**S/o Pedda Yadaiah,**
Aged about: 45; Occ: Agriculture, Marigadi Village, Jangaon Mandal and District.

Please take Notice that the above suit is posted for your appearance. If you fail to attend before the Hon'ble Court in the above suit on **11-02-2026 at 10:30 A.M.,** the matter will be decided Exparte.

**By order of Hon'ble PRINCIPAL DISTRICT AND SESSION JUDGE COURT AT: JANGAON**

Sd/-
**J. STANLEY**
**Advocate**
H.No. 18-385/8,
Mallikarjunagar, Medchal Malkajgiri District - 500047.
Ph: 9849317641

**JANGAON**
**25-01-2026**

# ప్రధాని దక్షిణాది యాత్ర నిష్ఫలం

ప్రధానమంత్రి, బిజెపి అగ్రనాయకుడు నరేంద్రమోదీ, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక రోజు పర్యటనకు వచ్చారు, వెళ్లారు. అభివృద్ధికి తారకమంత్రంగా బిజెపియేతర రాష్ట్ర పర్యటనల్లో ఆయన అలవాటుగా జపిస్తున్న ''డబుల్–ఇంజిన్ సర్కార్'' (కేంద్రంతోపాటు రాష్ట్రంలో కూడా బిజెపి ప్రభుత్వం) ఆవశ్యకతను తిరువనంతపురం (కేరళ), మదురాంతకం (తమిళనాడు) సభల్లో మోదీ వక్కాణించారు. మొన్న పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల పర్యటనలో పాలక తృణమూల్ కాంగ్రెస్‌పై విరుచుకపడటంతోపాటు ఈసారి బిజెపి అధికారంలోకి వచ్చేస్తుందని జోస్యం మరీ గట్టిగా చెప్పారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అందుకోసం సర్వశక్తులు ఒడ్డిన మోదీ–షా ద్వయానికి నడ్డివిరిగింది. ఈ పర్యాయం ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించి ఓటర్ల జాబితాల ప్రక్షాళన (ఎస్ఐఆర్) పేరుతో వలసదారుల ఏరివేత అంటూ పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించి లబ్ధి పొందే ప్రక్రియపై బిజెపి ఆశలు పెట్టుకుంది. 'బిజెపికి అధికారమిస్తే 'చొరబాటుదారులను ఏరివేస్తాం' అని ప్రధాని అసోంలో, పశ్చిమ బెంగాల్‌లోనూ చెప్పారు. బెంగాల్‌లోకి పెద్ద సంఖ్యలో బంగ్లా దేశీయులు చొరబడ్డారని, వారు మమతా బెనర్జీకి ఓటు బ్యాంక్‌గా ఉపయోగపడుతున్నారని మోదీ–షాలు చేస్తున్న ఆరోపణ యదార్థమైతే, అంతర్జాతీయ సరిహద్దులకు కాపలా నిర్వహణ కేంద్రానిదే అయినందున అది బిజెపి వైఫల్యమే కదా! ఓట్ల కోసం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పాటపాడటం వారికి అలవాటు.

> తమిళనాడులో సొంతంగా అధికారంలోకి రావటం కల్లయని మోదీకి తెలుసు. అందుకే కూటమిలో భాగస్వామిగా అయినా అధికారంలోకి రావాలని పరితపిస్తున్నారు... బిజెపి నేతలు 'డబుల్ ఇంజిన్ సర్కార్' అంటుంటే, పళనిస్వామి ప్రధాని మోదీ ముఖంమీదనే (అదే మదురాంతకం సభలో) ''ఎన్‌డిఎ అలయెన్స్ 210 సీట్లు గెలుస్తుంది. ఎఐఎడిఎంకె స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది'' అని ప్రకటించారు.

తమిళనాడులో సొంతంగా అధికారంలోకి రావటం కల్లయని మోదీకి తెలుసు. అందుకే కూటమిలో భాగస్వామిగా అయినా అధికారంలోకి రావాలని పరితపిస్తున్నారు. అన్నాడిఎంకె నాయకుడు ఎడప్పాడి కె.పళనిస్వామి(ఇపిఎస్)తో పొత్తు పెట్టుకుని, అతనిపై ఒత్తిడి పెంచేందుకు మరికొన్ని ముక్కలను ఎన్‌డిఎలోకి రాబడుతున్నారు. ఇపిఎస్‌తో సీట్ల పంపిణీ చర్చలు జరిపిన అమిత్ షా బిజెపికి 57 సీట్లు కోరి వారి తిరస్కరణకు గురైనాడు. బిజెపి నేతలు 'డబుల్ ఇంజిన్ సర్కార్' అంటుంటే, పళనిస్వామి ప్రధాని మోదీ ముఖంమీదనే (అదే మదురాంతకం సభలో) ''ఎన్‌డిఎ అలయెన్స్ 210 సీట్లు గెలుస్తుంది. ఎఐఎడిఎంకె స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది'' అని ప్రకటించారు.

తమిళనాడులో డిఎంకె, ఎఐఎడిఎంకెలు కొన్ని మిత్రపక్షాలతో కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసినా, ఏకపార్టీ ప్రభుత్వాలు ఏర్పాటు చేయటమే సాంప్రదాయంగా ఉంది. తమ పార్టీ ఎదుగుదలకు సోపానంగా అధికారంలో భాగం కోసం బిజెపి ఉవ్విళ్లూరుతున్నా ఇపిఎస్ సందు ఇవ్వటం లేదు.

కేరళలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను బిజెపి తొలిసారి చేజిక్కించుకున్నందున రాష్ట్ర నాయకత్వం కన్నా జాతీయ నాయకత్వం మరీ ఉత్సాహపడిపోతోంది. ఆ విజయాన్ని చారిత్రకంగా, రాష్ట్రంలో అధికారంలోకి రావటానికి సోపానంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. అయితే మేయర్ అభ్యర్థి ఎంపికలో రాష్ట్ర నాయకత్వం రెండు ముఠాలైంది. ప్రధానికి స్వాగతం చెప్పే జాబితానుంచి మేయర్ రాజేశ్ పేరు తొలగింపు, వేదికపై మరికొందరు నాయకులకు అవమానం బిజెపివారి అంతర్గత కీచులాటలను బహిరంగంగా ప్రదర్శించింది. అయితే ప్రధాని రాష్ట్రానికి ఏవో వరాలు ప్రకటించి తమకు ఊతమిస్తారని ఆశించిన బిజెపి నాయకులు భంగపడక తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయమైన కోర్కెలు వేటినీ ప్రధాని పట్టించుకోలేదు. ఆయన చేసిందేమిటయ్యా అంటే ఒక రోడ్ షో, గంటపాటు ప్రసంగం, నాలుగుర్రైళ్లకు పచ్చజెండాలు ఊపటం.

కేంద్రప్రభుత్వంనుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5783.69 కోట్ల నిధుల విడుదల చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర చరిత్రలోనే దారుణమైన వాయినాడ్ వరదల అనంతర ప్రధాని మోదీ సందర్శనకు వచ్చి, నాలుగు సానుభూతి మాటలు చెప్పి వెళ్లారు గాని, బాధితులను ఆదుకునేందుకు పైసా విదిలించలేదు. ఈ వివక్ష రాష్ట్ర ప్రజలు మరిచిపోరు. కేరళ విదేశాలనుంచి సహాయం స్వీకరించేందుకు అనుమతించలేదు. త్రిపుర, ఆంధ్రప్రదేశ్‌లకు వరద సహాయం అందించటం, మహారాష్ట్రకు విదేశీ సహాయాన్ని అనుమతించటం ఆయన పక్షపాతాన్ని, కేరళ పట్ల రాజకీయ వివక్షను బహిర్గతం చేసింది. కాబట్టి మోదీ కేరళ పర్యటన వారి పార్టీకి ప్రోత్సాహమివ్వలేదు, ప్రజలను సంతృప్తిపరచలేదు. డబుల్–ఇంజిన్ సర్కారు పగటికలకాక ఏమవుతుంది?



## ఈ ఏడాది జోరుగా ఉపగ్రహ ప్రయోగాలు

ఈ సంవత్సరం పెద్ద సంఖ్యలో ఉపగ్రహ ప్రయోగాలు ప్రయోగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఆ కృషిలోనే నిమగ్నమై ఉన్నాం. అలాగే, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం స్థాపించడం, చంద్రుడిపైకి పర్యాటకులను పంపించి సురక్షితంగా తీసుకురావడం, అమెరికాతో సమష్టిగా రోదసీ అన్వేషణకు రాబోయేకాలంలో ఒకదాని తర్వాత ఒకటి పెద్దపెద్ద ప్రయోగాలు వరుసక్రమంలో ఉన్నాయి. అంతరిక్ష అన్వేషణలో దాదాపు 60 మిత్ర దేశాలతో భారత్‌కు బలమైన సహకారం ఉంది. అంతర్జాతీయ సహభాగస్వాములకు లబ్ధి కలుగుతుంది. పిఎస్ఎల్‌వి వాహకనౌక నాలుగు దశల్లో ప్రయాణం చేస్తుంది. జనవరి 12వ తేదీన ఈ నౌక మూడవ దశ దాటిన తర్వాత దారితప్పింది. దీనిపై అధ్యయనం చేస్తున్నాం.

- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్




## మన ఆయుర్దాయం ఎంత?

మనిషి ఎంతకాలం జీవిస్తాడు?వంద సంవత్సరాలను సంపూర్ణ ఆయుష్షుగా పేర్కొంటారు. మారుతున్న పరిస్థితుల్లో 60, 70 సంవత్సరాలు జీవించడమే గగనంగా మారుతున్నది. ఇప్పటివరకూ అత్యధిక కాలం బతికిన వ్యక్తిగా ఫ్రాన్స్‌కు చెందిన జేమ్స్ కాల్మెంట్ (1875–1997)ను పేర్కొంటారు. అతను 122 సంవత్సరాలు బతికినట్టు చెప్తారు. అయితే, అధికారిక ధ్రువీకరణ లేదు. రికార్డు చేసిన గణాంకాలను అనుసరించి, జపాన్‌కు చెందిన జిరోమోన్ కిమురా (1897–2013) 116 సంవత్సరాల 54 రోజులు జీవించాడు. ఇప్పటివరకూ ఇదే ప్రపంచ రికార్డు.



అయితే, మనిషి 150 సంవత్సరాలు జీవించే అవకాశం ఉందని తాజా శాస్త్రీయ పరిశోధనలు పేర్కొంటున్నాయి. మనిషి త్వరగా చనిపోవడానికి గుండె జబ్బులు లేదా కేన్సర్ వంటి భయంకర వ్యాధుల కంటే, నిత్య జీవితంలో వచ్చే చిన్నచిన్న ఒత్తిళ్లను కూడా ఎదుర్కోలేకపోవడం, తిరిగి సంపూర్ణ స్థితికి చేరుకునే సామర్థ్యం తగ్గిపోవడం ప్రధాన కారణాలని శాస్త్రవేత్తలు అంటున్నారు. దీనినే శరీర సహజ ప్రతిస్పందన సామర్థ్యం లేదా శరీర దృఢత్వం అంటారు. మన వయసు పెరిగేకొద్దీ, జలుబు, చిన్న గాయా లు, లేదా రోజువారీ అలసట వంటి సాధారణ సమస్యల నుంచి కోలుకునే శక్తి తగ్గిపోతుంది. ప్రతిసారీ శరీరం పూర్తిగా కోలుకోలేకపోవడంతో, కొద్ది గా శక్తి లేదా ఆరోగ్యం తగ్గుతుంది. ఈ చిన్న నష్టాలు సంవత్సరాల కొలది పేరుకుపోతూ, చివరికి పెద్ద స్థాయిలో శరీర దృఢత్వాన్ని తగ్గిస్తాయి. అమెరికా, బ్రిటన్, రష్యా దేశాల ప్రజలపై జరిగిన పెద్ద పరిశోధనల్లో రక్తంలోని కణాల సంఖ్య, శారీరక చురుకుదనం వంటి అంశాలను గమనించి విశ్లేషించారు. పెద్ద వ్యాధులు లేకున్నప్పటికీ, ఈ శారీరక విధులు వయసుతో పాటు క్రమంగా క్షీణిస్తున్నాయని ఈ పరిశోధనల్లో స్పష్టమైంది. అయితే ఇది సున్నితంగా క్రమపద్ధతిలో తగ్గడం కాకుండా, పలు దశల్లో ఆకస్మికంగా దిగజారడాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. అంటే, ఒక దశలో వచ్చిన దెబ్బనుంచి శరీరం ఇక పూర్తిస్థాయిలో తిరిగి రాలేకపోతున్నది. ఈ దృఢ త్వ క్షీణతే మనిషి జీవితానికి సహజ పరిమితిని నిర్ణయిస్తుంది. శాస్త్రవేత్తల ప్రకారం, ఆ పరిమితి 120 నుండి 150 సంవత్సరాల లోపే ఉంటుంది. అంటే మనం ఆరోగ్యంగా, దీర్ఘకాలం జీవించేందుకు ప్రయత్నించవచ్చు. గానీ, మన జీవక్రమంలోని సహజ జీవశాస్త్ర పరిమితిని పూర్తిగా అధిగమించడం సాధ్యమయ్యే సూచన ప్రస్తుతం లేదు.

## మెరిసిపోతున్న శనిగ్రహం



జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ తీసిన శనిగ్రహం ఫొటో ఇది. ఈ గ్రహంతో పాటు, దాని చుట్టూ ఉన్న వలయాలు కూడా బంగారం రంగులో మెరిసిపోతూ అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నా యి. ఈ వలయాలు చాలా మంది ఊహించిన విధంగా దృఢమైనవిగా కాకుండా, చిన్నగానూ, బంగారు ఆభరణాలుగానూ కనిపిస్తున్నాయి. వాటిలోని ప్రతి భాగం, రాళ్ల తునకల ముద్ద. అందుకే శని గ్రహం ఎక్కువగా బంగారు రంగులోనూ, కొన్ని సందర్భాల్లో నీలం రంగులోనూ కనిపిస్తాయి. ఈ ఫొటోను నైర్ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో తీయడంవల్ల శని గ్రహం మొస్తరు చీకటి రంగులో, వలయాల వెలుగుల్లో కనువిందు చేస్తున్నది. సాధారణంగా మీథేన్ వాయువు వెలుతురును గ్రహించి, బయటకు కనిపించనియ్యదు. కాబట్టి, శని గ్రహం సరికొత్త రంగుల్లో దర్శనమిస్తున్నది. ఈ గ్రహానికి ఉన్న డయోన్, ఎన్‌సెలడస్, టెదిస్ ఉపగ్రహాలు కూడా ఫొటోలో కనిపించాయి. శని వలయాల వయస్సు కేవలం కొన్ని కోట్ల సంవత్సరాలు మాత్రమేగానీ, ఆకాశగంగలోనూ అత్యంత ప్రత్యేకమైన దృశ్యాన్ని అందిస్తున్నది.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇంధనం



ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్యానికి ప్రధాన కారణమైన ప్లాస్టిక్‌ను నియంత్రించడానికి శాస్త్రవేత్తలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా, చైనా, జర్మనీ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా ఇంధనంగా మార్చే విప్లవాత్మక పద్ధతిని అభివృద్ధి చేశారు. 'సైన్స్' పత్రికలో ప్రచురించిన నివేదికను అనుసరించి, ప్లాస్టిక్‌ను కరిగించడానికి అనుసరించే అత్యంత వేడి ఈ కొత్త విధానంలో అవసరం ఉండదు. ఈ ప్రక్రియ సుమారు 30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలోనూ నిర్వహించవచ్చు. ఒకేసారి దాదాపు 99% వరకు ప్లాస్టిక్‌ను గ్యాసలిన్ రేంజ్ హైడ్రోకార్బన్లుగా మార్చేస్తుంది. సాధారణంగా రీసైకిల్ చేయడం కష్టమైపోయే పివిసి వంటి ప్లాస్టిక్ రకాలు కూడా ఈ ప్రక్రియలో ఇంధనంగా మారుతాయి. ప్రపంచంలో ప్రతి సంవత్సరం 400 మిలియన్ టన్నులకుపైగా ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోందని అంచనా. ఇందులో ఒక భాగం మాత్రమే రీసైకిల్ అవుతుంది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# తెలుగువారి పెరియార్... త్రిపురనేని రామస్వామి



డాక్టర్ దేవరాజు మహారాజు

మలమల మాడు పొట్ట, తెగ మాసిన బట్ట
కలంత పెట్టగా విలవిల ఏడ్చుచున్న
నిరుపేదకు జాలిని
జూపకుండ నుత్తల పడిపోయి,
జీవ రహితంబగు బొమ్మకు
నిండ్లు, వాకిళుల్ పొలమును
బొట్ట నిచ్చెడి ప్రబుద్ధుల నిచ్చమెచ్చెదన్.

తిండి, గుడ్డ, నీడ లేని నిరుపేదలను అశ్రద్ధ చేసి, జీవంలేని బొమ్మలకు ఇళ్ళు, వాకిళ్ళు, పొలమూ, పుట్రా సమకూర్చి, పెండ్లి గిండ్లీ చేసే ప్రబుద్ధులను కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి (15 జనవరి 1887–16 జనవరి 1943) తీవ్రంగా నిరసించారు. తమిళులకు పెరియార్ రామసామి నాయకర్ ఉన్నట్లే, మన తెలుగువారికీ ఒక రామస్వామి ఉన్నారు. ఆయన నాయకర్‌ను వదిలేసినట్టే, ఈయన చౌదరిని వదిలేశారు. ఇద్దరూ ఉన్నత శ్రేణి హేతువాదులు. మానవీయ విలువల్ని నిలుపడానికి ఈ ఇద్దరూ జీవితాంతం కృషి చేశారు. త్రిపురనేని రామస్వామి జయంతి, వర్ధంతులు ప్రతి సంవత్సరం ఒక్కరోజు తేడాతో వస్తాయి. ఆయనను స్మరించుకుని, ఆయన ఆశయాల్ని నిలబెట్టడానికి మనం నిరంతరం కృషి చేయాలి. మన ముందు తరాల వారిని అందుకు సిద్ధం చేయాలి!

తెలుగు సాహిత్యరంగంలో కవి రాజుది, ఆయన కుమారుడైన గోపీచంద్ ది గణనీయమైన స్థానం. 1987లో కవిరాజు శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం తపాలా బిళ్ల విడుదల చేయగా 24 ఏళ్ళ తర్వాత ఆయన కుమారుడు గోపీచంద్ శతజయంతి సందర్భంగా 2011లో మరో తపాలా బిళ్ళ విడుదల చేసింది. భారత ప్రభుత్వం ఇలా ఉన్నత శ్రేణి రచయితలైన తండ్రీ కొడుకుల స్మృతిలో తపాలాబిళ్ళలు విడుదల చేయడం చాలా అరుదైన విషయం. ఈ తండ్రీ కొడుకు లిద్దరూ హేతువాదులే! హైదరాబాదు టాంక్‌బండ్ మీదున్న తెలుగు వెలుగుల విగ్రహాలలో కవిరాజు రామస్వామి విగ్రహమూ ఉంది. నేటి యువతీయువకులు అటు వెళ్ళినప్పుడు తప్పకుండా చూడాలి. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం త్రిపురనేని రామస్వామి స్మారకార్థం ప్రతి ఏటా ఒక పురస్కారం అందిస్తోంది.


ఒకరుడు 'వేదమే' భగవదుక్తమటంచు నుపన్యసించు
నింకొకరుడు 'బైబిలే' భగవదుక్తమటంచును వక్కణించు
వేరొకండు మా 'ఖొరాన్' భగవదుక్తమటంచును వాదులాడు,
నీ తికమకలేల పెట్టెదవు తెల్పగ రాదె నిజంబు నీశ్వరా!

నిజము తెల్పమని ఇక్కడ ఈశ్వరుణ్ణి కవి అడుగుతున్నాడంటే – ఆయన ఉనికిని గుర్తిస్తున్నట్టు కాదు. ఇది ఒక వ్యంగ్య వ్యాఖ్య. లేని దేవుణ్ణి జనం మీద రుద్ది ఏ మహిమా లేని పవిత్ర గ్రంథాల ప్రసక్తి తెచ్చి పబ్బం గడుపుకుంటున్న వారిని హేళన చేయడం ఇందులో ఉంది. ఇతర రంగాలలో ప్రముఖులయినా సరే, కొందరు దేవుడి విషయానికి వచ్చేసరికి గోడ మీది పిల్లి వాటంగా వ్యవహరిస్తుంటారు. అలాంటి చర్యకు రామస్వామి స్వస్తి చెప్పారు. ధైర్యంగా తన హేతువాద దృక్పథాన్ని తన జీవితంలో పాటించి చూపారు. అదే, తన సాహిత్యంలోనూ నమోదు చేశారు. అందుకే తెలుగు సమాజానికి ఓ సూత పురాణం, ఓ శంభుక వధ, ఓ ఖూనీ, ఓ ధూర్త మానవా శతకం, కొన్ని సూతాశ్రమ గీతాలు దక్కాయి. ఈ పుస్తకాల్ని నేటి యువతీ యువకులు వెతుక్కుని చదవాలి. వాటి స్ఫూర్తితో సమకాలీన సమాజాన్ని హేతువాద, మానవవాద ఆలోచనా ధోరణిలోకి నడిపించాలి.

త్రిపురనేని రామస్వామి 15 జనవరి 1887న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామంలో ఒక సంపన్న రైతు కుటుంబంలో పుట్టారు. తల్లిదండ్రులు రామమాంబ, చలమయ్య. అప్పట్లో బాల్య వివాహాలు జరిగేవి కాబట్టి 1898లో పున్నమ్మ అనే బాలికతో పెద్దలు వివాహం జరిపించారు. అప్పటికి ఆయన వయసు పదకొండు. 1910లో ఆయనకు 23వ యేట కుమారుడు గోపీచంద్ పుట్టాడు. మరోవైపు ఆయన మెట్రిక్యులేషన్ కూడా పాసయ్యాడు. ఆ రోజుల్లో చదువులు అలా ఆలస్యంగానే జరిగేవి. మెట్రిక్ తర్వాత అదే 23వ యేట యవ్వనదశలో ఎన్నో రచనలు సమాజం మీదికి సంధించారు. పల్నాటి యుద్ధం ఆధారంగా 'కారెంపూడి కదనం' రాశారు. మహాభారత యుద్ధం ఆధారంగా 'కురుక్షేత్ర సంగ్రామం'రాశారు. అయితే, చిత్ర మేమంటే ఈ రచనలో ఆయన పాండవులకు రాజ్యాధికారం లేదని నిరూపించి ఒప్పించారు. కారెంపూడి కదనం, కురుక్షేత్ర సంగ్రామం రెండూ నాటికలే – ఇక కవిరాజు ఇతర రచనలు : పల్నాటి పౌరుషం, గోపాల రాయ శతకం, కొండవీటి పతనం, రాణా ప్రతాప్, భగవద్గీత మొదలైనవి. భగవద్గీత రచన భగవద్గీతను సమర్థిస్తూ రాసింది కాదు. విమర్శిస్తూ వెలువరించిన ఒక వ్యంగ్య రచన. అలాగే, రాణా ప్రతాప్ రచన విషయంలో ఒక విచిత్రం జరిగింది. అది అచ్చులో ఉండగానే అందులోని విషయం ఎలా బయటికి చేరిందో, అది నాటి ప్రభుత్వ దృష్టికి ఎలా వెళ్ళిందో తెలియదు. కానీ, ఆ రచన అచ్చవుతూ ఉండగా ప్రెస్‌లోనే నాటి బ్రిటీష్ ప్రభుత్వ నిషేధానికి గురైంది.

1911లో బందరు నోబెల్ కాలేజిలో ఇంటర్మీడియట్ చదివారు. అప్పుడే చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి శిష్యరికం చేసి మొదట అష్టావధానం, తరువాత శతావధానం చేయగలిగారు. ఆ వయసులో అంతటి ధారణాశక్తిని, సాహిత్యం మీద సాధికారతను సాధించటం మామూలు విషయం కాదు. అయితే చదువు పూర్తి చేసి ఏదో ఒక వృత్తిలో స్థిరపడాల్సి ఉంది గనుక, అవధానాలు మానేసి న్యాయశాస్త్రం చదవడానికి 1913లో బొంబాయి వెళ్ళారు. ఏదో కారణం వల్ల వెంటనే తిరిగొచ్చారు.

1914లో ఐర్లాండ్‌లోని డబ్లిన్ యూనివర్శిటీకి వెళ్ళి అక్కడ న్యాయశాస్త్రం చదివారు. దానితో పాటు ఆంగ్ల సాహిత్యాన్నీ చదివారు. అయితే



అక్కడ కూడా ఆయన పంచెకట్టుతోనే గడిపేవారు. 'ఏ దేశంలో ఉంటే ఆ దుస్తులే వేసుకోవాలి గానీ ఇదేమిట'ని అక్కడ బ్రిటీష్ మహిళ హేళన చేసింది. అయితే ఆయన ఖాతరు చేయలేదు. తన తెలుగుతనాన్ని, పంచెనూ వదులుకోలేదు. ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయమేమంటే, ఆయన డబ్లిన్‌లో ఉన్నా – ఆయన మనసు ఇక్కడ తెలుగు నేలమీదే ఉండేది. డబ్లిన్ నుంచి ఇక్కడి కృష్ణా పత్రికకు వ్యాసాలు రాసేవారు. అంతే కాదు 'శంభుక వధ' అనే ప్రసిద్ధ రచన ఆయన డబ్లిన్‌లో ఉండగా రాసిందే ! అనిబిసెంట్ చేస్తున్న హోంరూల్ ఉద్యమానికి మద్దతుగా రాశారు. మద్దతివ్వండని ఇక్కడ ప్రజల్ని ప్రోత్సహించారు. అక్కడి నుండే ఎన్నో దేశభక్తి గీతాలు అందించారు. ఆ రకంగా హేతువాదం, మానవ వాదం తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టినవాడిగా కవిరాజు త్రిపురనేనికి గుర్తింపు వచ్చింది.

డబ్లిన్ నుంచి తిరిగి వచ్చి త్రిపురనేని 1917లో తొలుత మచిలీపట్నంలో న్యాయవాదిగా నాలుగైదేళ్ళు ప్రాక్టీసు చేశారు. 1922లో అక్కడి నుండి తెనాలికి మారి, న్యాయవాదిగా అక్కడ స్థిరపడ్డారు. వృత్తితో పాటు, సామాజిక అన్యాయాల్ని, మత అరాచకాల్ని ఎదిరించే తన ప్రవృత్తిని మేల్కొల్పారు. రాజా రామ్మోహన్‌రాయ్, రానడే, కందుకూరి, గురజాడ వంటి వారి ఆదర్శాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేవారు. ఇలాంటి సంఘ సంస్కరణ కార్యక్రమాల వల్ల ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. ఫలితంగా 1925లో తెనాలి పురపాలక సంఘానికి జస్టిస్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు. అయితే ఆయన సంస్కరణ వాదం ఆయన పదవికి ముప్పు తెచ్చింది. పురపాలక సంఘ అధ్యక్షునిగా జంతు బలుల్ని నిషేధిస్తే – అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయనను పదవి నుండి దింపేశారు. త్రిపురనేని వారు కంగారుపడలేదు. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్ళీ ఘనవిజయం సాధించి పదవి చేజిక్కించుకున్నారు. జంతుబలుల్ని మళ్ళీ నిషేధించారు. అంతే ప్రత్యర్థులు దిక్కుతోచక తోక ముడిచారు. ఈ సంఘటనతో మనకు నిరీశ్వరవాది, బ్రిటీష్ పార్లమెంట్ మెంబర్ ఛార్లెస్ బ్రాడ్లా (1833–1891) విషయం గుర్తుకొస్తుంది. ఆయన దేవుడి మీద ప్రమాణం చేయనని అన్నందుకు, ఆత్మసాక్షిగా మాత్రమే చేస్తానన్నందుకు వేధించి, వేధించి డిస్మిస్ చేశారు. అయినా ఆయనే మళ్ళీ ఎన్నికై వచ్చారు. చివరకు ఆనాటి బ్రిటీష్ పార్లమెంట్ వ్యవస్థే దిగొచ్చింది. ఎవరి ఇష్టప్రకారం వారు ప్రమాణ స్వీకారం చెయ్యొచ్చని 1888లో బిల్లు పాస్ చేసుకుంది.

సంఘ సంస్కర్తగా కృషి చేస్తూ వచ్చిన కవిరాజు తను నివాసమున్న ఇంటికి 'సూతాశ్రమం' – అని పేరు పెట్టుకున్నారు. వేదాలు, పురాణాలు ఎంత నీతిబాహ్యంగా ఉన్నాయో చెప్పడానికి తన ఆత్మీయ మిత్రుడు కుప్పుస్వామి పేరుతో 'కుప్పుస్వామి శతకం' (1930) రాశారు. ''పరుల నీ ముందు దిట్టెటివాడు నిన్ను / నొరిని ముందు దిట్టక యుండ బోడు / చనువు రవ్వంత వానికి ఒసంగరాదు / ముప్పు ఒచ్చున్ దప్పక దాన గుప్పుస్వామి'' నీ ముందు వేరే వాళ్ళను తిట్టేవాడు, వేరే వాళ్ళ ముందు నిన్ను తిట్టడని నమ్మకమేమిటీ? అలాంటి వాడికి ఏ మాత్రమూ చనువు ఇవ్వగూడదని హెచ్చరిస్తూ చెప్పిన పద్యం ఇది. మరోవైపు అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ, మంత్రాలు లేని పెళ్ళి విధానానికి సరళమైన తెలుగులో ఒప్పందాలు – ప్రమాణాలతో ఒక పెళ్ళి విధానం (వివాహ విధి 1930) రూపొందించారు. దాని ప్రకారం ఎన్నో కులాంతర వివాహాలు జరిపించారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆయన పురపాలక సంఘ అధ్యక్షుడిగా నిరాఘాటంగా 13 ఏళ్ళు నిలదొక్కుకున్నారు. ప్రజాభిమానం ఎంతగా పెరిగిపోయిందంటే, 1940లో గుడివాడలో ఆయనతో గజారోహణం చేయించి, ఘనంగా సన్మానించుకున్నారు. ఆ రోజుల్లోనే ఆంధ్రమహాసభ 'కవిరాజు' బిరుదునిచ్చి గౌరవించుకుంది. 1941లో ప్రఖ్యాత మానవవాది ఎం.ఎన్.రాయ్ తెనాలిలోని వీరి సూతాశ్రమాన్ని సందర్శించారు. కవిరాజు ఖ్యాతి దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించిందనడానికి ఇదొక మంచి ఉదాహరణ.ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మూడుసార్లు సెనెట్ మెంబరయ్యారు.

వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ
పూసి పోదుము మెడను వైతుము పూలదండలు భక్తితో –

అనే ప్రసిద్ధ గీతం అందరికీ తెలిసిందే. అది కవిరాజు త్రిపురనేని రామస్వామి రచనే. ఒక స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన బ్రిటీష్ పాలకు లపైకి తన జీవితాంతం అక్షర తూటాలను సంధిస్తూ వచ్చారు. కేవలం 56 ఏళ్ళు జీవించిన వీరు, ఎన్ని రంగాలలో ఎంతెంత కృషి చేస్తూ కూడా ఒక హేతువాదిగా, ఒక మానవవాదిగా అజేయంగా నిలబడడం సామాన్యమైన విషయం కాదు. అందువల్ల ఆయన రాసిన ఆ ప్రసిద్ధ గీతంలోని వీరుడెవరో కాదు. నిస్సందేహంగా ఆయనే! అందువల్ల కవిరాజు త్రిపురనేని రామస్వామి అందించిన స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ మనం ముందుకు సాగాల్సి ఉంది!

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

# తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపం జాతరలు

తెలంగాణ పల్లె పల్లెలో జాతరలు జరుగుతున్నాయి. వాటిలో కొన్ని మాత్రమే ప్రముఖంగా కనిపిస్తాయి. సమ్మక్క సారలమ్మ జాతర అనేది ములుగు జిల్లా, తాడ్వాయి మండలానికి చెందిన మేడారం గ్రామంలో జరిగే ఒక గిరిజన జాతర.ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఈ జాతర తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. భారతదేశంలో కుంభమేళా తరువాత అత్యధికులు హాజరయ్యే పండుగ ఇదే. వివిధ రాష్ట్రాల నుంచి పదికోట్ల మందికి పైగా హాజరు అవుతారని అంచనా.ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర జరుగుతుంది. సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారీ సమ్మక్కసారక్క. 'దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతర'గా గణతికెక్కిన మేడారం జాతర గిరిజన సాంప్రదాయ రీతుల్లో జరుగుతుంది. మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌గఢ్, జార్ఖండ రాష్ట్రాల నుండి కూడా భక్తులు తండోపతండాలుగా వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

### నాగోబా జాతర

యేటా పుష్యమాసము అమావాస్య రోజున జాతర ప్రారంభ మవుతుంది. సర్పజాతిని పూజించడమే ఈ జాతర ప్రత్యేకత. పుష్యమాసము అమావాస్య రోజున తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేషనారాయణ మూర్తి) పురివిప్పి నాట్యమాడుతాడని గిరిజనుల నమ్మకం. అమావాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడని, వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్యమవుతాడని గిరిజనులు విశ్వసిస్తారు.ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా గోండుల దేవుడు. నాగోబా దేవాలయం ఆదిలాబాద్ కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది.కెస్లాపూర్‌లో జరిగే ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కెస్లాపూర్ జనాభా 400 కు మించదు. కాని పండగనాడు లక్షలాది మందితో అది జనారణ్యంగా మారుతుంది.

నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకుని గోదావరి ప్రయాణం కాగా, ఒక చోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుంపూరైంది. ఆ తర్వాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్టలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చుకో అనగా గౌరి సంప్రదాయాలను లెక్కచేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తర్వాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతని కోసం వెతికిన గౌరి గోదావరి లో సత్యవసి గుండంలో కలిసిపోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తర్వాత పెళ్లి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (భేటి కోరియాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారిపోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తా యి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్క, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గల వారంతా మేస్రం వంశంలో వస్తారు. నాగోబా జాతర ప్రపంచంలోని అతి పెద్ద గిరిజన జాతర.

కోడిపందేలు, జూదం, పేకాట, అశ్లీల నృత్యా లు హోరెత్తించే పందెం రాయుళ్లకు, బెట్టింగ్ బంగారాజులకు, అల్ట్రా కల్చర్ కు భిన్నంగా తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటి చెప్పే విధంగా జాతరలు జరుగుతున్నాయి.

### ప్రధాన జాతరలు

సమ్మక్క సారక్క జాతర (మేడారం, జయశంకర్ భూపాల్ పల్లి), ఏడు పాయల జాతర (మెదక్ జిల్లా), గొల్ల గట్టు జాతర (సూర్యాపేట జిల్లా), కొండగట్టు జాతర (జగిత్యాల జిల్లా), కొమరవెల్లి మల్లన్న జాతర(సిద్ధిపేట జిల్లా) , నాగోబా జాతర (ఆదిలాబాద్ జిల్లా), ఐనవోలు మల్లన్న జాతర (మైలారం దేవుడు) (వరంగల్ రూరల్ జిల్లా)భీమన్న జాతర (జగిత్యాల జిల్లా) బెజ్జంకి జాతర (సిద్ధిపేట జిల్లా)వేలాల జాతర (కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా), తేగడ జాతర (భద్రాది కొత్తగూడెం జిల్లా)మేళ్లచెరువు జాతర (సూర్యాపేట జిల్లా), సిద్దులగుట్ట జాతర (నిజామాబాద్ జిల్లా), నల్ల కొండ జాతర (జగిత్యాల జిల్లా), మహంకాళి జాతర (సికింద్రాబాద్), పెద్దమ్మ జాతర (హైదరాబాద్)మన్నెంకొండ జాతర (మహబూబ్ నగర్ జిల్లా), రంగాపూర్ జాతర (నాగర్ కర్నూలు జిల్లా), సిరిసనగండ్ల (నాగర్ కర్నూలు జిల్లా)కొరివి జాతర (మహబూబాబాద్ జిల్లా), తుల్జాభవాని జాతర (నల్గొండ జిల్లా), కురుమూర్తి జాతర (మహబూబ్ నగర్ జిల్లా)గద్వాల్ జాతర (జోగులాంబ గద్వాల జిల్లా)చేవెళ్ల జాతర (రంగారెడ్డి జిల్లా) జోగి నాథుని జాతర (సంగారెడ్డి జిల్లా), కేతకి సంగమేశ్వర స్వామి జాతర (సంగారెడ్డి జిల్లా), ప్రతాపరుద్ర సింగరాయ జాతర (సిద్ధిపేట జిల్లా), చిత్తరమ్మ జాతర (హైదరాబాద్) కొమ్మాల జాతర (వరంగల్ రూరల్ జిల్లా), అయక్ లేదా భీమన్న జాతర (ఆదిలాబాద్ జిల్లా). తెలంగాణ రాష్ట్రంలోని జాతరలన్ని జానపదుల జీవన విధానానికి, విశ్వాసాలకు, ధార్మిక జీవనానికి అద్దం పడుతాయి.

డా. వెన్నెల గద్దర్, చైర్ పర్సన్,
తెలంగాణ సాంస్కృతిక సారథి



## న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం

**ప్రజాపక్షం/చర్లపలి:** ప్రజల్లో చైతన్యం వస్తేనే ఆడపిల్లల పరిరక్షణ సాధ్యమవుతుందని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ వెంకటరమణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ,మల్కాజ్‌గిరి జడ్జి బాలభాస్కర్ రావు ఆదేశాల మేరకు శనివారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కుషాయిగూడ సాయి సుధీర్ విద్య సంస్థలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు.విద్యార్థులకు బాల్య వివాహాల నిరోధక చట్టం,వరకట్న నిషేధ చట్టం, రాష్ట్ర ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, గౌరిత, సమాధుల్లాహ్, కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మీరారాణి, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ మైనార్టీ స్కూల్‌లో**




బాలికల సాధికారత ద్వారానే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని సిసిఎంబి చీఫ్ సైంటిస్ట్ (రిటైర్డ్) డాక్టర్ వి రాధ, పాఠశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. కుషాయిగూడలోని తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ కుత్బుల్లాపూర్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలకు విద్య,శాస్త్ర విజ్ఞానం, పరిశోధనా రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమత కమిటీ కన్వీనర్ జెన్నీ, నాయకులు ప్రభాకర్, మహమ్మద్ హుస్సేన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ గండి మైసమ్మ మండల రెవెన్యూ పరిధిలోని బోరంపేట్, గాగిలాపూర్ ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను దుండిగల్ గండి మైసమ్మ ఎమ్మార్వో ఎన్.రాజేశ్వర్ రెడ్డి ఆదేశానుసారంగా ఆర్ఐ రవి కుమార్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. ఆక్రమణదారులు కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ అధికారులు రూములను, బేస్మెంట్లను జెసిబి తో నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోమని వాటిని తొలగిస్తామని తెలిపారు.



## ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తా

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. పాత నేరేడ్‌మెట్ బొడ్రాయి అమ్మవారి ఆలయం నిర్మించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతల కృపతో ప్రజలకు సుఖ సంతోషాలు, సమృద్ధి కలగాలని ఆంకాక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు పరశురాంరెడ్డి, అరుణ్, తేజ, వెంకన్న సాయి గౌడ్, ఉమేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** యాప్రాల్ సాయి కృపకాలనీలో రూ.16 లక్షలు, శ్రీ క్రిష్ ఎన్‌క్లేవ్‌లో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. చిరకాలం నుండి పెండింగ్‌లో ఉన్న ఈ పనులు ఎట్టకేలకు చేపట్టినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, సత్యనారాయణ, ఉదయ్, శర్మ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.




## 'డబుల్ ఫ్లాట్ల'లో సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** జిహెచ్ఎంసిలోని డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిగ్నిటీ హౌసింగ్ కాలనీ టూ బిహెచ్‌కె జెఎసి రాష్ట్ర అధ్యక్షులు శైలేష్ సందీప్ రాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా జేఏసీ మాట్లాడుతూ.. ఒక ఏడాది పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏఎంసి ( వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ ), తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. ప్రతి ఇంటికి గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణాలలో పగుళ్ల మరమ్మతులు, మురుగునీటి పారుదల వంటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెఎసి ఉపాధ్యక్షుడు విజయ్ బండారి, కార్యదర్శి శివ, జైపాల్, కోశాధికారి శ్రీనివాస్ చారి, సభ్యులు నీలిమ, లక్ష్మీ దేవి, జహంగీర్ పాషా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే విద్యా విప్లవానికి కీలకం

### విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితారాణా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉపాధ్యాయులే విద్యా విప్లవానికి కేంద్రమని విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితారాణా అన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీపై విస్తృత రాష్ట్రస్థాయి ప్యానెల్ చర్చను టిశాట్ ద్వారా శనివారం ప్రత్యక్ష ప్రసారంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్.యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డాక్టర్. నవీన్ నికోలస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి డా.యోగితారాణా మాట్లాడుతూ ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ మన మూడు సంవత్సరాల విద్యా కృషికి ప్రతిబింబం. ఇది ఒక పరీక్ష కాదు – విద్యార్థి సామర్థ్యాల వికాసానికి దారి చూపే మార్గదర్శకం అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ మార్గదర్శకాలు, అసెస్మెంట్ విధానాలపై సంపూర్ణ అవగాహన కలిగి, కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ప్రారంభ దశ విద్యలో ఫోనిక్స్ సౌండ్స్ ఆధారంగా పదాలు చదివే నైపుణ్యం ఉపాధ్యాయులకు అత్యంత కీలకమని, విద్యార్థుల అభ్యాస స్థాయిని గుర్తించేందుకు మాక్ టెస్టులు, టీచర్ సపోర్టెడ్ గ్రూపులు, పీర్ గ్రూపుల ద్వారా రెమిడియల్ బోధన నిర్వహించాల్సిన అవసరం ఉందని వివరించారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డా.నవీన్ నికోలస్ మాట్లాడుతూ, 5+1 విధానంలో ఐదు రోజుల బోధన అనంతరం ఆరో రోజున వర్క్‌బుక్స్ ద్వారా విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేయడం ద్వారా ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను బలోపేతం చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ఐటెం బ్యాంక్‌ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు అకాడమిక్ నాయకులుగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని, తెలంగాణను దేశంలో అగ్ర స్థానంలో నిలిపేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

ఈ చర్చలో ఖమ్మం జిల్లా చింతకాని మండల విద్యాధికారి ఎస్.రామారావు, మునగాల మండల విద్యాధికారి పి.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శైలకుమారి, అశ్వరావుపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత తమ అనుభవాలను పంచుకున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### కుషాయిగూడ ఏసిపి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని కుషాయిగూడ ఏసిపి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రేటర్ హైద్రాబాద్ శామీర్‌పేట డివిజన్‌లోని కట్టమైసమ్మ ఆలయం వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు, వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై కుషాయిగూడ ఏసిపి వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహ నాలు నడిపే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతి వేగం, మద్యం సేవించి, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని చెప్పారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీటు బెల్ట్ విధిగా ధరించాలని, అతి వేగంగా వాహనాలు నడపకూడదని అన్నా రు. పరిమితికి మించి వ్యక్తులు ప్రయాణించకూడదని, వాహనాలకు సంబంధించిన పేపర్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం పోలీసులు డ్రైవర్లుతో, వాహనదారులతో రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్ఐ సోమిరెడ్డి, కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మేకల మహేందర్‌యాదవ్, స్థానికులు, యువకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



## సొంత ఖర్చులతో బోర్ మరమ్మతులు

**ప్రజాపక్షం/నాగారం:** ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి విద్యార్థుల దాహార్తిని తీర్చారు. జిహెచ్ఎంసి 5వ డివిజన్ నాగారం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజుల నుండి మోటర్ బోర్ చెడిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం చంద్రారెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన స్కూల్ వద్ద కు వచ్చి బోర్‌ను పరిశీలించి మోటర్‌కు తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. అదే విధంగా స్కూల్ గ్రంథాలయం పైకప్పు నీటి తడితో పెచ్చులు ఊడిపోతోందని చంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన మరమ్మతులు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో స్కూల్ సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవీందర్‌రెడ్డి, జ్యోతిపాండే, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** రాజకీయాలకు అతీతంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధి దారులకు అందజేయడం జరుగుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, తాండూరు, బషీరాబాద్, తాండూరు పట్టణానికి సుమారు 200మంది లబ్ధి దారులకు రూ. 75లక్షల విలువ గల చెక్కు లను శనివారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అందజేశారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధ పడుతున్న లబ్ధి దారులకు సిఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. నిరుపేదలను ఆదుకోవడం కోసం సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రావుఫ్, మహిపాల్‌రెడ్డి, లోంక నర్సింహులు, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, మహిళ నాయకురాలు శోభరాణి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళ లకు పెద్దపీట**

**పెద్దేముల్:** కోటిమంది మహిళ లను కోటీశ్వరులుగా చేయాలన్న ముఖ్య లక్ష్యంతో సిఎం రేవంత్‌రెడ్డి తక్కువ వడ్డీకి రుణాలను అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్ మండల పరిధి గొట్లపల్లి, బండపల్లి గ్రామాలలో నూతన పంచాయతీ భవనాల ప్రారంభోత్సవం, గొట్లపల్లి గ్రామంలో డ్వాక్రా భవన నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలను తీసుకవచ్చినా మహిళలకు అందజేస్తున్నారని అన్నారు.

మహిళలు ముందుకు వస్తే 90సబ్సిడితో సోలార్ యూనిట్ల సిస్టంను సైతం అందస్తుందన్నారు. నూతన సర్పంచ్‌లు గెలిచిన నెలలోపు నియోజ కవర్గంలోని గ్రామాలకు నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు అందచేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదలకు రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామాలలో మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గొట్లపల్లి గ్రామ ప్రజలు అడిగినట్లు ప్రతి ఒక్క హామీ విడుతల వారిగా నెరవేరుస్తానని హామీచ్చారు.

## నిర్దేశం ఎంచుకుని ఇష్టంగా విద్య అభ్యసించాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/పరిగి :** విద్యను ఇష్టంగా చదవడంతో పాటు ఒక నిర్దేశాన్ని ఎంచుకొని విద్యాను అభ్యసించాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. పరిగి మండలం తుంకులగడ్డలోని గిరిజన గురుకుల బాలకల కళాశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ వికారాబాద్ జిల్లా , మహిళా సాధికారత కేంద్రం 'బేటీ బచావో బేటీ పడావో' ఆధ్వర్యం లో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుకున్న కళాశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. మన కళ ఎప్పుడు గొప్పగా ఉండాలని అదేవిధంగా ఆత్మవిశ్వాసం నమ్మకంతో ముందుకు సాగాలని ఆయన తెలిపారు. విద్యార్థులు మంచి ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థినిలు తమ ఆత్మరక్షణకై కరాటే నేర్చుకొని ప్రదర్శించడం అభినందనీయమని కలెక్టర్ కొనియడారు. బాలికల మనుగడ, రక్షణ అభివృద్ధి భాగస్వామ్యంపై ఉపాధ్యాయులు, విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఆడపిల్లను రక్షిద్దాం ఆడపిల్లను చదివిద్దాం' అన్న నినాదంతో అందరూ ముందుకెళ్లాలన్నారు. లింగ నిష్పత్తి సమానంగా ఉంటేనే సమాజం ముందుకెళుతుందని అన్నారు. విద్యార్థినిలు ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను ఉపయోగించుకొని ఉన్నతంగా చదువుకొని అన్ని రంగాల్లో జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జాతీయస్థాయిలో ముందుండాలని కోరారు. జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ అమ్మాయిలు మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అన్నింటినీ ఎదుర్కొని అన్నిరంగాల్లో ముందుండాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుజాత,కాంతరావు, శ్రీకాంత్ భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి**

వికారాబాద్ : జిల్లాలో ఇప్పటికే మంజూరై వివిధ దశల్లో పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ సంబంధిత అధికారుల కు కలెక్టర్ ప్రతీక్‌జైన్ కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో మండల ఎంపిడిఒలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనం, గ్రామసంఘం భవనాలు, మండల సమాఖ్య భవనాలు, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్, వర్క్ షెడ్స్ నిర్మాణ పనులు ఏవైతే ముందే ప్రారంభించి పూర్తి కాని పనులు సత్వర మే పూర్తిచేసి ఎఫ్‌టిఒ జనరేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. పనులు మంజూరైన నిర్మాణ పనులను ప్రతిరోజు టార్గెట్ పెట్టుకొని నాణ్యతతో పూర్తిచేసిన పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సంఘం స్థాయిలో స్వయం సహాయక సంఘాల ద్వారా డబ్బును దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బందిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ సుధీర్, డిపిఆర్ఓ శ్రీనివాస్, ఉమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ కళలను భావితరాలకు అందించాలి

### ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** భారతీయ సంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి అన్నారు. కళాభూమి, ముద్రాకథాక్షాల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'ఆమద్ – ఆరంభం 2026' పేరిట భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి హాజరై, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఐఎఎస్ డా.నరసింహారెడ్డి, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య, సమాచార సాంకేతిక శాఖల ప్రధానకార్యదర్శి ఐఎఎస్ జయశ్ రంజన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలకు శాస్త్రీయ నృత్యాలపై ఆసక్తిని పెంచేలా తలిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. శరణ్‌జిత్ కౌర్ రూపకల్పన కళా ప్రదర్శనలో జాహ్నవి, దివ్య, శ్రీవల్లితోపాటు 46మంది నృత్య కళాకారుల ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి.



## వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి : బండి సంజయ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో ప్రధాని కొనసాగిస్తున్న కృషిలో యువతతో పాటు దేశ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపిచ్చారు. విశ్వగురు స్థానంలో భారతదేశాన్ని నిలపాలన్నదే ప్రధాని మోది లక్ష్యమన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలోని హకీంపేట నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమి అథారిటిలో(ఎన్ఎస్ఐఎ) రోజ్‌గార్ మేళా కార్యక్రమం కింద నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలిచ్చిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుందని, నిరుద్యోగ అభ్యర్థులు ఒక ప్రత్యేక లక్ష్యంతో కష్టపడి చదువుకోవాలన్నారు. ఉద్యోగ ప్రక్రియలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు ఉండదన్నారు. కొత్తగా నియమితులైన అభ్యర్థులు ఎన్ఎస్ఐఎ డైరెక్టర్ డిపి పరిహార్, డిప్యూటి డైరెక్టర్ అనిల్, దేశం, సమాజ సేవలకు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం 18 విడతలుగా దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో రోజ్‌గార్ మేళా కార్యక్రమం నిర్వహించిందని, హైదరాబాద్‌లోని ఎన్ఐఎస్ఎలో 238 మంది నియమితులయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎస్ఎ డైరెక్టర్ డిపి పరిహార్, డిప్యూటి డైరెక్టర్ అనిల్ డాము, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు.



## ఎన్నికల నిర్వహణకు శిక్షణా కార్యక్రమం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా మేడ్చల్ జిల్లాలో రిటర్నింగ్ అధికారులు, అదనపు రిటర్నింగ్ అధికారులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని మూడు చింతలపల్లి, ఎల్లంపల్లి, ఆలియాబాద్ మున్సిపాలిటీలకు త్వరలో జరుగనున్న ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది పాటించాల్సిన విధులు, ప్రవర్తన నియమావళి విషయమై శిక్షణ ఇచ్చారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నామినేషన్ల పరిశీలన, పోటీ చేసే అభ్యర్థులకు కేటాయించే గుర్తులు, పోస్టల్ బ్యాలెట్లు, పోలింగ్ బూతుల్లో ఇచ్చే బ్యాలెట్ పేపర్లు, మోడ్ ఆఫ్ కండక్ట్, కౌటింగ్ తదితర అంశాల్లో సవిరంగా శిక్షణ ఇచ్చారు. నోడల్ అధికారి సాంబశివరావు, విజయకుమారి, శిక్షకులు మురళీకృష్ణ, వేణుకుమార్, వెంకటేష్ తదితరులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బిసి సర్పంచ్‌లకు అండగా ఉంటాం

### రాజ్యసభ ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/వికారాబాద్:** నూతనంగా గెలుపొందిన బిసి సర్పంచ్‌లకు అండగా ఉంటామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో గౌలికర్ ఫంక్షన్ హాల్ లో బిసి జెఎసి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామల్లో బిసి సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేయకుండా ఎవరైనా రాజకీయంగా ఇబ్బందులు సృష్టిస్తే సహించేదిలేదన్నారు. సర్పంచ్‌లు గ్రామల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మన్నలు పొందాలన్నారు. గ్రామాల్లో తమ సంపూర్ణ అధికారాలు చెలాయించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ శాసన మండల ప్రతిపక్షనేత మదుసూధనచారి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి బిసిలకు సరైన న్యాయం జరగలేదన్నారు. బిసిల్లో పోరాట పటిమ ఉండాలన్నారు. మనందరం ఒక శక్తిగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిసి సంఘలన్నింటిని ఒకే వేదిక కిందకు తీసుకురావాలని ఆర్. కృష్ణయ్య కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బిసి సర్పంచులకు శాలువాలు కప్పిపూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్ , బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షులు ర్యాగఅరుణ్‌కుమార్ , లక్ష్మ ణ్ , యాదగిరియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## యువత సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

**టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్**

**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** యువత సేవాగుణం అలవర్చుకుని, సమాజంలో పేదవర్గాలకు సహకారం అందించి ప్రోత్సహించాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అన్నారు. హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్‌లోని మోహన్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన డైనింగ్ షెడ్, కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాట్‌ను ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ యువత డ్రగ్స్, మద్యం బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. విలాసాల వైపు వెళ్లకుండా వైశ్య యూత్ మంచి ఆలోచనలతో ఇలా సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా అభినందనీయమన్నారు. విద్య, వైద్యం ఖరీదుగా మారిన ఈ కాలంలో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్య, వైద్యం విషయంలో పేదలకు తగిన సహకారం అందించాలన్నారు.కార్యక్రమంలో ఎంఇఒ రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్ , సీనియర్ నాయకురాలు నారపరాజు రజిని రావు, నాయకులు బొగ్గారపు శరత్ చంద్ర, బొగ్గారపు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## 14సిసి రోడ్లకు రూ.3కోట్ల నిధులు

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపాలిటిలో 14సిసి రోడ్లకు గాను ప్రభుత్వం నుండి రూ.3కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని 6వ వార్డులో సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటిలో ఇప్పటి వరకు రూ.80కోట్ల నిధులు తీసుకువచ్చామని, వాటిలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం 6వ వార్డులో 14సిసి రోడ్లకు రూ.3కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధియే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, మున్సిపల్ అభివృద్ధికి ఎన్ని నిధులైనా తీసుకువస్తానని గుర్తు చేశారు. అభివృద్ధి పథంలో మున్సిపాలిటిని నడిపిస్తామని, వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులను అశీర్వదించి ఓట్లు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలనీ వాసులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లత శ్రీశైలం గౌడ్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, జనార్ధన్ తోపాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** జిహెచ్‌ఎంసి ఆదిభట్ల సర్కిల్ 15 పరిధిలోని తొర్రురు డివిజన్ టెలిఫోన్ కాలనీ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం శంషాబాద్ జోన్ కమిషనర్ చంద్రకళ,ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డిని టెలిఫోన్ కాలనీ అధ్యక్షురాలు సౌజన్య భారతి, ఉపాధ్యక్షులు శ్రీపాద శివలు మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యలపై విన్నవించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో వీధి దీపాలు,పార్కు అభివృద్ధి,రోడ్ నెంబర్13,15,17,18 డ్రైనేజీ సమస్యలపై వివరించమని తెలిపారు.సానుకూలంగా స్పందించిన కమిషనర్ కాలనీలో నెలకొన్న సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.సమస్యలు విన్న వెంటనే సానుకూలంగా స్పందించిన కమిషనర్ కు సౌజన్య భారతి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆఫర్లతో అడ్మిషన్లు చేస్తున్న స్కూళ్లపై చర్యలు

**ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్ డిమాండ్**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా వివిధ మండలాలో వసంత పంచ మి పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆఫర్లతో అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలల చర్యలు తీసుకోవాలని జిల్లా ఆడిషనల్ డిఇ పూర్ణచందర్ రావుకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వివిధ మండలాలలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో విద్యా వ్యాపారం దిశగా 2025–26 విద్యాసంవత్సరం గడవక ముందుకే, వసంత పంచమి పేరుతో 2026–2027 విద్యా సంవత్సరంకి గాను నోఅడ్మిషన్ ఫీ, డిస్కౌంట్ల పేరు తో ముందస్తు అడ్మిషన్లు బహిరంగంగా ఇస్తాను రాజ్యాంగ చేపడుతున్నా రు. అడ్మిషన్లు ఫీ,బుక్స్,డ్రెస్,టై, బెల్ట్ పేర్లతో లక్షలకు లక్షలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విద్య పేరుతో వ్యాపారం చేస్తు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోగలర ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమలో ఎఐఎస్‌ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమైక్య రంగారెడ్డి జిల్లా ఆఫీస్ బేరర్స్ జిల్లా సహ కార్యదర్శి కె.శివ,జే. ధర్మ తేజ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పి.వినోద్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ టీ. నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు హెల్మేంట్ ధరించాలి

**ప్రజాపక్షం/యాచారం :** ప్రతిఒక్కరు రోడ్డుపై వాహనాలు నడిపే వారు హెల్మేంట్ ధరించి పోలీసులకు సహకరించాలని యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి కొరారు. శనివారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా యాచారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మహిళా సంఘాల గ్రూపులకు , విబికెలకు అవగాహణ సదస్సు నిర్వహించారు.ఈ సంధర్భంగా సిఐ మాట్లాడుతూ వాహన దారులు ప్రతి ఒక్కనే రోడ్డు నిబంధనలను తప్పుకుండా పాటించాలన్నారు. కారు నడుపుతున్న వారు సిటు బెల్టు తప్పకుండా పెట్టుకోవాలన్నారు. అందరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బైక్ నడుపుతున్న వారు తప్పకుండా తప్పుకుండా నిభంధనలు పాటించాలన్నారు. వాహనాలను అతివేగంగా నడుపడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయాలన్ని అందరు అర్థం చేసుకోని మేలగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రవింధర్,ఎస్ఐ ప్రియాంక తదితరులు పాల్గోన్నారు.



# నో ఫైర్ సేఫ్టీ




**● నివారణ చర్యలు కాగితాలకే పరిమితం? ● నోటీసులు.. ఒత్తిళ్లతో అటకెక్కిన చర్యలు?**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిబంధనలు ఉల్లంఘించి నిర్మితమవుతున్న వ్యాపార సముదాయాలు.. ఇరుకు గల్లీల్లో ఏర్పాటవుతున్న వ్యాపార సంస్థలు, గోదాముల్లో తరచుగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాలను అధికారులు నివారించలేకపోతున్నారు. ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో తరచుగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నీచర్ మాల్‌లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం అధికారుల నిర్లక్ష్యానికి మరో ఉదాహరణగా నిలిచింది. ఉస్మాన్‌గంజ్‌లోని శాంతి ఫైర్ వర్క్స్‌లో చోటుచేసుకున్న ఘటన కారణంగా అక్టోబర్ 24,2002 తెల్లవారుజామున భవనంలోని లాడ్జీతో పాటు అందులో ఉన్న 12 మంది అమాయకులు మృత్యువాతపడిన విషయం విదితమే. శాంతి ఫైర్ వర్క్స్ ఘటన గురించి ఇప్పటికీ ప్రజలు చర్చించుకుంటూనే ఉన్నారు. ఎనిమిది నెలల క్రితం గుల్జార్‌హౌజ్‌లో చోటుచేసుకున్న ఘటనలో 17 మంది.. 2023లో బజార్‌ఘాట్‌లో జరిగిన ఘటనలో 10 మంది.. 2022లో బోయిగూడలో 12 మంది మృతి చెందిన ఘటనలు హైదరాబాద్ చరిత్రలో అత్యంత విషాదకరంగా నిలిచిపోగా.. తాజాగా నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నీచర్ మాల్‌లో చోటుచేసుకున్న ఘటనలో ఆరుగురు మంటల్లో చిక్కుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తరచుగా చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో ఫైర్ సేఫ్టీ విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినా.. ఆచరణకు నోచుకోవడం లేదు. ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు హంగామా చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణదారులు, వ్యాపారులకు నోటీసులు జారీ చేయడం పరిపాటిగా మారింది. అనంతరం వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు ఉండవు. గతంలో బల్దియా ఈవీడీఎం విభాగం కొంత మేరకు ప్రయత్నించినా.. తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్ల కారణంగా నోటీసులు బుట్టదాఖలయ్యాయి. ఈ నేపథ్యంలోనే గల్లీలు, వాహనాలు తిరిగే సదుపాయం లేని ప్రాంతాల్లో నిర్మితమవుతున్న బహుళ అంతస్తులతో పాటు వాటిలో ఏర్పాటవుతున్న వ్యాపార సంస్థలు అగ్ని ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే ఘటనల్లో ఎటువంటి సంబంధం లేని అమాయకులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తున్నది.

### వేలల్లో నోటీసులు?

అగ్ని ప్రమాదాలను నివాసిస్తామంటూ హైడ్రా ప్రకటిస్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. ఫైర్ సేఫ్టీ గురించి ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా.. తరచుగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటి వరకు వేల సంఖ్యలోనే జీహెచ్‌ఎంసీ పరిధిలో నోటీసులు జారీ చేసినా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఎటువంటి కఠిన చర్యలు చేపట్టలేకపోయినట్లు సమాచారం. ఎనిమిది నెలల క్రితం గుల్జార్‌హౌస్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో ఫైర్‌సేఫ్టీ విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించినా... దేశంలోనే అతి పెద్ద యూఎల్‌బీగా గుర్తింపు పొందిన జిహెచ్‌ఎంసి పరిధిలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు విమర్శలకు తావిస్తున్నా యి. ఇరుకు గల్లీల్లో ఏర్పాటవుతున్న గో దాంలు, షోరూముల్లో ఫైర్ సేఫ్టీ గురించి ఇకనైనా బల్దియా, హైడ్రా సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నిరు పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**ప్రజాపక్షం/షాబాద్:** నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, చందనవెల్లి సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామిలతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయాని ప్రారంభించారు. అనంతరం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ, షాధీ ముభారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రత్యేకంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రాష్ట ప్రజలకు ఇచ్చిన హామీలు దశల వారిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్ ముదిరాజ్, సర్దానరగ్ మార్కెట్ చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, సర్పంచులు గుండాల అశోక్, యాదిరెడ్డి, నర్సింలు, శాంతమ్మ, సబిత గోవర్దన్ రెడ్డి, కుమ్మరి లావణ్య చెన్నయ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8న తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలు


**ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఫిబ్రవరి 8న జరిగే తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్క ర్స్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిలో రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మెడికల్ రంగంలో పనిచేస్తున్న మూడోవ తరగతి ఉద్యోగులను కార్మికులను శానిటేషన్, టెక్నికల్ ఉద్యోగులు ఇం కా అనేక విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఎన్ హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్కువ వేతనాలతో శ్రమను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాంట్రాక్టు లేబర్ చట్టంలో పేర్కొ న్న హక్కులను కూడా వారికి కల్పించకుండా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆరోపించా రు. జిఒ 60 ప్రకారం వారికి కనీస వేతనం 15600 పిఎఫ్, ఇఎస్ఐ మినహాయించి చేతికి రూ.13683లు ప్రతి కార్మికుడికి ఇవ్వాలని ఆయ న డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పం దించి వారి హక్కులను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ వచ్చే నెల 8న వరంగల్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్ర దం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శ్యామల, దాసరి కిరణ్, జ్యోతి, స్టాలిన్, పద్మ, రజిని, మంగ, సరస్వతి, రాజు, బాలమణి, మహేందర్, సరస్వతి, ప్రభావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా

## ప్రభాకర్ రెడ్డి ఎకగ్రీవం



**ప్రజాపక్షం/షాబాద్:** షాబాద్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా అంతారం సర్పంచ్ ప్రభాకర్ రెడ్డిని ఎకగ్రీవంగా మండల సర్పంచులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ రెడ్డిని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మెన్ శాలువాతో సత్కరించారు. మండలంలోని సర్పంచులకు, గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సహాయసహకారాలు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నా పై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కుంట్లూరులో దొంగల హల్‌చల్

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్ మెట్, కుంట్లూరులోని ఓ కిరాణా షాప్‌లో దొంగలు పడ్డారని హయత్ నగర్ సిఐ నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ హయత్ నగర్ సమీపంలోని కుంట్లూర్ గ్రామంలో గల ఇష్టకామేశ్వరి మాత గుడి దగ్గర కేంగిరి మల్లేష్ కిరాణా షాప్ ఎప్పటిలాగే గురువారం రాత్రి 10 గంటల సమయంలో మూసి ఇంటికి వెళ్ళాడు. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో షాప్ తెరిచి చూడగా షాప్ కిటికీ తెరిచి కౌంటర్‌లో ఉన్న రూ.78 వేలు చోరీ చేయబడ్డాయాని బాధితులు తెలుపడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హయత్ నగర్ సిఐ చెప్పారు.


## విద్యార్థినీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా**

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థినీలు చదువులతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ పోస్కో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా సూచించారు. శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీలకు పోస్కో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబియా సుల్తానా మాట్లాడుతూ విద్యార్థినీల్లో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, సమాజంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్. జయమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సినా రాయణ రెడ్డి అన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు (జనవరి 25 ఆదివారం)జిల్లా వ్యాప్తంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సి.నారాయ ణ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు,అన్ని అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాలు, మండల కార్యాలయాల తోపాటు పోలింగ్ బూత్ స్థాయిలో నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ముఖ్యాంగా అవగాహన ర్యాలీల తోపాటు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు,యువతతో భారీ ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా ప్రతి కార్యాలయం, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఇటీవల కొత్త ఓటరుగా నమోదైన యువతకు ఈ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డులను( ఏపీక్ కార్డ్స్) పంపిణీ చేయడం జరుగుతుందని, అందుకాకుండా ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములవుతున్న సీనియర్ సిటిజన్లను (వృద్ధ ఓటర్లను) గౌరవపూర్వకంగా సన్మానించడం జరుగుతుందని తెలిపారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని,ఈ వేడుకల్లో ప్రజలు,యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కోరారు.

## టెండర్‌దారులు సకాలంలో డబ్బులు చెల్లించాలి

**దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి**

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** టెండర్ దక్కించుకున్న టెండర్ దారులు నిర్ణీత సమయంలో దేవాదాయశాఖకు డబ్బులు చెల్లించేందుకు కృషి చేయాలని దేవాదా య శాఖ ఇన్‌స్పెక్టర్ మోహర్‌రెడ్డి సూచించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండ ల పరిధిలో రామేశ్వరం గ్రామంలో ఉన్న ప్రసిద్ధి చెందిన శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయంలో టెంకాయలు, అభిషేకం, వాహన పూజ సామాగ్రి విక్రయించేందుకు టెండర్లు పిలిచారు. ఇందుకు గాను బహిరంగ వేలం పాటలో మండల పరిధిలోని మధురాపురం మాజీ సర్పంచ్ యాదయ్య రూ.35లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు భక్తులు, దాతలు, ప్రజలందరు సహాకరించాలని కోరారు. గతంలో లడ్డూకు, టెంకాయలకు వేలం వేసే వాళ్లం..కానీ ఈ సారీ కేవలం టెం కాయలు విక్రయించేందుకు మాత్రమే టెండర్లు వేసినట్లు వివరించారు. దేవాదా య శాఖ ద్వారానే లడ్డూలను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఇఒ శివకుమార్ మాట్లాడుతూ గత ఏడాది నుండి పెండింగ్ ఉన్న రూ.18లక్షలను రికవర్ చేయడంతో పాటు దేవాదాయ శాఖ నుండి రూ.50లక్షల నిధులు మంజూరు అయ్యాయని, వాటితో భక్తుల సౌకర్యార్థం 12రూములు, 10బాత్ రూమ్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. దేవాలయానికి ప్రహరీ గోడ లేకపోవడంతో కొంత ఇబ్బంది జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరం సర్పంచ్ మానస సురేష్, మాజీ సర్పంచ్ సంపత్‌కుమార్, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం జూనియర్ అసిస్టెంట్లు దేవేందర్‌రెడ్డి, మాధవులు, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.





## హైదరాబాద్ మ్యావరిక్స్ రోటరీ క్లబ్.. ఎంబ్రాయిడరీ మెషిన్స్ విరాళం

**హైదరాబాద్ :** సిఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షే మ వృత్తి నైపుణ్యం కేం ద్రానికి హైదరాబాద్ మ్యావరిక్స్ రోటరీ క్లబ్ రూ.40 వేల విలువ చేసే రెండు ఎంబ్రాయిడరీ మెషిన్స్ విరాళంగా అందించింది. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డా.టి.సురేష్ బాబు, ఒకేషనల్ డైరెక్టర్ ఆశా ఆచార్య, సర్వీస్ ప్రాజెకట్స్ డైరెక్టర్ అజయ్ కుమార్, సభ్యులు కె.విజయ లక్ష్మి మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పనకు అందచేసారు. ఈ ఎంబ్రాయిడరీ మెషిన్స్ ద్వారా ఎక్కువ మంది మహిళలకు ఎంబ్రాయిడరీ నేర్పించగలమని, వారికి ఎంతో ఉపయోగం అని కల్పన పేర్కొని, రోటరీ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమలో సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి శ్రీ చెన్న కేశవ రావు, మహిళా కేంద్రం సభ్యులు లలిత, ఉపాధ్యాయినిలు,, శిక్షణ పొందుతున్న మహిళలు, సిఆర్ పాలి క్లినిక్ సభ్యులు డి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సురేష్ మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాగే ఈ మెషిన్స్‌కి ఆర్థిక సహాయం అందించిన ఆశా ఆచార్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## పార్కుల అభివృద్ధితోనే ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్యం

**బియన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజలందరూ ఆరోగ్యపరంగా ఉండాలంటే పార్కుల అభివృద్ధి చేయడంతోనే వారికి సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని హరిహరపురం కాలనీలో రూ.18లక్షల 37వేలతో చేపట్టిన పార్కు అభివృద్ధిని పూర్తి స్థాయిలో చేయడంతో శనివారం కాలనీ వాసులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలను దశల వారిగా అభివృద్ధి చేయడంతో పాటు అంతర్గత సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, కేవియన్‌రెడ్డి, మురళీకృష్ణ, జనార్ధన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జాగో భాగ్యనగర్ – ఛలో బాలాపూర్ ధర్మ రక్షణ సభను జయప్రదం చేయండి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నేడు జాగో భాగ్యనగర్ ఛలో బాలాపూర్ ధర్మరక్షణ సభను జయప్రదం చేయాలని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివాసం ఎన్జీవోస్ కాలనీల్లో పార్టీ నాయకులతో పాటు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను ప్రజలందరూ భారీ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల యుద్ధానికి సన్నద్ధమైన కాంగ్రెస్ శ్రేణులు

**కాంగ్రెస్ జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు యుద్దానికి సిద్ధమయ్యారు. శనివారం పట్టణ సమీపంలోని చౌదమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుండి మొదలైన కాంగ్రెస్ జన ప్రభంజన యాత్రను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ముఖ్యకూడలి మీదుగా మెయిన్‌రోడ్డు, పటేల్ రోడ్డు, సబ్ రిజిస్టేషన్ రోడ్డు, ఫరూఖ్‌నగర్ మీదుగా ఈడెన్ ప్లాజా వరకు కాంగ్రెస్ జన ప్రభంజన యాత్ర చేరుకుంది. అడుగడుగునా ఓటర్లను కలుస్తూ మున్సిపల్ ఎన్నికల్లో ఆశీర్వాదం ఇవ్వాలంటూ అభ్యర్థిస్తూ యాత్రను ముందుకు సాగించారు. జానపద గీతాలు, డప్పుల మోతలతో ప్రధాన రహదారులు ఒక్కసారిగా మారుమ్రోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, ప్రజలందరి ఆశీర్వాదం కావాలని పేర్కొన్నారు. ర్యాలీలో పలకరిస్తూ ముందుకు వెళ్ళిన సమయాల్లో ప్రజల నుండి మంచి స్పందన లభించిందని, ప్రభుత్వ పథకాలు ప్రజలు పూర్తి స్థాయిలో చేరుతున్నాయని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ రాని వ్యక్తులు నిరుత్సాహ పడరాదని, నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థులను నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తామని, ప్రజల మధ్య ఎవరు ఉంటారనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని టికెట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరు కాం గ్రెస్‌కు అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి రాజకీయ విద్వేషాలు లేవని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి వివరించారు. రెండేళ్ల కాలంలో షాద్‌నగర్ డివిజన్‌కు రూ.1350కోట్ల నిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీసుకురావడంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. గత పదే ళ్ళ పాలనకు, రెండేళ్ల పాలనకు వ్యత్యాసం ఏమి టో ప్రజలందరు గ్రహించాలని, వచ్చే మున్సిప ల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కా ర్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్యాంసుందర్‌రెడ్డి, కాశీనాథ్ రెడ్డి, విశ్వం, విశాల, బస్వం, బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్ గౌడ్, సర్వర్‌పాషా తదిరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్‌కు టీమిండియా....

## హాఫ్ సెంచరీతో చెలరేగిన మాత్రే..

పురుషుల అండర్ –19 ప్రపంచకప్‌లో భారత జట్టు అజేయంగా దూసుకెళ్తోంది. వర్ష కారణంగా 37 ఓవర్లకు కుదించిన పోరులో న్యూజిలాండ్‌పై టీమిండియా జయభేరి మోగిం చింది. డక్‌వర్త్ లూయిస్(DLS) ప్రకారం స్వల్ప లక్ష్యాన్ని 13.3 ఓవర్లలోనే ఛేదించి సూపర్ సిక్స్‌కు దూసుకెళ్లింది. అంబ్రిష్(429), హెనిల్ పటేల్(3 23)లు ప్రత్యర్థిని కట్టడి చేయగా.. కెప్టెన్ ఆయుష్ మాత్రే(53), వైభవ్ సూర్యవంశీ(40)లు ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డారు. వీరి విధ్వంసంతో ఏడు వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసి



తర్వాతి దశకు అర్హత సాధించింది. అండర్–19 ప్రపంచకప్‌లో భారత కుర్రాళ్లు అదరగొడుతున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు అద్భుతంగా రాణిస్తుండడం తో ఫేవరెట్ టీమిండియా సూపర్ సిక్స్‌లో అడుగుపెట్టింది. వరుసగా శనివారం ఆర్ఎస్ అంబ్రిష్(429), హెనిల్ పటేల్(323)లు న్యూజిలాండ్‌పై నిప్పులు చెరిగారు. పవర్ ప్లేలోనే కివీ స్ టాపార్డర్‌ను కూల్చిన ఈ ద్వయం.. ఆ తర్వా త కూడా పోటీపడి వికెట్లు తీయగా ప్రత్యర్థి 135కే ఆలౌటైంది. ఆ జట్టులో సెల్విన్ సంజయ్ 28 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

### మాత్రే, వైభవ్ దూకుడు

అనంతరం వర్షం అంతరాయంతో భారత లక్ష్యాన్ని 130గా కుదించారు. స్వల్ప ఛేదనలో ఓపెనర్ అరోన్ జార్జ్(7) విఫలమైనా.. కెప్టెన్ ఆయుష్ మాత్రే(53 : 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లు), వైభవ్ సూర్యవంశీ(40)లు చితక్కొట్టారు. షార్ట్‌పిచ్ బంతుల్ని అలవోకగా ఎదుర్కొన్న మాత్రే.. అర్ధ శతకంతో జట్టు విజయానికి బాటలు వేశాడు. అతడు ఔటయ్యాక విహాన్ మల్హోత్రా(17 నాటౌట్), వేదాంత్ త్రివేది(13 నాటౌట్)లు మరో వికెట్ పడకుండా లాంఛనం పూర్తి చేశారు. వీరిద్దరూ అజేయంగా నిలవగా.. 7 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా సూపర్ సిక్స్‌కు అర్హత సాధించింది. సంచలన బౌలింగ్ ప్రదర్శన చేసిన అంబ్రిష్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

# డబ్ల్యుపిఎల్‌లో ఆర్‌సిబికి తొలి ఓటమి



డబ్ల్యుపిఎల్ సీజన్‌లో ఆర్‌సిబి తొలి ఓటమి చవి చూసింది. వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో విజయం సాధించి ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరిన ఆర్సీబీ ఆరో మ్యాచ్‌లో బోల్తా పడింది. వడోదర వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ సీజన్‌లో మూడో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరి ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ సరిగ్గా 20 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌటైంది.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 15.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. లారా వోల్వార్ట్ (42*) నాటౌట్‌గా నిలిచింది. షెఫాలి వర్మ (16), రోడ్రిగ్స్ (24), మారిజన్నే (19*) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఆర్సీబీ బౌలర్లలో సయాలి 2 వికెట్లు పడగొట్టగా, రాధా యాదవ్ ఒక వికెట్ తీసింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ తడబడింది. స్మృతి మంధాన (38; 34 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. రాధా యాదవ్ (18; 17 బంతుల్లో), జార్జియా వోల్ (11) పరుగులు చేశారు. ఈ ముగ్గురు మినహా మరెవరూ రెండంకెల స్కోరు చేయక పోవడం గమనార్హం. గ్రెస్ హారిస్ (9), గౌతమి నాయక్ (3), రిచా ఘోష్ (5), నదైన్ డి క్లర్క్ (5) విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో నందిని శర్మ 3, మారిజెన్ కాప్, మిన్ను మణి, చినెల్లి హెన్రీ రెండేసి వికెట్లు పడగొట్టగా.. శ్రీ చరణి ఒక వికెట్ తీసింది.

# ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి హైదరాబాదీ అమ్మాయి సృజన!



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరానికి చెందిన యువ క్రికెటర్ ఎడ్ల సృజన అరుదైన అవకాశం దక్కించుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఇప్పటివరకు సపోర్ట్ బౌలర్‌గా ఉన్న సృజన, ఇప్పుడు ఏకంగా ప్రధాన జట్టులోకి ఎంపికైంది. మరో హైదరాబాదీ క్రీడాకారిణి ఎం.మమత గాయపడటంతో, ఆమె స్థానంలో సృజనకు ఈ అవకాశం లభించింది. వడోదరలో జరుగుతున్న ఈ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు సృజన జట్టుతో కలిసి ఆడనుంది. ఈ సందర్భంగా సృజన తన ఆనందాన్ని పంచుకుంటూ.. 'ఇది ఒక ఊహించని పెద్ద సర్‌ప్రైజ్. ఇప్పటివరకు సపోర్ట్ బౌలర్‌గా జట్టుతో ఉండటమే గొప్ప విషయం గా భావించాను. ఇప్పుడు ప్రధాన జట్టులో అవకాశం రావడం ఒక సవాల్‌తో కూడుకున్న బాధ్యత. నాకు అవకాశం వచ్చినప్పుడు ఖచ్చితంగా రాణించి, అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను' అని తెలిపింది.

### సృజన ప్రస్థానం..

20 ఏళ్ల సృజన మీడియం పేస్ బౌలర్. తక్కువ పరుగులిస్తూ వికెట్లు తీయ డం (ఎకానమీ రేట్) ఈమె ప్రత్యేకత. వివిఎస్ లక్ష్మ ణ్ వంటి దిగ్గజాలను అందించిన సికింద్రాబాద్‌లోని ప్రఖ్యాత సెయింట్ జాన్స్ కోచింగ్ ఫౌండేషన్‌లో ఈమె శిక్షణ పొందింది. వేగంగా బౌలింగ్ చేస్తూనే, ఖచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ మెయింటైన్ చేయడం తన బలమని సృజన న మ్ముతుంది. ఈమె కస్తూర్బా కాలేజీ విద్యార్థిని. త న ఎదుగుదలకు తల్లిదండ్రులు (రిటైర్డ్ రైల్వే ఉద్యోగైన తండ్రి, గృహిణి అయిన తల్లి), కోచ్‌ల ప్రోత్సాహమే కారణమని సృజన తెలిపింది.



# తీవ్రమైన అనిశ్చితి!

కేవలం భారత్‌లోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా ఈ వారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. వచ్చే వారం కూడా ఇలాంటి పరిస్థితే కొనసాగవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గ్రీన్‌లాండ్‌పై అమెరికా వైఖరి.. యూరోపియన్ యూనియన్ (ఇయు) ప్రతిస్పందన.. రష్యా–ఉక్రేన్ శాంతి చర్చల ఫలితాల అమలు వంటి అనేకానేక అంశాలు స్టాక్ మార్కెట్లను ప్రభావించతం చేయనున్నాయి. ఈ వారం చివరిలో మొదలైన భారీ పతనం వచ్చే వారమంతా కొనసాగుతుందనే అంచనాలే ఎక్కువగా వినిపించాయి. ఇప్పటికే మార్కెట్లు గాయపడిన మానసిక స్థితిలో ఉండటంతో, చిన్న ప్రతికూల వార్త కూడా పెద్ద ప్రభావాన్ని చూపే పరిస్థితి ఏర్పడింది. పెట్టు



బడిదారుల్లో ఇది తాత్కాలిక సవరణేనా, లేక దీర్ఘ కాల పతనానికి సంకేతమా? అనే సందేహం బలంగా నెలకొంది. ఈ పతనానికి ప్రధానంగా గ్లోబల్ కారణాలే బీజం వేశాయి. అమెరికా మార్కెట్లలో గత వారం చోటుచేసుకున్న భారీ అమ్మకాలు ప్రపంచవ్యాప్తంగా రిస్క్ భావనను తగ్గించాయి. అమెరికా ప్రభుత్వ విధానాలపై అనిశ్చితి, వాణిజ్య పరిమితులపై సంకేతాలు, డాలర్ బలహీనత, బాండ్ ఈల్డ్‌లో తీవ్ర ఒడిదుడుకులు వంటి అంశాలు పెట్టుబడిదారులను రక్షణాత్మక విధానాలు అవలంభించే విధంగా ప్రోత్సహించాయి. ఈ ప్రభావం భారత్‌పై కూడా పడింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంలో దూకుడు పెంచారు. జనవరి చివరి వారంలో కూడా ఈ అమ్మకాలు కొనసాగితే సూచీలు మరింత ఒత్తిడికి లోనవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, దేశీయంగా చూస్తే, కంపెనీల త్రైమాసిక ఫలితాలపై మిశ్రమ స్పందన కనిపించింది. కొన్ని పెద్ద కంపెనీలు అంచనాలకు తక్కువ లాభాలను ప్రకటించగా, మరికొన్ని భవిష్యత్ వృద్ధిపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వలేకపోయాయి. దీనివల్ల కంపెనీల లాభార్జనపై అనుమానాలు పెరిగాయి. ముఖ్యంగా ఐటి, మెటల్, రియల్ ఎస్టేట్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. గత రెండు సంవత్సరాలుగా వేగంగా పెరిగిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు ఈ పతనంలో అత్యధికంగా దెబ్బతిన్నాయి. తక్కువ లిక్విడిటీ ఉన్న ఈ షేర్లలో ఒక్కసారిగా అమ్మకాలు పెరగడంతో ధరలు వేగంగా క్షీణించాయి.

మరోవైపు, ఈ వారం జరిగిన మార్కెట్ల పతనం శాశ్వతమన్న భావన కూడా సరైనది కాదు. దీర్ఘకాల పెట్టుబడిదారుల దృష్టిలో చూస్తే, ఈ వారం కనిపించే బలహీనత ఒక అవకాశం లాంటిదిగా కూడా మారవచ్చు. బలమైన మూలాధారాలు ఉన్న కంపెనీల షేర్లు కూడా మార్కెట్ ఒత్తిడిలో భాగంగా పడిపోతున్నాయి. అయితే జనవరి చివరి వారంలో ఎక్కువ మంది పెట్టుబడిదారులు ఈ విధమైన అవకాశాలకంటే మూలధనం రక్షణకే ప్రాధాన్యం ఇస్తారని అంచనా. అందువల్ల మార్కెట్‌లో వాల్యూమ్స్ తగ్గి, ఒడిదుడుకులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సెంటిమెంట్ పరంగా చూస్తే భయం ప్రధానంగా పైచేయి సాధించే దశ ఇది. వచ్చేవారం సూచీలు కొత్త కనిష్ఠాలను పరీక్షించే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. అదే సమయంలో, తీవ్ర పతనం తర్వాత కొంతమేర స్థిరీకరణ కూడా కనిపించవచ్చు. మొత్తంగా చెప్పాలంటే, జనవరి చివరి వారంలో స్టాక్ మార్కెట్ ప్రయాణం సాఫీగా ఉండే అవకాశాలు చాలా తక్కువ. భారీ పతనం తర్వాత వచ్చిన ఈ దశలో మార్కెట్ తన దిశను వెతుక్కుంటోంది. గ్లోబల్ సంకేతాలు, విదేశీ పెట్టుబడిదారుల కదలికలు, బడ్జెట్ అంచనాలు అన్నీ కలిసి మార్కెట్‌ను జాగ్రత్త దిశగా నడిపిస్తున్నాయి. ఈ కాలం భావోద్వేగాలకు లోనయ్యే కాలం కాకుండా, ఓర్పుతో, అవగాహనతో పరిస్థితిని గమనించాల్సిన కాలంగా గుర్తుంచుకోవాలి.

## ఈ వారం స్టాక్ మార్కెట్లు



**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 81,537.70 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 83,570.35 పాయింట్లు. నష్టం 2,032.65 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 25,048.65 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,694.35పాయింట్లు. నష్టం 654.70 పాయింట్లు).

## ఆగని బంగారం పరుగు

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న అనిశ్చితి బులియన్ మార్కెట్‌కు మరింత ఊతమిస్తున్నది. ఫలితంగా బంగారం ధర పలుగులు తీస్తునే ఉంది. మరికొద్ది రోజుల్లో రాబోతున్న కేంద్ర బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా పసిడి ప్రేమికులు, ఇన్వెస్టర్లు భారీ ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా గత ఏడాది కాలంగా అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతున్న ప్రశ్న. అంతర్జాతీయంగా అమెరికా డాలర్ బలహీనపడటం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల 2025లో బంగారం ధరలు దాదాపు 67 శాతం పెరిగి కొత్త రికార్డులను సృష్టించాయి. అక్షరాలా డిసెంబర్ నాటికి అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ఔన్సుకు 4,500 డాలర్ల మార్కును దాటడం విశేషం. భారతీయులకు బంగారం కేవలం ఒక లోహం మాత్రమేకాదు... బలమైన సెంటిమెంటు. హోదాకు చిహ్నం. అందు కే, ప్రస్తుతం భారతీయ ఇళ్లలో సుమారు



34,600 టన్నుల బంగారం నిల్వలు ఉన్నట్లు మోర్గాన్ స్టాన్లీ నివేదికలు చెబుతున్నాయి. దీని విలువ దాదాపు 3.8 ట్రిలియన్ డాలర్లు.. అంటే అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాల సెంట్రల్ బ్యాంకుల వద్ద ఉన్న నిల్వల కంటే ఇది చాలా ఎక్కువ. ఐసిఆర్ఎ వంటి సంస్థల విశ్లేషణ ప్రకారం, 2026లో బంగారం ధరలు పెరగడం వల్ల ఆభరణాల విక్రయాలు 20 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. అందుకే సామాన్యుడికి బంగారం అందుబాటులో ఉండేలా నిర్మలమ్మ ఈ బడ్జెట్‌లో సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలని అందరూ కోరుకుంటున్నారు. మొత్తానికి ఈ బడ్జెట్ సామాన్యుడి బంగారు కలలను నిజం చేస్తుందో లేదో తెలియాలంటే ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు వేచి చూడక తప్పదు.

# యూరియా యాప్ రద్దు చేయాల్సిందే

**● సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం ● రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి రాస్తారోకో**



**ప్రజాపక్షం/మునుగోడు :** యూరియా యాప్‌ను పూర్తిగా రద్దు చేయాల్సిందేనని సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు. శనివారం రైతులకు అందించే యూరియా యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మునుగోడు మండల కేంద్రంలో సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా, రస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని అర్థం కాని యాప్‌లను తీసుకొచ్చి రైతులను ఆగం చేయొద్దని నినాదాలు చేస్తూ రెండు గంటల పాటు రాస్తారోక నిర్వహించారు.అనంతరం ఇన్‌చార్జ్ తాసిల్దార్ నేలపట్ల నరేష్, మండల వ్యవసాయ అధికారి పద్మజకు రైతుల డిమాండ్లతో కూడిన మెమోరాండం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాలలో ఉన్న రైతులకు స్మార్ట్ ఫోన్లు లేకపోవడం దానితో పాటు ఇంటర్నెట్ సర్వర్ బిజీగా ఉండడం లాంగ్వేజ్ ప్రాబ్లం తదితర సాంకేతిక సమస్యతో యూరియాను సరైన సమయంలో పొందలేకపోతున్నారని యాప్ లో తలెత్తిన సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలి రైతులకు అర్థం కాని పరిస్థితులు ఆందోళన గురవుతున్నారు. ప్రభుత్వం గతం మాదిరిగానే సొసైటీల ద్వారా ఫర్టిలైజర్ షాపులలో యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వరి నాట్లు అయిపోయి నేల కావస్తున్న యూరియా అందుబాటులో లేక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు ఇప్పటికైనా యూరియాను ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లూరి నరసింహ,రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బండమీది యాదయ్య, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బిలాలు, మండల సహాయ కార్యదర్శి మందుల పాండు, సతీష్ కుమార్,మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్, దుబ్బ వెంకన్న, ముంత నరసింహ, బైరుగొండ వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, బి నరసింహ, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఉదయ్ కుమార్,కట్కూరి లింగ స్వామి, యాదయ్య, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పిఎఫ్ జమ చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ :** కార్మికుల ఖాతాల్లో జమ కావాల్సిన రెండు నెలల పెండింగ్ పిఎఫ్ జమ కాలేదని, ఈ అంశంపై తక్షణమే దృష్టి సారించి కార్మికుల ఖాతల్లో మొత్తం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ విజ్ఞప్తి చేశారు. శనివారం నూతనంగా మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు చేపట్టిన జి.రాజును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్ పిఎఫ్ జమ చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మెరుగు చిరంజీవి, సలహాదారులు జి.చంద్రశేఖర్, యూనియన్ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎ.నారాయణరెడ్డి, మున్సిపాలిటీ జవాన్లు హన్మందస్, వెంకటి, జిల్లా కార్యవర్గ సభ్యులు సి లక్ష్మి , ఆర్ ఆనందర్, డి సంగీత, కె. ఉషాన్న, ఎన్ శంకర్, జి శకుంతల, బి నరేందర్, ఉజ్వలా, ఆడే దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలపై ప్రశ్నించిన అశ్వమిత్ గౌతంపై అక్రమ కేసులు రద్దు చేయాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఉత్తర ప్రదేశ్‌కి చెందిన అశ్వమిత్ గౌతమ్‌పై యుపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం 14 ఏళ్ల పిల్లవాడు సోషల్ మీడియా వేదికగా దేశంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు పాలకుల అవినీతి సమస్యలపై సోషల్ మీడియాలో ప్రశ్నించడంతో బెంబేలెత్తిపోయిన యుపిలోని బిజెపి పాలకులు, అధికారులు మైనర్ అని కూడా ఆలోచించకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసి సెక్షన్151 కేసు పెట్టి లక్నోలో అరెస్టు చేయడం మహా దారుణంగా ఉందన్నారు. విద్యార్థిగా ఆట పాటలతో గడపాల్సిన వయసులో సమాజం గురించి చదువుతూ అర్థం చేసుకొని పాలకులు ప్రజాసంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న విషయాలను, పేదల భూములు లాక్కోవడం , నిరుద్యోగం, మహిళలపై అత్యాచారాలు అనేక అంశాలపై ఎంతో పరిణతితో అశ్వమిత్ సోషల్ మీడియాలో సంధించిన ప్రశ్నలు మేధావులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయన్నారు. ఈ దేశం కేవలం కొద్ది మందిది మాత్రమే కాదని, ఇది అందరిదన్నారు. వాక్ స్వాతంత్రాన్ని కాపాడుకోవడానికి పోరాడాలనడం అక్షర సత్యమన్నారు. ప్రజా సమస్యలపై సూటిగా ప్రశ్నిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్న అశ్వమిత్ నోరు నొక్కేందుకై పెట్టిన కేసులను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు. ఈకార్యక్రమంలో వరంగల్ లో బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, బిసి నాయకులు చెలుకల రాజు. చంద్రశేఖర్, బానోతు లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.





# పర్యాటకరంగ అభివృద్ధిలో ఉద్యోగులది కీలకపాత్ర


టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పర్యాటక రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు యూనియన్లు చేస్తున్న ఉద్యమాలు సమాజానికి అవసరమని ఆయన పేర్కొన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, పని పరిస్థితుల మెరుగుదల కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉంద ని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మాట్లాడుతూ యూనియన్ చేపడుతున్న కార్యక్రమాలు, ఉద్యోగుల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటాలను వివరించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కే.లక్ష్మీ నారాయణ కార్మిక ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జనరల్ ఆసుపత్రి సూపర్‌వైజర్ అక్రమ తొలగింపు సర్క్యులర్ తక్షణమే ఉపసంహరించుకోవాలి

● ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మిర తీరు ఆక్షేపనీయం ● రాష్ట్ర కార్యదర్శి (ఎఐటియుసి) యూనియన్ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ పి. సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగ అజ్మీర ఆసుపత్రి కార్మికుల పట్ల ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న తీరు ఆక్షేపనియం, అమానుషమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎటిటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జిఒ ప్రకారం వేతనాలు చెల్లించాలని కార్మికుల హక్కుల కోసం ఎటిటియుసి యూనియన్ చేస్తున్న పోరాటాలలో చురుకుగా పాల్గొంటున్నారనే కక్షతోనే ఆస్పత్రి సూపర్‌వైజర్ దేవానంద్‌ను అకారణంగా ఎలాంటి విచారణ జరపకుండా చట్ట విరుద్ధంగా తొలగింపు సర్క్యులర్‌ను ఇచ్చారని ఆ సర్క్యులర్‌ను తక్షణమే ఎత్తివేయాలని సోమవారం నిరసన, మంగళవా రం నుండి చేపట్టబోయే నిరవధిక సమ్మె నోటీసు ను శనివారం ఆసుపత్రి ఆర్ఎంఒ‌లకు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ దేవానంద్ సంవత్సరాల తరబడి నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నాడని, కార్మికుల జీతభత్యాల పెంపు హక్కుల కోసం యూనియన్ పోరాటంలో చురుకుగా పాల్గొంటున్నాడనే కక్ష కట్టారన్నారు. దేవానంద్ గురువారం రాత్రి విధుల్లో ఉండగా తన డ్యూటీ టైంకు సంబంధం లేని ఫోటోలు కల్పించుకొని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నడని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తన విధులకు సంబంధించిన ఫోటోలు కావని కావాలనే తన పై ఇలాంటివి దుష్ప్రచారం చేస్తున్నారని సూపరింటెండెంట్‌కు వివరించారని దీనే ఆసరాగా తీసుకొని సూపరింటెండెంట్ దూషించినట్లు చిత్రీకరించి అభియోగాలు మోపి సూపరింటెండెంట్ ఆదేశాల ప్రకారం సంబంధిత స్థాయి సెక్యూరిటీ ఏజెన్సీ సర్వీసెస్ వారు అక్రమంగా సంఘటనపై ఎలాంటి విచారణ జరపకుండా వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా తొలగింపు ప్రత్యేక సర్క్యులర్ ఇవ్వడం ఎంతో బాధాకరమన్నారు. ఆసుపత్రిలో తగినంత కార్మికుల సంఖ్య లేకుండా క్లీనింగ్ ఎలా సాధ్యమన్నారు. కార్మికులను, ఉద్యోగులను సూపరింటెండెంట్ నోటికి వచ్చినట్టు ఆత్మగౌరవం దెబ్బతినేలా దూషణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. ఆసుపత్రిలో ఎంత పనిచేసిన కార్మికులకు మాత్రం తగిన గుర్తింపు రాకపోగా నింధలు మాత్రం భరించలేనివి మోపుతున్నారని మండిపడ్డారు. తక్షణమే తప్పుడు పద్ధతుల్లో విడుదల చేసి న తొలగింపు సర్క్యులర్ వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిచో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టి మంగళవారం నుండి సమ్మెలోకి దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి బ్రాంచ్ నాయకులు, కార్మికులు బి.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ

బాల సదన్ కొత్త భవనం ప్రారంభం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మెట్టుగడ్డలోని స్టేట్ హోమ్ ప్రాంగణంలో బాలికల కోసం నిర్మించిన కొత్త బాలసదన్ భవనాన్ని శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.1.34 కోట్ల వ్యయంతో ఈ బాలసదన్ భవనం నిర్మించబడింది. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు బాలసదన్ ఒక ఇంటిలా మారుతుందని, ఇక్కడ వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు అన్నారు. ప్రత్యేకంగా బాలికలు పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న డీకే అరుణ, బాలసదన్ ద్వారా వారికి సమతుల్యమైన ఆహారం, ఆరోగ్య పరీక్షలు, విద్య అందిస్తూ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని అన్నారు. మంచి ఇంజనీరింగ్ డిజైన్‌తో భవనాన్ని నిర్మించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీర్లను ఆమె అభినందించారు. బాలసదన్ పరిసరాలను శుభ్రంగా ఉంచి, మొక్కలు నాటి హరితవనం పెంచాలని అధికారులను సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ బాలసదన్‌లో నివసిస్తున్న అనాథ పిల్లలకు ఎటువంటి లోటు లేకుండా అన్ని విధాలుగా సంరక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ బాలసదన్‌లో నివసిస్తున్న బాలికలు కొందరు ఇద్దరు తల్లిదండ్రులను కోల్పోయినవారు, మరికొందరు కుటుంబ పరిస్థితులు, నేర నేపథ్యాల కారణంగా అనాథలైనవారు లేదా



కుటుంబాలు విడిచిపెట్టిన అర్ధ అనాథలని తెలిపారు. శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపి పిల్లలతో పాటు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, విద్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రం, టిజిఈడబ్ల్యూఐడిసి ఈఈ రామచంద్రం, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/జడ్చర్ల:** రాజాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శనివారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినీల భద్రత, పాఠశాల ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా కాంపౌండ్ వాల్ నిర్మాణం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం విద్యా సంస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు.

## ఢిల్లీ ఇంటర్‌నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలోని నూతనంగా వస్తున్న ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ సంఘుల ఆధ్వర్యంలో శనివారం అడ్మిషన్ హాల్‌లో ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు నందు, ఏఐవైఎఫ్ నాయకులు రాము, డివైఎఫ్ఐ నాయకుడు ప్రశాంత్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ నాయకుడు భరత్‌లు మాట్లాడుతూ డీఈఓ, ఎంఈఓల అనుమతులు లేకుండా విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్‌కి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందించి లంచగొండి ఎంఈఓ, డీఈఓలను తొలగించి ఈ అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే భౌతికంగా దాడులు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, మహేష్, శేఖర్ అంజి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్‌సి-1989 నియామకాలపై సుమోటో విచారణ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** డిఎస్‌సి 1989 సెకండరీ గ్రేడ్ టీచర్ నియామకాలలో అక్రమాలున్నాయంటూ దాఖలైన ఫిర్యాదును సంబంధి సంస్థ సుమోటోగా తిరిగి విచారణకు స్వీకరించింది. బిసి బి వర్గానికి చెందిన వీపనగండ్ల గ్రామానికి చెందిన ఎస్.బాపూజీ గౌడ్ తనకు 49–20 మార్కులు వచ్చినప్పటికీ నియామకం నిరాకరించి, ఇంటర్వ్యూకు హాజరు కాని వ్యక్తికి మరియు తక్కువ మార్కులు వచ్చిన మరో అభ్యర్థికి ఉద్యోగాలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. ఆర్‌టిఐ కింద అధికారులు ఇచ్చిన పరస్పర విరుద్ధ సమాచారం, ఇంటర్వ్యూకు రాని వారికి ఉద్యోగాలివ్వడం వంటి అంశాలు ఆరోపణలకు బలమిస్తున్నాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 1989 డిఎస్‌సి నియామకాలకు సంబంధించిన అసలు రికార్డులను సమర్పించాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖాధికారి, డిఎస్‌సి 1989 మెంబర్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేస్తూ, 17.02.2026 లోపు పూర్తి నివేదికతో పాటు అసలు రికార్డులు హాజరు పరచాలన్నారు.

## పిఎంశ్రీ నిధులు వినియోగించాలి



హెడ్‌మాస్టర్లకు కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పీఎం శ్రీ పాఠశాలలకు మంజూరైన నిధులను సంపూర్ణంగా వినియోగించాలని శనివారం కలెక్టర్ వి.సి కార్యాలయంలో నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కెజిబివి ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో అన్నారు. పీఎం శ్రీ స్కీమ్ పరిధిలో ఉన్న పాఠశాలలో యోగా, సైన్స్, గణిత ప్రయోగలకు కావలసిన పరికరాల కొనుగోలు, విద్యార్థులకు విజ్ఞాన, పరిశ్రమల అవగాహన పర్యటనలు, కళలు హస్తకళల వంటి సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాల నిర్వహణ కోసం మంజూరైన నిధులను సమయానికి, సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పి.ఎం. శ్రీ కింద 26 పాఠశాలలకు 20 రకాల గ్రాంట్‌లకు సంబంధించిన బిల్లులు సోమవారం నాటికి ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో అన్ని కార్యక్రమాలు నిర్ణీత కాలవ్యవధిలో సక్రమంగా అమలయ్యేలా ప్రధానోపాధ్యాయులతో నిరంతర సమన్వయం పాటించాలని జిల్లా విద్యాశాఖ అధాకారి (డీఈఓ)కు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఏ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, పి.ఏ.ఓ యాదగిరి, పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## బాలికలే దేశ భవిత మనందరి బాధ్యత

జూనియర్ సివిల్ జడ్జి బి.సాయిమనోజ్

**ప్రజాపక్షం/నారాయణపేట:** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా శనివారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 24న భారతదేశం జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నాం. బేటీ బచావో బేటీ పడావో వంటి ప్రభుత్వ పథకాలు బాలికల రక్షణ విద్యకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఆడపిల్లల పట్ల తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి మారాలని అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి అవగాహన కల్పించారు. రక్షణ కోసం కొన్ని ప్రత్యేక పథకాలు కూడా కల్పించారు. 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి ఉచిత న్యాయము పొందవచ్చు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మి పతి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ న్యాయవాది నందు నామాజీ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కరిష్మా, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ జి.నరసింహ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పార లీగల్ వాలంటీర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ముందు రహదారిపై ప్రయాణించే వాహన చోదకులకు హెల్మెట్ ధరించడం ఆవశ్యకతపై శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రవాణా అధికారి రఘు లు అవగాహన కలిగించారు. హెల్మెట్ ధరించిన వారికి నోట్‌బుక్, పెన్నులు అందజేశారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలు కాపాడుకోవచ్చని, అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రాణాలు కోల్పోతున్నారని రెవెన్యూ అదనపు కలెక్టర్ వారికి అవగాహన కలిగించారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణపేట జిల్లాలో ఈ వేసవికాలం తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో తాగునీటి వేసవి ప్రణాళిక (స్పెషల్ డ్రైవ్)పై డిఆర్‌డిఓ, డిపిఓ, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు ఎంపీఓలు ఏఈలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దామరగిద్ద, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి, నారాయణపేట, మక్తల్, ఊట్కూర్, నర్వ, మాగనూరు, కృష్ణ, మరికల్, ధన్వాడ మండలాలలోని గ్రామాలలో బల్క్‌నీటి సరఫరా జరుగుతుందా లేదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏఏ గ్రామాలలో తాగునీటి సమస్య ఉందో గుర్తించి వీలైనంత తొందరగా ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో మొగులప్ప, డిపిఓ సుధాకర్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ, జగన్‌మోహన్, ఈఈలు రంగారావు, శ్రీనివాస్, మిషన్ భగీరథ, డిఈ, ఏఈలు, జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వెల్దండ :** కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో పాటు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గానుగట్టుతండాలో రూ.4.25 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్నా వంతెనకు స్థానిక సర్పంచ్ కేతావత్ మౌనిక లచ్చిరాంనాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల ప్రజా పాలనలో కల్వకుర్తి నియోజకవర్గానికి దాదాపుగా రూ.12 వందల కోట్లతో అభివృద్ధి పనులకు స్వీకారం చుట్టామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేసి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడుతానని చెప్పారు.

**కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ...**

మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో 33 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ నుంచి మంజూరైన చెక్కులను స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వద్త్యావత్ భాగ్యమ్మపులిసింగ్‌నాయక్, మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్, మూడవత్ శారద హరికిషన్‌నాయక్, మమత లక్ష్మణస్వామి, సత్తూరి ప్రసాద్‌గౌడ్, గున్నెళ్ల శ్రీనివాస్, శ్రీనువాస్‌నాయక్, శ్యాంపూరి శారదచెన్నయ్య, బచ్చలకూర శ్రీనివాస్, సిద్ధగోని రమేష్‌గౌడ్, ఉపసర్పంచుల సంఘుమండలాధ్యక్షుడు బస్నమోని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భూపతిరెడ్డి, కార్యదర్శి శంకర్‌నాయక్, తహాశీల్దార్ భీష్వ కార్తీక్‌కుమార్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్ కాంగ్రెస్‌పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ వెల్దండ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సేవలు కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.అనంతరం కలెక్టర్ ఓపీ నమోదు విభాగం, ల్యాబోరేటరీ, ఇన్ పేషెంట్ వార్డు సహా ఇతర విభాగలను పరిశీలించారు.అదేవిధంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద అస్పత్రిలో రోగులకు అందిస్తున్నా వైద్య సేవలను గురించి ఆరా తీశారు. రోగులకు వైద్యం సక్రమంగా అందుతుందా.. అవసరమైన సదుపాయాలు ఉన్నాయా అనే విషయాలను వైద్యాధికారి డాక్టర్ సింధు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాత ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్నా భవనాలను కలెక్టర్ పరిశీలించి వెంటనే పనులు పూర్తి చేసి వినియోగంలో తీసుకోవాలని డీఎంహెచ్‌ఏను ఆదేశించారు.రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాడని ప్రభుత్వాస్పత్రి వైద్యుల ప్రథమ కర్తవ్యం అని కలెక్టర్ తెలిపారు.ఆయన నాగర్‌కర్నూల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవి కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ బీమానాయక్, స్థానిక తహాశీల్దార్ భీష్వ కార్తీక్‌కుమార్, డాక్టర్లు సింధు, చంద్రాసింగ్ పాల్గొన్నారు.

**గ్రామ సమస్యలపై కలెక్టర్ వినతి...**

మండల కేంద్రంలో ఆయా కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలకు త్వరిత గతిన పరిష్కారం మార్గం చూపాలని స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్‌లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్‌ను విన్నవించారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కారం చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. వారి వెంట వార్డు సభ్యులు సిరుసనగండ్ల శేఖర్, ముదికొండ కవితరమేష్, నాయకులు తిరుపతిరెడ్డి,పుల్లయ్య, మట్ట భరత్ గౌడ్ రోగులు తదితరులున్నారు.

## రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

రైతులకు రాయితీ ఉపకరణాల పంపిణీ చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతు పక్షపాతిగానే పనిచేస్తుందని రైతు రుణమాఫీ, రాయితీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ, రాయితీపై విత్తనాల పంపిణీ, ఎరువుల పంపిణీ, డ్రిప్పు పైపుల పంపిణీ, స్పింకులర్ల పంపిణీ, ట్రాక్టర్ల పంపిణీ, కల్టివేటర్లు , రోటవేటర్లు మందుల పిచికారి యంత్రాలు లాంటి అనేక ఉపకరణాలను రాయితీపై అందిస్తుందని వీటి ద్వారా రైతులకు దాదాపు రూ.20 వేల నుంచి 50 వేల రూపాయలు వరకు లబ్ది చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి మండలం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలకులు రైతుల పేరున అనేక మోసాలు చేశారని, అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఈ రాయితీ వ్యవసాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంను ఎమ్మెల్యే చెప్పారు. రైతుల సౌకర్యార్థం వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభాలను నియంత్రికలను ఇటీవల రూ.50 కోట్లు మంజూరు చేయించి సరి చేయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ నగరం క్లియర్ సిటీ, సేఫ్ సిటీగా అభివృద్ధి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** 10 నిమిషాల అసౌకర్యానికి 100 సంవత్సరాల జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలో ఎస్‌డిఎఫ్ ముడా నిధులతో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నగరాన్ని క్లియర్ సిటీ, సేఫ్ సిటీగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో, హైదరాబాద్ నగరంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతనే మహబూబ్‌నగర్ నగరంలో కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.జానకి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయ సుందరీకరణ కమిటీ చైర్మన్ పోల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లీడర్ రఘు, దేవేందర్ నాయక్, తిరుపతి నాయక్, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రజాపక్షం

క్యాలెండర్ ఆవిష్కరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రభాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రజల పక్షాన పోరాడుతున్న పత్రిక ప్రజాపక్షం అని బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మున్నూరు రవీందర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగార్ ప్రభాకర్ రెడ్డితో కలిసి వారి చేతుల మీదుగా ప్రజాపక్షం నూతన క్యాలెండర్ లను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగార్ ప్రభాకర్ రెడ్డి, మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ అనేక సమస్యలను వెలికి తీయడంలో ప్రజాపక్షం ముందుండాలని ప్రభుత్వం దృష్టికి ప్రజల సమస్యలను తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పీసీ ఇంచార్జి సిల్‌మార్తి, ఆంజనేయులు, వనపర్తి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, చిత్తారి ప్రభాకర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, కల్పిన, మాజీ ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్ సంస్థాగత కార్యదర్శి కేతూరి బుడ్డన్న, సీనియర్ నాయకులు రామన్న వెంకటేశ్వర్లు, ఆఫీస్ సెక్రెటరీ కుమారస్వామి, దాసరాజుల ప్రవీణ్, రెండోవాడు మాజీ కౌన్సిలర్ అలివేల జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, యువ మోర్చా నాయకులు కదిర మధు, లీగల్ కన్వీనర్ విజయభాస్కర్, మాజీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్, మోహన్, సాగర్ , పట్టణ అధ్యక్షులు రాజు, చిన్నరాయుడు పాల్గొన్నారు.

## బిల్లులు రాలేదని అర్ధనగ్న ప్రదర్శన

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రభుత్వం మాట నమ్మి భవనాలు కట్టి బిల్లులురాకపోవడంతో మరణమే శరణ్యమని వాదించి చివరి అంశంగా అర్ధనగ్న ప్రదర్శన చేపడుతున్నట్లు బాధితుడు శేఖర్ తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టాడు. ఈ సంఘటనపై బాధితుడు మాట్లాడుతూ తాను మాజీ సైనికుడినని సర్వీస్ అనంతరం కాంట్రాక్టు పనులు చేయాలని అధికారులను సంప్రదించగా ప్రభుత్వ భవనాలు కట్టించాలని అధికారులు ఆదేశించారు. అధికారుల మాటప్రకారం తాను సొంత డబ్బులు పెట్టి భవనాలు కట్టించానని అట్టి బిల్లులు మూడు సంవత్సరాలనుంచి రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేశారి తాను ఈచర్య చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి బిల్లులు చెల్లించకపోతే పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి




సీనియర్ సివిల్ న్యాయాధికారి వి.రజని

**ప్రజాపక్షం/అమరచింత:** బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి వి.రజని కోరారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీలకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ సమాజంలో చాలా మంది ప్రజలు మైనర్ బాలికలకు వివాహాలు చేయడం సామాజిక నేరమని సూచించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ బాలికలు తీసుకోవాల్సిన పోషక ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల జరిగిన క్రీడా పోటీలలో గెలుపోందిన విద్యార్థినీలకు జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజిని బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరచింత ఎస్సై స్వాతి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, దేశాయి ప్రకాష్ రెడ్డి, సేవా సంస్థ అధ్యక్షులు కలాం పాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, పద్మమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు షేక్ అహ్మద్, సిఆర్‌పి స్వామి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## యశోద ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సకాలంలో స్పందించి వాస్క్యులర్, ప్లాస్టిక్ సర్జరీలతో రోగి ప్రాణాలు కాపాడటం జరిగిందని హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్‌భవనంలో శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను ఏర్పాటు తచేసిన విలేకరుల సమావేశంలో కల్వకుర్తి వైద్యులు డాక్టర్ రంజిత్‌కుమార్, డాక్టర్ ఎంవి.చంద్రమౌళి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదురలు మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికిచెందిన జంగయ్య జాజాల(56) అనే వ్యక్తి గత సంవత్సరం అక్టోబర్ 11న గ్లాస్ కటింగ్ మిషన్ వల్ల కుడిచేతికి తీవ్రమైన గాయమైంది. వెంటనే జంగయ్యను కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రిలో ప్రథమచికిత్స చేయించారు. అక్కడి నుండి యశోద ఆస్పత్రి మలక్‌పేటకు తరలించారు. రోగి జంగయ్యను పరిశీలించిన వైద్యబృందం పరీక్షల్లో కుడిబ్రాకియల్ ఆర్టరీలో రక్త ప్రవాహం ఆగిపోయినట్లు గుర్తించి అరుదైన శస్త్రచికిత్స చేసి జంగయ్యచేతిని నయం చేశారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఒకటైన అక్యూట్ లింబ్ ఇస్కిమియా(రక్తనాళం మూసుకుపోవడం) వల్ల చేతిలేదా కాలి భాగానికి రక్తప్రవాహం ఆగిపోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో తక్షణమే చికిత్స చేయకపోతే ఆ అవయవం పనితీరు కోల్పోవడం లేదా ప్రాణాప్రాయం సంభవించే అవకాశం ఉంటుందని వైద్యులు రంజిత్‌కుమార్, చంద్రమౌళి పేర్కొన్నారు. ఇది అత్యంత క్లిష్టమైన, ప్రాణాప్రాయకరమైన కేసు అన్నారు. వాస్క్యులర్ బైపాస్, ప్లాస్టిక్ సర్జరీలతో రక్తప్రవాహాన్ని పునరుద్ధరించి చేతి పనితీరును కాపాడగలి



గామని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో జాగ్రత్తగా పర్యవేక్షించారు. రక్తప్రవాహం సక్రమంగా పునరుద్ధరించబడింది. చేతి మృదువైన కండరాలు, కణజాలాన్ని పునరుద్ధరించేందుకు చేసిన సాఫ్ట్‌టిష్యూ గ్రాఫ్టింగ్ విజయవంతమైంది. రోగి పరిస్థితి స్థిరంగా ఉండి 16–10–2025న ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఇంట్లో సాధారణ ఆహారం తీసుకోవాలని, సూచించిన మందులు (యాంటిబయోటిక్స్, యాంటికాగ్యులెంట్స్, స్టాటిన్లు, ఐరన్‌సప్లిమెంట్లు) క్రమం తప్పకుండా వాడాలని, ఒకవారం తర్వాత ఔట్‌పేషెంట్ విభాగానికి వచ్చి పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సమావేశంలో ఎ.వాసు, కిరణ్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, రోగి జంగయ్య ఉన్నారు.



## మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటి ఆదేశాల మేరకు రిటర్నింగ్ ఆఫీసర్లు, ఏఆర్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల సహకారంతో జోనల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీంలను నియమించామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, పట్టణ పరిధిలో 93,020 మంది ఓటర్లు ఉండగా, వార్డుల వారీగా 144 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో 48 వార్డులను 16 వార్డుల చొప్పున మూడు విభాగాలుగా విభజించామన్నారు. కార్యాలయాన్ని ఆనుకోని ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీ భవన్‌లను నామినేషన్ కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అధికారులు కట్టెబోయిన అంజయ్య, జ్ఞానేశ్వరి, బాలు,కోటయ్య, షెహబాజ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే దీపాలు ఆరిపోవడం బాధాకరం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే దీపాలు వృత్తి నిర్వహణలో భాగంగా పాఠశాలకు వస్తున్న క్రమంలో కారు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి బోయిన లింగయ్య అధ్యక్షతన ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుల సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజంలో ఉన్న చెడులు తొలగించి బావి భారతపౌరుల జీవితాల్లో వెలుగులు నింపే దీపాలు ఆరిపోవడం బాధాకారమన్నారు. ఈ మేరకు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కస్తూర్బా ప్రిన్సిపాల్ కల్పన, రావులపల్లి ప్రధానోపాధ్యాయురాలు గీతారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతులకు చేరో రూ. ఒక లక్ష ఆర్థిక సహాయంతోపాటు గాయపడిన ఉపాధ్యాయులకు రూ.50వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేయడంతోపాటు ప్రభుత్వం తరపున సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో అవగాహన ఒప్పందంతో ముందుకు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాబోయే నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికల్లో జిల్లా కమిటీ సూచన మేరకు పట్టణంలో కాంగ్రెస్ పార్టీతో అవగాహన ఒప్పందంతో ముందుకు వెళుతామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరాస్వామి స్పష్టం చేశారు. సిపిఐ పట్టణ కమిటీ సమావేశం ముండ్ల ముత్యాలు అధ్యక్షతన జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వీరస్వామి పాల్గొని మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ ను కార్పొరేషన్‌గా మార్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.పట్టణంలో ప్రజా సమస్య లపై సిపిఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలనీ పిలుపునిచ్చారు.సమావేశంలో పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి,సహాయ కార్యదర్శి వి లెనిన్,ఆర్ టి సి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి నందం, అక్కలయ్య, సుజాత, జె విజయ, దోటీ పాండరీ, యూసుఫ్, సర్దార్, ఆర్ సీతా రాములు, కె నారాయణ బొగరి రామ కోటి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు సహకరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రానున్న మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమించబడిన ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలకు నియమించబడిన ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ ఆధారంతో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదువుకొని తప్పులు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ నుండి పోలింగ్, కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అన్ని అంశాల పట్ల ముందే సంసిద్ధం కావాలని ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ప్రాథమిక విద్య బలోపేతానికి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల కృషి కీలకమైందని జిల్లా విద్యాశాఖ అధికారి కె అశోక్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన క్యాలెండర్‌ను ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేలా హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివి నాయక్, తొగరు రామయ్య, మర్రు శ్రీనివాసరావు, వీరారెడ్డి, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

# పోలీసు ఫిట్‌తోనే సమాజం ఫిట్

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పోలీసు ఫిట్‌గా ఉన్నప్పుడే సమాజం ఫిట్‌గా ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి వారి కుటుంబ సభ్యుల సంక్షేమంలో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి కె నరసింహాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమంలో జిల్లా ఎస్‌పి చొరవ ప్రశంసనీయమని అభినందించారు. విరామం లేకుండా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాల ఆరోగ్యం పట్ల, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేస్తుంటారన్నారు. పని భారం కారణంగా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోలేక పోతున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు ఇటువంటి ఉచిత మెగా వైద్య శిభిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. పోలీసుల సంక్షేమం కోసం ఎస్‌పి ఆధ్వర్యంలో అత్యాధునిక సదుపాయాలతో జిమ్, సెంట్రల్ ప్రొవిజనల్ క్యాంటీన్ ఏర్పాటు, క్రీడా మైదానాలు అభివృద్ధిని గుర్తు చేశారు. జిల్లా ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పని ఒత్తిడి, పని భారంతో సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్నారని అన్నారు. విధులు నిర్వహిస్తూనే కుటుంబ బాధ్యతలను, వ్యక్తిగత ఆరోగ్యాన్ని శ్రద్ధ వహించాలని తెలిపారు. సరైన సమయంలో దూర ప్రాంతాలకు వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్నారని దీనిలో భాగంగానే సిబ్బంది సంక్షేమ దృష్ట్యా కార్పోరేట్ స్థాయి వైద్య పరీక్షలు శిభిరం ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. శిభిరంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది, సూర్యాపేట హెల్తీఫై హాస్పటల్ యాజమాన్యం, సూర్యాపేట జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన శిభిరంలో వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, గుండె పరీక్షలు, కిడ్నీ, కాలేయము, కొలస్ట్రాల్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఆసుపత్రి వైద్యులు గీతాలక్ష్మి, డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, నర్సింహాచారి, సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, ఆర్‌ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, హెల్తీఫై ఆసుపత్రి నిర్వాహకులు చలపతిరావు, యామా ప్రభాకర్ పాల్గొన్నారు.

# యూరియా ఆన్‌లైన్ యాప్‌తో ఇబ్బందులు పడుతున్నాం

వెంటనే రద్దు చేయాలని రైతు రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి



**ప్రజాపక్షం/చండూరు:** రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారిన యూరియా ఆన్‌లైన్ యాప్‌ను వెంటనే రద్దు చేసి రైతులకు పాత పద్ధతి ప్రకారమే సరిపడ యూరియాను అందించాలని తెలంగాణ రైతు సంఘం చండూరు మండల కార్యదర్శి బండమీది వెంకన్న డిమాండ్ చేశారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్ధార్ కార్యలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండమీది వెంకన్న మాట్లాడుతూ రైతు ఆన్‌లైన్ విధానం చేసుకోవాలంటే స్మార్ట్ ఫోన్ లేకపోవడం, అవగాహన లేకపోవడంతో స్లాట్ బుక్ చేసుకోవడంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సిహెచ్ ఊషయ్య, మందడి వెంకట్‌రెడ్డి, ఆలేటి జగన్ , చీకడిమామిడి యాదయ్య, వెంకన్న, దాసరి యాదయ్య ,దాసరి రాంబాబు , రాంబాబు పాల్గొన్నారు.



యుద్ధ ప్రాతిపదిన రైతులకు యూరియా అందించాలి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** యాసంగి సీజన్లో వరి నాటు వేసి దాదాపు 20 నుండి 25 రోజులు కావస్తుంది రైతులకు సకాలంలో యూరిమా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర శేఖర్ అన్నారు.యూరియా ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తాహసిల్దార్‌కి మెమోరడం ఇవ్వడం జరిగింది.ఈసందర్భంగా బుర్ర శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని చెప్పటంతో స్మార్ట్ ఫోన్లో ఉన్న రైతులు యూరియా బుకింగ్ చేసుకుంటే రైతులు ఉన్న గ్రామం కాకుండా చుట్టుపక్కల 15 నుండి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు మీ యూరియా వచ్చిందని మీరు అక్కడికి పోయి తీసుకోమని చెప్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరసింహ,నిరంజన్, వెంకటయ్య,కొమరయ్య,రంగారెడ్డి,యాదగిరి రెడ్డిలు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ

సూర్యాపేట మున్సిపల్ ఓటర్ జాబితాపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటిలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు విడుదల చేసిన తుది ఓటర్ జాబితాలో లోపాలు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఆయా రాజకీయ పార్టీల నేతల్లో, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న దానిపై తర్జన భర్జన పడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అధికారులు ప్రకటించిన ఓటర్ల జాబితాలో కుల రిజర్వేషన్లు, వార్డుల వారీగా కేటాయింపుల్లో వ్యత్యాసాలు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించలేదని ఆరోపిస్తూ సూర్యాపేట పట్టణానికి చెందిన డి శివప్రసాద్ అనే వ్యక్తి ఈనెల 19వ తేదీన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయసేన్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది ఆర్ శ్రీధర్ వాదన వినిపించగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం మున్సిపల్ అధికారుల తరపున కొంతమంది న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. అనంతరం కోర్టు స్పందిస్తూ ఈ అభ్యంతరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కుల, వార్డుల రిజర్వేషన్‌ల కేటాయింపుల్లో పిటిషనర్ లేవనెత్తిన లోపాలను వాదించే అవకాశం కల్పించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్య ఆదేశాల ప్రతిని స్వీకరించి 7 రోజులలోపు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని 20 ఫిబ్రవరి 2026న తిరిగి విచారణ చేపట్టనున్నట్లు చెప్పింది. దీంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటర్ల తుది జాబితా, కుల రిజర్వేషన్ అంశాలపై కలెక్టర్ తీసుకునే నిర్ణయం ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ జారీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## వారం గడిచినా పెద్దపులి ఆచూకీ ఏదీ?

భయం గుప్పిట్లో ఇబ్రాహింపురం గ్రామం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో పులి సంచరిస్తూ ఆవులు దూడలపై దాడి చేసి చంపుతున్నా, రాత్రి సమయాల్లో ప్రజలు ప్రయాణిస్తున్న బాటలకు అతి దగ్గర్లోనే సంచరిస్తున్న ఇంతవరకు పులిని కట్టడిచేసే పనులు, గ్రామస్తులను భయం నుంచి కాపాడే చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఇబ్రాహింపురం గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏ రోజు ఎటువైపునవచ్చి పులి దాడి చేస్తుందోనని భయాందోళనలో రైతులు, పరిసరప్రాంత ప్రజలు ఉన్నారు. ఓ వైపు పులి భయంతో గజగజ వణుకుతున్న తరుణంలో ఫారెస్ట్ జిల్లా అధికారులు పులిని ఏమి అనొద్దు, మీ మీద కేసులు ఐతాయి, లోపలేస్తారు అని బెదిరించడం తప్ప, ప్రజలకు భరోసా మీద అంత శ్రద్ద పెట్టడం లేదని అంటున్నారు. అదిగో పులి అని జాడ తెల్వగానే.. ఫారెస్ట్ అధికారులు తూతూ మంత్రంగా పర్యవేక్షణ చేస్తున్నారూ గాని, అటవీ శాఖ ప్రత్యేక టీంల ద్వారా పులిజాడ తెలుసుకొని ప్రజలకు భయం నుండి విముక్తి కల్పించడం లేదని వాపోతున్నారు. వీలైనంత త్వరగా పులి జాడ కనుక్కొని పరిసర ప్రాంతాల ప్రజలకు భయం నుండి విముక్తి కల్పించాలని వేడుకుంటున్నారు. లేని యెడల పెద్దఎత్తున గ్రామ ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## బాలిక సాధికారతతోనే నవసమాజ నిర్మాణం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బాలిక సాధికారతతోనే నవసమాజ నిర్మాణం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడుతూ బాలికలు అకాశమే హద్దుగా ఎదుగాలన్నారు. బాల్య వివాహాలు అనేవి బాలికల ఎదుగుదలకు శాపాలు అన్నారు. భయం వీడి 1098, చైల్డ్‌లైన్, సఖి కేంద్రాన్ని ఆశ్రయించాలని కోరారు. చట్టం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని బరోసా ఇచ్చారు. డిసిపిఓ రవి కుమార్, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, సఖీ కేంద్రం సిఏ హేమలత, పాఠశాల ఎస్ఓ ఆసియా జబిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహారం అన్నప్రసాదం విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఉమ్మడి జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి హెచ్చరిక

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,పరిశుభ్రమైన సురక్షితమైన ఆహారం అన్నప్రసాదం విషయంలో నిబంధనలను ఉల్లంఘించిన ఎడల ఆహార పరిరక్షణ ప్రమాణాల చట్టం ప్రకారం కఠినంగా శిక్షించబడతారని ఉమ్మడి జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో తనిఖీలు చేపట్టారు.చెర్వుగట్టులో ప్రారంభమైన వార్షిక బ్రాహ్మోత్సవాలలో భక్తులకు నాణ్యమైన, పరిశుభ్రమైన అన్నప్రసాదం,లడ్డు ప్రసాదం అందే విధంగా ఆహార పరిరక్షణ పర్యవేక్షణ తనిఖీలను నిర్వహించారు.ఆలయ ప్రసాదం తయారీ కేంద్రంలో ప్రసాదం తయారీకి సంబంధించిన ముడి పదార్థాల స్వీకరణ,నిల్వ విధానాలు,తయారీ ప్రక్రియలు,పరికరాల శుభ్రత,నీటి వినియోగం,వ్యర్థాల నిర్వహణ,సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత తదితర అన్ని అంశాలను సవివరంగా పరిశీలించారు.భక్తులకు అందిస్తున్న లడ్డూ ,పులిహోరలను బ్యాచ్ వారీగా తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ ప్రయోగశాల ద్వారా తక్షణ స్పాట్ పరీక్షలు చేపట్టారు.తనిఖీల సందర్భంగా గమనించిన లోపాలు,మెరుగుపరచాల్సిన అంశాలను నమోదు చేసి, ఆహార భద్రత , పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన పరిశీలనలు,సవరణ చర్యలను చేపట్టాలని ఆలయ ఈవోకు సూచనలు జారీ చేశారు. బ్రహ్మోత్సవాల కాలమంతా ఆహార నాణ్యతపై కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. గుట్కా పొగాకు లాంటివి నమిలి ఆలయ పరిసర ప్రాంతాలను అపరిశుభ్రం చేయకూడదని హెచ్చరించారు.



## జాన్‌పహాడ్ దర్గా సర్వమత సమ్మేళనానికి ప్రతీక

మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్

**ప్రజాపక్షం/పాలకవీడు :** జాన్‌పహాడ్ దర్గా సర్వమత సమ్మేళనానికి ప్రతీక అని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ శాఖల మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. శనివారం ఉర్సు సందర్భంగా మండలంలోని జాన్‌పహాడ్ దర్గాను ఆయన దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉర్సు సందర్భంగా దర్గాను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇక్కడికి అన్ని వర్గాల ప్రజలు వస్తారని హిందు, ముస్లీం, సిక్కు, క్రైస్తవులందరూ అందరూ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. అందరి మధ్యకు వచ్చి స్వామి వారిని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. అల్లా దయ వల్ల అందరూ మంచిగా ఉండాలని కోరారు. దర్గా షరీఫ్ ఇక్కడ గొప్ప మహనీయులు (బుజుర్గాన్ ఏ దీన్) కొలువై ఉన్నారన్నారు. ఉర్స్ ప్రతి ఏటా చాలా బాగా జరుగుతుందని, ఇన్షా అల్లాహ్ వచ్చే ఏడాది కూడా ఇంకా బాగా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిఎస్‌పి ప్రసన్న కుమార్, మైనార్టీ సంక్షేమ అధికారి నరసింహారావు, తహశీల్దార్ కమలాకర్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహబూబ్, ముజవర్ జానీ బాబా, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా గణతంత్ర దినోత్సవ వేడుకలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా ఘనంగా నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. పరేడ్ నిర్వహణ వేదిక, అతిథుల సీటింగ్, జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, విద్యుత్ సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, పోలీసు శాఖ సమన్వయంతో పరేడ్ రిహార్సల్స్ సమయానికి పూర్తిచేయాలని చెప్పారు. పోలీసుల పరేడ్ సాధన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు శకటాల ప్రదర్శన, కార్యక్రమాల సమన్వయం, అతిథులకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్, ప్రవేశనిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కాగా ఈనెల 26న ఉదయం 9 గంటలకు నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఏఎస్‌పి రమేష్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఐఎఎస్ ఐపిఎస్ అధికారుల ఆదర్శ వివాహం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఎలాంటి ఆడంబరం లేకుండా రిజిస్టర్ వివాహం చేసుకున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్నత చదువులు చదివి బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ఎంతో నిరాడంబరంగా చౌటుప్పల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వివాహాన్ని చేసుకుని సమాజానికి సరి కొత్త సందేశాన్ని ఇచ్చారు. చౌటుప్పల్ మండలం లింగారెడ్డి గూడెంకు చెందిన ఐపీఎస్ శేషాద్రిని రెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, అతి కొద్దిమంది కుటుంబ సభ్యులు సన్నిహితులు, ఉన్నతాధికారుల సమక్షంలో రిజిస్టర్ కార్యాలయంలో సంతకాలు చేసి పూల దండలు మార్చుకొని ఒకటయ్యారు.

## ప్రజాసేవే పోలీసుల అభిమతం..

పోలీసులపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వంలో ఉన్న ప్రజాసేవే పోలీసుల అభిమతంగా పోలీసు శాఖ పని చేస్తుందని సూర్యాపేట జిల్లా పోలీసు సంఘం అధ్యక్షులు రామచంద్ర గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడ నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ పట్టణంలో పోలీసులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాసేవలో ఎలాంటి తారతమ్యం లేకుండా జిల్లా పోలీసు శాఖ నిరంతరం పనిచేస్తుందని ప్రజల పక్షాన నిలుస్తున్న వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని గౌరవప్రదమైన స్థాయిలో ఉన్న వారు మాట్లాడే మాటలు కావన్నారు. పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా పోలీసు శాఖ ప్రతిష్ట దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు తప్పుడు ఆరోపణలు చేసే వారిపై చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీ వారు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారనేది పోలీసు శాఖకు ముఖ్యం కాదని ప్రజల భద్రత, రక్షణ పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
ఆదివారం
25-01-2026
www.prajapaksham.in

విజయ్‌దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'వీడీ 14' మూవీ నుంచి క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేయబోతున్నట్లు ప్రకటించారు.

రీల్


## 'చాయ్ వాలా' సాంగ్ రిలీజ్ చేసిన సజ్జనార్



శివ కందుకూరి హీరోగా హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్స్ రాధా వి పాపుడిప్పు నిర్మించిన చిత్రం 'చాయ్ వాలా'. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, తేజు అశ్విని, రాజ్కుమార్ కసిరెడ్డి, చైతన్య కృష్ణ, వడ్లమాని శ్రీనివాస్ ముఖ్య పాత్రల్ని పోషించారు. ప్రమోద్ హర్ష ఈ మూవీకి దర్శకత్వం వహించారు. వెంకట్ ఆర్ పాపుడిప్పు సహ నిర్మాతగా వస్తున్న ఈ సినిమాకి ప్రశాంత్ ఆర్ విహారి సంగీతమందించారు. ఈ మూవీని ఫిబ్రవరి 6న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో టైటిల్ సాంగ్ను విడుదల చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నీలోఫర్ ఫౌండర్ బాబురావు, కిమ్స్ ఎండీ రవి కిరణ్ వర్మ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ 'మన జీవితంలో చాయ్ అనేది ఎంతో ముఖ్యమైనదిగా మారింది. ఈ 'చాయ్ వాలా' టైటిల్ సాంగ్ చాలా బాగుంది. శివ కందుకూరి లాంటి యంగ్ హీరో, రాజీవ్ కనకాల లాంటి సీనియర్ యాక్టర్స్ ఇందులో నటించారు. నీలోఫర్ బాబుగారు అందరికీ స్ఫూర్తి. ఆయన ఈ మూవీని ఎక్కువగా ప్రమోట్ చేయాలి. ఫిబ్రవరి 6న ఈ చిత్రం రాబోతోందని అన్నారు.నీలోఫర్ ఫౌండర్ బాబురావు మాట్లాడుతూ 'నేను చాయ్తోనే ఈ స్థాయికి వచ్చాను. ఈ 'చాయ్ వాలా' కార్యక్రమానికి నన్ను పిలవడం ఆనందంగా ఉంది. చాయ్ అంటే అందరికీ ఓ ఎమోషన్. చాయ్ వాలా అనే పేరు పెట్టడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఓ చాయ్ వాలా దేశానికి ప్రధాని అయ్యారు. ఈ చాయ్ వాలా మూవీతో టీం అందరికీ మంచి గుర్తింపు రావాలి. సజ్జనార్ హస్తవాసి చాలా మంచిది. ఆయన చేతుల మీదుగా పాట రిలీజ్ అవ్వడం సంతోషంగా ఉంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కిమ్స్ ఎండీ రవి కిరణ్ వర్మ, నీలోఫర్ కేఫ్ ఎండీ శశాంక్, రాజ్ కందుకూరి, శివ కందుకూరి, ప్రమోద్ హర్ష, రాజీవ్ కనకాల ,సహ నిర్మాత వెంకట్ ,కెమెరామెన్ క్రాంతి వర్ల, ప్రశాంత్ ఆర్ విహారి, సురేష్ బనిసెట్టి ఎడిటర్ పవన్ నరవ, స్క్రీన్ ప్లే రైటర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## 'రాకాస' గ్లింప్స్ రిలీజ్

జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్స్ ఉమేష్ కుమార్ బన్సాల్తో కలిసి నిహారిక నిర్మిస్తోన్న చిత్రం 'రాకాస'. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో సంగీత్ శోభన్ ఈ చిత్రంతో మొదటి సారి సోలో హీరోగా తెరపైకి రాబోతోన్నారు. ఈ సినిమాకి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని ఏప్రిల్ 3న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో తాజాగా 'రాకాస' గ్లింప్స్ వదిలి అందరిలోనూ చిత్రం మీద ఆసక్తిని రేకెత్తించారు.'యుగయుగాలుగా ప్రతీ కథలో ఒక సమస్య.. ఆ సమస్యను ఛేదించడానికి ఓ వీరుడు పుడతాడు.. ఆ వీరుడు ఎవరో అని తెలిసేలోపే నిశ్శబ్దంగా పని ముగిస్తాడు.. ఈ కథలో ఆ వీరుడు నేనే' అంటూ ఓ రేంజ్ లెవెల్ ఎలివేషన్ ఇస్తూ గ్లింప్స్ సాగింది.



అయితే ఆ తరువాత ఒక్కసారిగా అది కామెడీ, సెటైరికల్ టర్న్ ఇచ్చుకుంది. ఇక ఇందులో సంగీత్ శోభన్ తన కామెడీ టైమింగ్తో మళ్లీ మెప్పిస్తాడని, అందరినీ ఆకట్టుకుంటాడని ఈ గ్లింప్స్తోనే చెప్పేశారు. ఈ ట్రెండ్కి తగ్గట్టుగా కొత్త కథతోనే మరో ప్రయోగం చేస్తున్నట్టుగా ఈ గ్లింప్స్ చెబుతోంది. ఇక ఇందులో సంగీత్ శోభన్ తనలోని మరో కోణాన్ని చూపించేలా కనిపిస్తున్నారు.కామెడీతో పాటుగా ఓ కొత్త పాయింట్ను, కొత్తదనాన్ని చూపించేలా కనిపిస్తోంది. అనుదీప్ దేవ్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రానికి రాజు ఎదురోలు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.కథ, స్క్రీన్ప్లే, డైలాగ్స్, దర్శకత్వం: మానస శర్మ , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేష్ , ఆడిషన్ స్క్రీన్ప్లే: మహేష్ ఉప్పాల, సంగీతం: అనుదీప్ దేవ్ , సినిమాటోగ్రాఫర్: రాజు ఎదురోలు యాక్షన్ కొరియోగ్రాఫర్: విజయ్.

## ఏప్రిల్ 10న 'స్వయంభు'



కార్తికేయ 2తో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్ తన 20వ చిత్రం 'స్వయంభు'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. హిస్టారికల్ యాక్షన్ ఎపిక్ కి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. టాప్ క్లాస్ నిర్మాణ విలువలు, పవర్ ఫుల్ పాన్-ఇండియా విజన్ తో వస్తున్న స్వయంభు నిఖిల్ అత్యంత ప్రతిష్టాత్మక వెంచర్లలో ఒకటిగా నిలుస్తుంది. స్వయంభు ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. సమ్మర్ రిలీజ్ కి ఇది పర్ఫెక్ట్ డేట్.స్వయంభు విఎఫ్ఎక్స్ అద్భుతంగా వుండబోతున్నాయి. ఇండియాలో టాప్ విఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం వర్క్ చేస్తున్నాయి.స్వయంభు నిఖిల్ కెరియర్ లో హైయెస్ట్ బడ్జెట్ సినిమా. రాజమౌళితో ఐకానిక్ సినిమాలు అందించిన సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ కి పనిచేయడం విశేషం. కేజీఎఫ్, సలార్ ఫేం రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఎం. ప్రభాకరన్, రవి ందర్ ప్రొడక్షన్ డిజైనర్స్ గా వ్యవహరిస్తున్నారు.

## 'సుమతి.. సుమతి' పాట విడుదల

విజన్ మూవీ మేకర్స్ బ్యానర్పై సాయి సుధాకర్ కొమ్మలపాటి నిర్మాతగా ఎం ఎం నాయుడు రచన దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం



సుమతీ శతకం. అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో తేజ, మహేష్ విట్ట, ప్రసాద్, ఆకెళ్ళ గోపి కృష్ణ, కిరణ్ విజయ్, మిర్చి కిరణ్, నెల్లూరు నీరజ, మలక్పేట్ శైలజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి నహిద్ మహమ్మద్ ఎడిటింగ్ చేయగా ఎస్ హలేష్ సినిమాటోగ్రాఫర్గా చేశారు. ఫిబ్రవరి 6వ తేదీన మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ చిత్రం నుండి 'సుమతి సుమతి...'.అనే పాటను రిలీజ్ చేశారు. కృష్ణ మాదినేని రాసిన ఈ పాటకు గోల్ దేవరాజ్ స్వరాన్ని అందించగా సుభాష్ ఆనంద్ సంగీతం సమకూర్చారు. నా కుట్టీ కుట్టీ సుమతీ, నా చిట్టీ చిట్టీ సుమతీ...' అంటూ సాగిన ఈ సాంగ్ విజువల్స్ చూస్తే అమర్దీప్ తాను ప్రేమించిన అమ్మాయి గురించి పాడుతున్నట్లు తెలుస్తుంది. అలాగే పాటలోని డాన్స్ స్టెప్స్ కూడా సింపుల్గా ఉంటూనే సరికొత్తగా ప్రేక్షకులను ఆకర్షించేలా ఉన్నాయి. యువత తమ ప్రేయసిని తలుస్తూ పాడుకునేలా ఈ పాట చార్ట్ బస్టర్ అవుతుందని అర్థం అవుతుంది. ఇప్పటికే ఈ సినిమా నుండి విడుదలైన 'ఎక్కడే ఎక్కడే' పాట ప్రేక్షకుల పట్ల చక్కటి స్పందనను అందుకుంది.

## 'జమాన' సెన్సార్ పూర్తి



సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జమాన'. భాస్కర్ జక్కుల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. తేజస్వి అడప నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ఇటీవల గ్రాండ్ గా జరిగింది, తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయి, యు/ఏ సర్టిఫికెట్ పొందిన ఈ మూవీ జనవరి 30న థియేటర్స్ లో విడుదల కాబోతోంది.ఈ సందర్భంగా నిర్మాత తేజస్వి మాట్లాడుతూ జమాన సినిమా డిఫరెంట్ గా ఉంటుంది. మంచి థ్రిల్లర్ సబ్జెక్ట్ తో ఈ సినిమాను తీయడం జరిగింది. సినిమా ఆద్యంతం వినోదంతో పాటు ఊహించని ట్విస్ట్ లు ఉంటాయి. ఈ సినిమాను దర్శకుడు భాస్కర్ చాలా గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే తో నడిపించారు. సినిమా తప్పకుండా అందరిని అలరిస్తుందని చిత్ర తెలిపారు. ఎమ్.జి మూవీస్ అచ్చిబాబు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రముఖ ఎడిటర్ ఎం అర్ వర్మ ఎడిటింగ్ చేశారు, నేటి యువతరం ఆలోచనలకు అద్దం పట్టే చిత్రమిది. హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. జమాన చిత్రంలో చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుంది' . నేటి యూత్కి కనెక్ట్ అయ్యే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి అని చెప్పారు . స్వాతి కశ్యప్, జారా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జగన్ ఏ, ఎడిటింగ్: ఎం.ఆర్.వర్మ, సంగీతం: కేశవ కిరణ్, రచనదర్శకత్వం: భాస్కర్ జక్కుల.

## క్లైమాక్స్ చిత్రీకరణలో గోపీచంద్ చిత్రం

గోపీచంద్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్స్ శ్రీనివాసా చిట్టూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న హిస్టారికల్ మూవీ గోపీచంద్33 తో రాబోతున్నారు. పవన్ కుమార్ ప్రజెంట్స్ చేస్తున్న ఈ చిత్రం గోపీచంద్ కెరీర్లోనే అత్యంత భారీ చిత్రాలలో ఒకటిగా రూపొందుతోంది.ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ పర్యవేక్షణలో చిత్ర బృందం భారీ, హై ఇంటెన్సిటీ క్లైమాక్స్ సీక్వెన్స్ ని షూటింగ్ను ప్రారంభించింది. రాత్రిపూట చిత్రీకరించే క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా ఒక భారీ సెట్ను నిర్మించారు. దీనిని 25 రోజుల లెన్టీ షెడ్యూల్లో పూర్తి చేయబోతున్నారు. ఈ క్లైమాక్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇన్నోవేటివ్ కథనాలు, టెక్నికల్ ఫినెస్కు పేరుగాంచిన సంకల్ప్ రెడ్డి, భారత చరిత్రలో వెలుగులోకి రాని ఒక శక్తివంతమైన అధ్యాయాన్ని తెరపై ఆవిష్కరించబోతున్నారు. సినిమా విజువల్ వండర్ గా ఉండబోతోంది. గోపీచంద్ ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాకు సౌందర్ రాజన్ సినిమాటోగ్రాఫర్, అనుదీప్ దేవ్ సంగీత అందిస్తున్నారు.

## 'దేవగుడి' ట్రైలర్ లాంచ్

పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణ రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా రూపొందిన చిత్రం 'దేవగుడి'. ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. 'దేవగుడి' సినిమా ఈ నెల 30న థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. హైదరాబాద్ లో ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రంలో స్నేహం, ప్రేమ, ఫ్యామిలీ ఎమోషన్స్ వంటి అన్ని అంశాలు ఆకట్టుకుంటాయి. నిజ జీవిత ఘటనల ఆధారంగా మంచి కథా కథనాలతో ఈ సినిమాను రూపొందించాను. 'దేవగుడి' సినిమాను ఈ నెల 30న థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నాం అని అన్నారు. హీరో అభినవ్ శౌర్య మాట్లాడుతూ హీరో కావాలనేది నా కల. ఎన్నో ఆడిషన్స్ చేశాను, కొన్నేళ్లు వేచి చూశాను. ఈ వేదిక మీద నిలబడటం సంతోషంగా ఉంది. మాకు ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేదు. కేవలం మా



టాలెంట్ ను చూసి బెల్లం రామకృష్ణారెడ్డి అవకాశం ఇచ్చారు. చిన్న సినిమాలో ఏముంటుంది అనుకోవద్దు. చిన్న చిత్రాలను ఆదరిస్తేనే మాలాంటి కొత్త టాలెంట్ బయటకు వస్తుది. మీరంతా మా సినిమా చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.హీరోయిన్ అనుశ్రీ మాట్లాడుతూ తెలుగు హీరోయిన్ గా మీ ముందుకు 'దేవగుడి' చిత్రంతో వస్తుండటం సంతోషంగా ఉంది. ఒక అమ్మాయి ఇండస్ట్రీలోకి వస్తే ఎంత నెగిటివ్ గా మాట్లాడుతారో తెలుసు. నేను ఈ సినిమా చేస్తున్నప్పుడు అలా మాట్లాడిన వాళ్లే ఈ రోజు మా ఇంటికి రా అని పిలుస్తున్నారు. మా ఊరిలోనూ ఈ సినిమా పబ్లిసిటీ చేశారు. ఒకప్పుడు బాధపడిన నేను ఇప్పుడు గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నా అన్నారు.నటుడు రఘుకుంచె మాట్లాడుతూ ఈ సినిమాలో నేను కీలక పాత్రలో నటించాను. సీన్స్తో పాటు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. నా కారుతో పాటు పది పదిహేను సుమోలతో ఛేజింగ్స్ ఉంటాయి. ఇలాంటి భారీ యాక్షన్ సీక్వెన్సులు నా కెరీర్ లో ఎప్పుడూ చేయలేదు అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ కే మదీన్ , డీవోపీ లక్ష్మీ కాంత్ కనిక .

## గణతంత్ర దినోత్సవం నాడు.. లారింగెక్టమీ బాధితులు జాతీయ గీతం

ప్రజాపక్షం/హైదరాబాద్ : వాయిస్ బాక్స్ తొలగింపునకు గురైన (లారింగెక్టమీ) వ్యక్తులకు సామాజిక, మానసిక క్రియాత్మక మద్దతు అందించడంలో లారింగెక్టమీ పునరావాస క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. రోజువారీ జీవన సమస్యలకు పరిష్కారాలను పంచుకోవడం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను (ఎలక్ట్రోలారింక్స్, వాయిస్ ప్రొస్థెసెస్ ద్వారా) మెరుగుపరచడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఈ స్వయం సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. ఈ దిశగా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ విభాగం అనేక సంవత్సరాల క్రితమే లారింగెక్టమీ క్లబ్‌ను ప్రారంభించింది. జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఈ క్లబ్ విశేషంగా తోడ్పడింది. ఈ నిబద్ధతను కొనసాగిస్తూ, ప్రస్తుతం టోటల్ లారింగెక్టమీ పునరావాస సమావేశం నిర్వహించనున్నారు. ఇది స్థితిస్థాపకత, ఐక్యత జీవితాలను పునర్నిర్మించే స్ఫూర్తిని ప్రతిబింబించనుంది. ఈ సందర్భంగా ఈనెల 26న గణతంత్ర దినోత్సవం నాడు, 80 మందికి పైగా లారింగెక్టమీ బాధితులు కలిసి జాతీయ గీతాన్ని పఠించనున్నారు. ఇది లారింగెక్టమీ నుంచి బయటపడిన వ్యక్తులు ఇంత పెద్ద సంఖ్యలో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించడం ఇదే తొలిసారి కావడంతో, లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేందుకు లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు.

## మంచు తుఫాను ముప్పు (మొదటి పేజీ తరువాయి)

16రాష్ట్రాలలో ఎమర్జెనీ ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వాలు హెచ్చరికలు జారీ చేశాయి. అధికారవర్గాల సమాచారం ప్రకారం దాదాపు 20 కోట్లమంది (200 మిలియన్) ప్రజలు ఈ స్నో, ఐసీ, కోల్డ్ తుఫాను పరిధి ప్రాంతాలలో జీవిస్తున్నారు. ఇప్పటికే మంచు తుఫాను ప్రభావంతో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోతున్నాయి. మోకాలు లోతున మంచు పేరుకుపోవడంతో వీధుల్లో ప్రజలు అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. దాదాపు 8000 విమానాలు స్తంభించాయి. రాబోయే నాలుగు రోజుల్లో పరిస్థితి ఉద్ధృతిరీత్యా మరిన్ని విమానాలు స్తంభించిపోతాయి. నేషనల్ వెదర్ సర్వీస్ సమాచారం ప్రకారం, మెంఫిస్, నాష్‌విల్లే, వాషింగ్టన్ డిసి, బాల్టిమోర్, ఫిలిడెల్ఫియా, న్యూయార్క్ తదితర ప్రధాన నగరాలు, ప్రాంతాలు కూడా ఈ మంచు తుఫానుల బారిన పడ్డాయి.

## మిస్సింగ్ సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ తొలగింపు చెల్లదు

### హైకోర్టు తీర్పు



ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్)లో పనిచేస్తూ వైకల్యం కారణంగా వృత్తి శిక్షణ పొందుతూ మిస్సయిన కానిస్టేబుల్ శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు పెన్షన్, ఇతర బెనిఫిట్స్ కల్పించాలని హైకోర్టు తీర్పు చెప్పింది. శ్రీకాంత్ తండ్రి ఫిర్యాదు చేయలేదని చెప్పడం సరికాదని, అదృశ్యమైన కానిస్టేబుల్ తొలగింపు చెల్లదని చెప్పింది. కుటుంబ సభ్యులు కేసు పెట్టలేదని చెప్పి సర్వీసు ప్రయోజనాలు ఇవ్వబోమంటే కుదరదని తీర్పులో పేర్కొంది. ఇలాగైతే ఎవరూ సీఆర్పీఎఫ్ లో పిల్లలను పంపడానికి తల్లితండ్రులు ఎందుకు ఆసక్తి చూపుతారని కేంద్ర ప్రభుత్వాన్ని, సీఆర్పీఎఫ్ అధికారులను ప్రశ్నించింది. రంగారెడ్డి జిల్లాలో సీఆర్పీఎఫ్ పనిచేస్తూ కాలు కోల్పోవడంతో ఢిల్లీలోని సిఆర్పిఎఫ్ కేంద్రంలో వృత్తిపరమైన శిక్షణ పొందుతూ అదృశ్యమైన కానిస్టేబుల్ ఎం. శ్రీకాంత్ శాఖాపరమైన విచారణ జరిపి తొలగించడం సరి కాదంది. అదృశ్యమైన కుమారుడి ఆచూకీ కోసం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేయలేదన్న కారణంగా కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు పెన్షన్ ప్రయోజనాలను నిరాకరించడానన తప్పు పట్టింది. పదేళ్ల క్రితం అదృశ్యమైన వ్యక్తిగా పరిగణించి సర్వీసు ప్రయోజనాలను కల్పించే ప్రక్రియను సిఆర్పిఎఫ్ ప్రారంభించాలని ఆదేశించింది. ఇతర ఉద్యోగులకు వర్తించే పెన్షన్ ప్రయోజనాలను అందజేయాలని, భవిష్యత్తులో శ్రీకాంత్ తిరిగి వస్తే పొందిన ఆ ప్రయోజనాలను తిరిగి చెల్లిస్తామని అతని తండ్రి హామీ పత్రం ఇవ్వాలని షరతు విధించింది. శ్రీకాంత్ మిస్సింగ్ వ్యవహారంపై సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు విచారణ పూర్తి చేయడానికి సవాల్ చేస్తూ అతని తండ్రి అప్పారావు నాలుగేళ్ల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ జస్టిస్ మోహియుద్దీన్ డివిజన్ బెంచ్ పై విధంగా తీర్పు చెప్పింది.

## మేడారంలో తప్పిపోయే పిల్లల ఆచూకీకి 'రిస్ట్ బ్యాండ్లు'

### వనదేవతల జాతరలో చిన్నారులు, దివ్యాంగులకు భద్రత

### డిజిపి బి.శివధర్ రెడ్డి చేతుల మీదుగా సిటిఎంఎస్ ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరలో భక్తుల వెంట వచ్చే చిన్న పిల్లలు, దివ్యాంగులు ఒకవేళ తప్పిపోతే వారి ఆచూకీని తక్షణమే కనిపెట్టి, సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు 'చిల్డ్రన్ ట్రాకింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్' (సిటిఎంఎస్) రిస్ట్ బ్యాండ్లు అద్భుతంగా పనిచేస్తాయని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ బి.శివధర్ రెడ్డి పేర్కొన్నారు. వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ సహకారంతో రూపొందించిన ఈ వినూత్న క్యూఆర్ కోడ్ ఆధారిత రిస్ట్ బ్యాండ్లను, సంబంధిత పోస్టర్లను ఆయన కార్యాలయంలో శనివారం లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 31 వరకు ములుగు జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే మేడారం జాతరకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వివరించారు. ఇంతటి భారీ రద్దీలో చిన్న పిల్లలు, వయోవృద్ధులు, దివ్యాంగులు తప్పిపోయే అవకాశం ఉందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వారి భద్రతను పటిష్టం చేయడానికే ఈ సాంకేతికతను తీసుకొచ్చామని తెలిపారు.

**11 కేంద్రాల్లో 25 వేల రిస్ట్ బ్యాండ్లు..**

ఈ కార్యక్రమం కోసం మొత్తం 25 వేల రిస్ట్ బ్యాండ్లను అందుబాటులో ఉంచారు. ఇవి ఈ నెల 27 నుంచి 31 వరకు 24 గంటల పాటు పనిచేసే 11 కేంద్రాల్లో లభిస్తాయి. హన్మకొండ హయగ్రీవాచారి గ్రౌండ్, హైదరాబాద్‌లోని ఉప్పల్ బస్ స్టేషన్, ఎంజిబిఎస్, కరీంనగర్, పరకాల, పెద్దపల్లి, మంథని, ఏటూరునాగారం, కాటారం బస్ స్టేషన్లతో పాటు వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. స్థానిక పోలీసు సిబ్బంది, మహిళా భద్రత విభాగం, టిజిఎస్ఆర్టిసి సిబ్బంది సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎవరైనా క్యూఆర్ కోడ్ బ్యాండ్ ధరించిన వ్యక్తి ఒంటరిగా కనిపిస్తే వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిజిపి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజిపిలు మహేష్ ఎం.భగవత్, చారు సిన్హా, డి.ఎస్. చౌహాన్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, బి.సుమతి, డాక్టర్ గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వత్రా సానుకూలత

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారని టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. అనేక వరుస ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, సమస్య పరిష్కారంకోసం ఇటీవలికాలంలో స్విట్జర్లాండ్ దగ్గర నుండి క్రెమ్లిన్ వరకూ అనేక దఫాలుగా ముమ్మర దౌత్యకార్యాకలాపాలు కొనసాగాయి. గడచిన గురువారం రాత్రి పొద్దు పోయే వరకూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరపున ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఇద్దరూ మాస్కో వెళ్ళి పుతిన్‌తో సుదీర్ఘ సంభాషణలు చేశారు. రష్యా తూర్పు ప్రాంతం నుండి ఉక్రేన్ తన దళాలను ఉపసంహరించుకోవాలని ఈ చర్చల్లో పుతిన్ పట్టుపట్టారు. ఆ తర్వాత అబుదాభిలో మధ్యవర్తి సమక్షంలో మొదటిసారి రష్యా—ఉక్రేన్ ప్రతినిధులమధ్య శుక్రవారం చర్చలు మొదలయ్యాయి. ఇంకోవైపు దావోస్ వెళ్ళిన ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ గురువారం మాట్లాడుతూ, ఒక బలమైన శాంతి ఒప్పందం దాదాపు సిద్ధంగా ఉందని చెప్పారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ, ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు జెలెన్స్కీ, పుతిన్ ఇద్దరూ ఒప్పందం చేసుకోవడానికి సుముఖంగానే ఉన్నారని, తాను అతిశయోక్తులు చెప్పడంలేదన్నారు. ఈ దశలో క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ వర్కింగ్ గ్రూపు అంగీకారం మేరకు రెండోరోజు చర్చలు కొనసాగినట్లు చెప్పారు. ఐతే ఎవరూ సమస్య పరిష్కారం దిశగా మాట్లాడటంలేదన్నారు. ఈ చర్చల్లో రష్యా ప్రతినిధివర్గానికి రష్యా సైన్య జనరల్ స్టాఫ్ డైరెక్టరేట్ అధిపతి ఇగోర్ కోస్ట్యుకోవ్ నాయకత్వం వహిస్తుండగా, ఉక్రేన్ తరపున రక్షణమంత్రి రుస్టెమ్ ఉమరోవ్ నాయకత్వం వహిస్తున్నారు.

ఒకవైపు చర్చలు జరుగుతుండగా మరోవైపు రెండు దేశాలమధ్యా పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఉక్రేన్‌లో పలుచోట్ల దాడులు జరిగాయి. కీవ్‌లో ఒకరు మరణించగా, రెండో పెద్ద నగరం ఖార్కీవ్‌లో జరిగిన డ్రోన్‌ల దాడిలో 19 మంది గాయపడ్డారు. మొత్తంగా 23 మంది గాయపడ్డారు. వేలాదిమందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారంతా సమస్యలో చిక్కుకున్నారని ఉక్రేన్ విదేశీమంత్రి ఆండీ సైబిహా చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కేవలం తమ ప్రజలపై మాత్రమే దాడులు చేయడంలేదని, చర్చల బల్ల వద్ద కూడా తమపై విమర్శల దాడి చేస్తున్నారని ఆరోపించారు. కీవ్ మేయర్ వితలీ క్లిచ్‌కోవ్ మాట్లాడుతూ, రాజధానిలో దాడుల కారణంగా 6000 భవంతులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, నివాసితులు చలికి వణకిపోతున్నారన్నారు. ఉక్రేన్‌లోని అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు గణనీయస్థాయిలో క్షీణించిపోయినట్లు చెప్పారు.

## 'ఇసి' కీలక భాగస్వామి

(మొదటి పేజీ తరువాయి)

విషయమేమిటంటే ఒకే పేరుతో వేలవేల అభ్యంతరాలు దాఖలు చేయబడ్డాయని రాహుల్ గాంధీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చే నిర్దిష్ట కమ్యూనిటీ బూత్‌ల నుండి ఎంపిక చేసిన ఓట్లను తొలగించారని, బిజెపి ఎక్కడైతే ఘోరంగా ఓటమి పాలైతుందో అక్కడ ఓటర్లు వ్యవస్థ నుండి అదృశ్యమయ్యేలా చేస్తారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ తరహా పద్ధతి అలంద్‌లో కనిపించిందని, రాజురాలో కూడా అదే జరిగిందని, ఇప్పుడు గుజరాత్, రాజస్థాన్‌లో, ఎస్ఐఆర్ విధించబడిన ప్రతీ రాష్ట్రంలోనూ అదే బ్లూప్రింట్ అమలు చేయబడుదతోందని రాహుల్‌గాంధీ ఆక్షేపించారు. అత్యంత తీవ్రమైన నిజం ఏమిటంటే ఎన్నికల కమిషన్ (ఇసి) ప్రజాస్వామ్యానికి దీర్ఘకాలం రక్షకుడిగా ఉందని, కానీ ఓట్ల చోరీ కుట్రలో కీలక భాగస్వామిగా మారిందని ఆరోపించారా. రాహుల్‌గాంధీ ఓట్ల తారుమారును బహిర్గతం చేసిన తర్వాత బిజెపి ఎన్నికల రిగ్గింగ్ తదుపరి స్థాయి నమూనాను అవలంభించిందని ఆరోపించిన గుజరాత్ కాంగ్రెస్ సోషల్ మీడియాలో పోస్టింగ్ నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఎన్నికల రిగ్గింగ్ అంటే మీ ఓటు హక్కును దొంగిలించడమే, గుజరాత్‌లో కొత్త ఆట వెలుగులోకి వచ్చింది. నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్ తర్వాత ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను విడుదల చేసి ఆమోదించడం ప్రారంభించింది. జనవరి 18వ తేదీని అభ్యంతరాలకు చివరి తేదీగా నిర్ణయించగా జనవరి 15 వరకు కొన్ని అభ్యంతరాలు మాత్రమే వచ్చాయని, నిజమైన ఆట ఆ తర్వాత మాత్రమే ఆరంభమైందన్నారు. లక్షలాది అభ్యంతరాలు (ఫారం 7) అకస్మాత్తుగా సమర్పించబడ్డాయని కాంగ్రెస్ పార్టీ గుజరాత్ రాష్ట్ర యూనిట్ ఆరోపించింది. ఎన్నికల కమిషన్ 1.2 మిలియన్ అభ్యంతరాలను విడుదల చేసినప్పుడు, నిర్దిష్ట కులాలు, వర్గాలు, ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు స్పష్టమైందని, ఒకే వ్యక్తి పేరుతో వేర్వేరు పేర్లు, సంతకాలతో డజన్ల కొద్దీ అభ్యంతరాలు దాఖలు చేయగా ఎన్నికల సంఘం 'మౌన ప్రేక్షకుడిగా' ఉండిపోయిందని గుజరాత్ రాష్ట్ర కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యంతరాల గురించి సమాచారం కోరుతూ లేఖ రాసినప్పుడు, వారి నుంచి పూర్తిగా ఎటువంటి స్పందన రాకపోవడం వల్ల ఎన్నికల రిగ్గింగ్‌కు వ్యూహం సిద్ధం చేశారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల కమిషన్ తన బాధ్యత, జవాబుదారీతనం రెండింటినీ అధికార పార్టీకి తాకట్టు పెట్టిందని కాంగ్రెస్ నిప్పులు చెరిగింది.

## తొందరపాటు చర్య

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయన్నారు. సర్ ప్రక్రియను జాగ్రత్తగా, తగినంత సమయంతో నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. తగిన సమయంతో జాగ్రత్తగా తయారు చేసిన ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా సమీక్షించడం మంచి ప్రజాస్వామ్య ప్రక్రియ కావచ్చు, కానీ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్నది ఇది కాదు అని సేన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సర్ ప్రక్రియ తొందరపాటుగా జరుగుతోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఓటు హక్కును నిరూపించుకోవడానికి పత్రాలను సమర్పించడానికి తగినంత అవకాశం ఉన్న వ్యక్తులకు తగినంత సమయం లేదు. ఇది ఓటర్లకు అన్యాయం. భారత ప్రజాస్వామ్యానికి అన్యాయం' అని ఆయన అన్నారు. బెంగాల్‌లో జరిగిన ప్రత్యేక ఇంటెన్సివ్ సమీక్ష సందర్భంగా తన అనుభవం గురించి సేన్ మాట్లాడుతూ, పోల్ అధికారులలో కూడా సమయ ఒత్తిడి స్పష్టంగా ఉందని అన్నారు. కొన్నిసార్లు, ఎన్నికల కమిషన్ అధికారులకే తగినంత సమయం లేనట్లు అనిపిస్తుందన్నారు. 'నేను ఇంతకు ముందు ఓటు వేసిన శాంతినికేతన్‌లోని నా సొంత నియోజకవర్గం నుండి నా ఓటు హక్కును వారు ప్రశ్నించినప్పుడు నా పేరు, చిరునామా, ఇతర వివరాలు అధికారిక రికార్డులలో నమోదు చేయబడ్డాయి. నా పుట్టిన తేదీలో మరణించిన నా తల్లి వయస్సు గురించి వారు నన్ను ప్రశ్నించారు. అయినప్పటికీ స్వయంగా ఓటరుగా, నాలాగే నా తల్లి వివరాలు కూడా వారి సొంత అధికారిక రికార్డులలో భద్రపరచబడ్డాయి' అని ఆయన అన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త తాను ఎదుర్కొన్న డాక్యుమెంటేషన్ సవాళ్లను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో జన్మించిన చాలా మంది భారతీయులకు ఈ ఇబ్బందులు సాధారణమని పేర్కొన్నారు. గ్రామీణ భారతదేశంలో జన్మించిన చాలా మంది భారతీయ పౌరుల మాదిరిగానే (నేను అప్పటి శాంతినికేతన్ గ్రామంలో జన్మించాను) నాకు జనన ధృవీకరణ పత్రం లేదు. ఓటు వేయడానికి నా అర్హతకు నా తరపున మరిన్ని పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది అని ఆయన అన్నారు. సమస్య చివరికి పరిష్కరించబడినప్పటికీ, ఇలాంటి సహాయం లేని పౌరుల పట్ల సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో ఏ పార్టీకి అయినా 'సర్' ప్రయోజనం చేకూర్చగలదా అని అడిగినప్పుడు, సేన్ కచ్చితమైన అంచనాను అందించలేనన్నారు. అయితే ప్రయోజనం పొందుతుందని తమకు మరింత తెలిసిన వారు చెప్పారన్నారు. సర్ సమయంలో మినహాయించబడే అత్యంత దుర్బలమైన విభాగాలపై పేదలు ఎదుర్కొంటున్న నిర్మాణాత్మక ప్రతికూలతలను సేన్ ఎత్తి చూపారు. ఓటింగ్ హక్కులను వినియోగించుకునే విస్తృత వాతావరణం గురించి కూడా ఆయన ఆందోళనలను వ్యక్తం చేశారు. ఏ వయోజన భారతీయ పౌరుడు ఓటు వేయడానికి అర్హత సాధించడంలో ఇబ్బంది పడకుండా ఇసి, సుప్రీంకోర్టు నిర్ధారించుకోవాలన్నారు. ఆచరణాత్మక పరిమితులకు లోబడి, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేయడానికి తాను ఆసక్తిగా ఉన్నానని సేన్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com